
వెల కట్టలేని మీ ఆనందానికి
15 రూపాయలు ఓ లెక్కేనంటారా?

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...


హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక మార్చి-2014
₹15/-






25
శేఖర్
రజతోత్సవ ప్రత్యేక సంచిక



e-mail: shekartoon@yahoo.com   blog: www.shekartoon.blogspot.com






A.R.RAHMAN
CHIDAMBARAM
ZUFF
ZUFF
RAJINIKANTH
MUKESH AMBANI
RAMDEV
BABA
OBAMA
RATAN TATA

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

మార్చి-2014 ✦ సంపుటి-10 ✦ సంచిక-11

Publisher&Editor : Ramu.P
Chief Artist : A.Dayakar
Cartoon Editor : A.V.M
Full Pillar : Bnim
Abroad Promoter : V. Pavan Kumar, USA
Well Wishers : Tanikella Bharani
Jaydev
Mallik
Dr.Sudarsanam
Sanku
Designing : Creative Graphix
Creative Team : Tumbali Sivaji
T.Chandra Sekhar
Rampa
P.V.Narayana
Ramsheshu
Mallikarjun.U

Address : HASYANANDAM,
#8-215/4,
Near Ramalayam,
Po:YERRABALEM
Pin 522 503,
Mangalagiri Mandal,
Guntur dist.
Ph : **9849630637**

email: **hasyanandam @yahoo.com**



హాయ్... సానందంగా...

హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు...
సన్నిహితులకు **హాస్యాభివందనాలు!**

కార్టూన్లు వేయడమంటే నవ్వులాట కాదు!... రెండు బొమ్మలు... నాలుగు మాటలతో ముగించేదీ కాదు...అది ఓ తపస్సుతో చేసే ప్రక్రియ! దానికి నూటికి నూరుపాళ్ళు న్యాయం చేకూరుస్తూ... ప్రజల పక్షాన కుంచె విదిలిస్తూ... 'ఇది తప్పు... ఇది కూడదు... ఇలా చేశారు...' అంటూ ధైర్యంగా చెప్పగలిగే కొంతమంది తెలుగు కార్టూనిస్ట్‌ల్లో శ్రీశేఖర్ కచ్చితంగా ముందు వరుసలో వుంటారు.

ఎందుకంటే తనకి ప్రజల బ్రతుకులు తెలుసు... కష్టాలు తెలుసు... నష్టాలు తెలుసు! అందుకే ఆయన ఆలోచనల నుంచి పుట్టిన ఏ కార్టూనైనా చాలా పదునుగా ఉంటుంది. ఎవరికి గుచ్చుకోవాలో వారికి గుచ్చుకుంటుంది.

ఒక బొమ్మచూడగానే 'ఫలానా ఆర్టిస్ట్ వేసారిది' అని ఎవరైనా చెప్తారు. కానీ ఒక 'ఐడియా' చదవగానే కచ్చితంగా ఇది శేఖర్ ఐడియా అని చెప్పగలిగే భావాలు ఈయనకే స్వంతం!

ఒక ఆశయంతో... ఆత్మస్థైర్యంతో మొదలెట్టిన ఈ 'కెరీర్' దేశపు ఎల్లలు దాటించి 'యువార్ గ్రేట్' అంటూ జనాల చేత ఎలుగెత్తి అభినందింపచేసింది. రాత్రికి రాత్రి వచ్చిన 'గుర్తింపు కాదిది. నిరంతరం తపస్సుతో సాధించిన విజయమిది!

ఒక మామూలు తెలుగు కార్టూనిస్ట్ కసితో తన భావాలను వ్యక్తపరుస్తూ ... సమాజంలోని లోపాలను ఎత్తి చూపుతూ దిగ్విజయంగా పాతికేళ్ళు పూర్తి చేసుకోవడం తెలుగువారమైన మనందరికీ గర్వకారణం.

హాస్యానందం ప్రత్యేక సంచికలు రూపొందించే పరంపరలో ఈ సంచిక రూపొందించినా... ఇదో ప్రత్యేకమైన సంచిక!

ఎందుకంటే పూర్తిగా రాజకీయ కార్టూన్లతో ఈ సంచిక రూపొందింది. కొండంత ఆయన ప్రతిభను అద్దంలో చూపుతున్న మా ఈ ప్రయత్నంలో శ్రీశేఖర్‌గారికి అభినందనలు తెలిపిన సహృదయులందరికీ నా కృతజ్ఞతలు. ముఖ్యంగా ఈ సంచిక రూపొందించడంలో నాకు అన్ని విధాల సహకరించిన మిత్రులు శ్రీహరి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అందరూ ఆరోగ్యంగా...ఆనందంగా...ఉండాలని కోరుకుంటూ...

-రాము.పి
(ఎడిటర్)

ఎక్కడ ఏమేమున్నాయో....

మన జనాలు



@రీ సౌండ్...



✦ **రాజ్యలక్ష్మి, బెంగళూరు**

ఫిబ్రవరి హాస్యానందం చాలా బాగుంది. ముఖ్యంగా ఈ సంచికలో మధ్య పేజీల్లో ప్రచురించిన 'ప్రేమికుల ముచ్చట్లు' సింప్లీ సూపర్బ్!

✦ **జి.శ్రీనివాసరావు,ఖమ్మం**

హాస్యానందం ఫిబ్రవరి సంచికలో 'క్రైట్ ఫన్‌లో' మొదటి బహుమతి వచ్చిన కార్టూన్ అద్భుతంగా ఉంది. కార్టూనిస్ట్‌గారికి మా అభినందనలు. పత్రిక తీర్చి దిద్దడంలో మా కృషికి మా ధన్య వాదాలు.

✦ **ఎమ్. మణికుమారి, హైదరాబాద్**

హాస్యానందం చివరి పేజీ నుంచి మేం చదువుతున్నామంటే నమ్మండి! సుదర్శనంగారి తుంటరి జవాబులు చాలా బావుంటు న్నాయి. ముందువరుసలో ఉండే మల్లిక్ కామెడీ కథ చివర్లో ఉండే సుదర్శనంగారి జవాబులు మా ఫేవరేట్ పేజీలు!

✦ **ఆర్.కృష్ణకుమార్, నెల్లూరు**

ఫిబ్రవరి సంచిక చాలా బావుంది. హాస్యచంద్ర సీరియల్ చదువు తుంటే సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. జంధ్యాల టైప్ కామెడీతో రాస్తున్న రచయితకి మా అభినందనలు. ఇక రియల్ జంధ్యాల సీరియల్ సూపర్!

ఆనందానికి 6 సూత్రాలు



✦ మంచి స్నేహితుల్ని ఏర్పరచుకొని... వారితో మంచి సంబంధం కలిగుండాలి!

✦ ఎదుటివారి నుండి ఏమీ ఆశించకూడదు!

✦ ఎవరికైనా మంచి చేయాలి!

✦ ఎదుటి వాళ్ళతో పోల్చుకోకూడదు!

✦ అందరితో నమ్మకంగా వుండాలి.

✦ ముఖ్యంగా... **హాస్యానందం చదవాలి!**

20,000 రూపాయల బహుమతులు

శ్రీ తలిశెట్టి రామారావు స్మారక కార్టూన్ పోటీలు 2014





మొదటి బహుమతి
రూ.5000/-లు

రెండవ బహుమతి
రూ.3000/-లు

మూడవ బహుమతి
రూ.2000/-లు

విశిష్ట బహుమతులు (20)
ఒకోక్కటి రూ.500/-లు

ఇంకా ఎన్నో ప్రశంసా పత్రాలు...

తొలి తెలుగు కార్టూనిస్ట్

శ్రీ తలిశెట్టిరామారావు జయంతి

సందర్భంగా హాస్యానందం నిర్వహిస్తున్న
ఈ కార్టూన్ పోటీలో మన కార్టూనిస్ట్‌లు పాల్గొని
విజయవంతం చేయాలని కోరుతూ...

నిబంధనలు:

- ✦ కార్టూన్ A4 సైజ్‌లో తప్పనిసరిగ్గా వుండాలి.
- ✦ సబ్జెక్ట్ మీ ఇష్టమే!
- ✦ ఒకరు 4 కార్టూన్లు మాత్రమే పంపాలి.
- ✦ క్యాప్షన్‌లెస్ కార్టూన్‌లైతే మరీ మంచిది.
- ✦ సెలక్ట్‌కాని కార్టూన్లు తిరిగి పంపగోరువారు తగిన స్టాంపుల కవరు జత పరచాలి.
- ✦ పరిశీలనలో వున్నవి, కాపీ కార్టూన్లు పంపవద్దు.
- ✦ కార్టూన్లు హాస్యానందం కార్యాలయానికి మాత్రమే పంపగలరు




కార్టూన్లు మాకు చేరడానికి ఆఖరుతేదీ: 10.4.2014

ప్రారంభం!







చిరంజీవి శేఖర్ గారు

మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలతో
కలకాలం వర్ధిల్లాలని శ్రీరామచంద్ర ప్రభువులని
సీతమ్మతల్లిని మనసారా కోరుకుంటున్నాను
మీ వీరాభిమానుల్లో మొదటివాడైన
బాపు





డియర్ శేఖర్–
హాస్యానందం నీ గురించి ప్రత్యేక సంచిక ప్రచురిస్తుండటం నాకు సంతోషం!... పరమ సంతోషం!!
దాదాపు ఇరవై సంవత్సరాలుగా నువు పత్రికా రంగంలో నీకిష్టమైన 'పొలిటికల్ కార్టూనిస్ట్‌గా' కష్టపడటం... సాధించటం...స్నేహితుడిగా నాకు గర్వకారణం!
నువ్వు కలలు కన్న 'తెలంగాణా' నిన్ను హత్తుకోవడానికి తహతహ లాడుతోంది! గెట్ రెడీ! బ్రదర్!... నీకు మనసారా శుభాకాంక్షలు!

–చంద్ర, ఆర్టిస్ట్, హైదరాబాద్



పొలిటికల్ చురకలేస్తూ
అలరించును శేఖరేయు ఆ కార్టూన్లన్
తలచిన మనలకు నవ్వుల్
తలదించును నాయ'కుళ్ళు'
తమ చేతలకున్

–బ్నిం

కార్టూన్ విలువ తెలిసిన మిత్రుడు శేఖర్.

పేజీల కొద్దీ పూర్తిగా చదివితేగానీ అవగాహన కాని అంశాన్ని ఒక కార్టూన్ చూడగానే తెలుసుకోవచ్చు. మాటలకందని సొగసుల్ని, భాషకందని భావాన్ని, కఠోర సత్యాల్ని, నగ్న నైజాన్ని, వెలుగునీడల సమ్మిశ్రంగా... సమాజహితం కోసం అందించేదే కార్టూన్.

కార్టూన్ విలువ తెలిసిన మిత్రుడు శేఖర్. మాటల ద్వారా కాక కార్టూన్ ద్వారా ప్రయోజన ద్వారాలు తెరిచి ఉంచిన మిత్రుడు శేఖర్‌కు అభినందనలు.

మరెన్నో మంచి మంచి కార్టూన్లు శేఖర్ కుంచె నుంచి జాలువార్చాలని ఆకాంక్షిస్తూ... శుభాకాంక్షలతో...

–కె.వి.రమణాచారి, హైదరాబాద్





శేఖర్...
ఓ స్వయం ప్రకాశక నక్షత్రం

శేఖర్... పొలిటికల్ కార్టూనిస్టులలో తనదైన బలమైన ముద్రవేసుకుని, తన మూలాలనుంచి నిటారుగా నిలబడి ప్రపంచాన్ని దర్శించిన కార్టూనిస్టు. అనేక సంక్షుభిత కాలాల్ని ఎదుర్కొంటున్న సామాన్యుడికి తన కార్టూన్లతో నేనున్నానని ధైర్యం చెప్పిన ప్రజల కార్టూనిస్టు.

మారుతున్న కాలానికనుగుణంగా 'శేఖర్‌టూన్ 'సిండికేషన్‌ని దిగ్విజయంగా నడిపి తెలుగు కార్టూనిస్టు సత్తా భారతదేశం నలుమూలలా చాటినవాడూ శేఖరే... శ్రామికుడూ...నిరంతర స్వాప్నికుడూ అయిన శేఖర్– కార్టూన్ భ్రమలకు దీపపు పురుగులా కాలిపోయిన అనేకమందిలా కాక...ఒక మిణుగురులా స్వయం ప్రకాశంగా ఎదిగి అందరికీ ఒక ఆశ్చర్యచిహ్నం అయ్యాడు!

శేఖర్ ఈ ఏడాది పొలిటికల్ కార్టూనిస్టుగా రజతోత్సవం జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా శేఖర్ అంతరంగం మీ ముందు ఉంచుతున్నాను.

ఈ ఇంటర్వ్యూలో కార్టూన్‌పట్ల ఆయన తపన, ప్రేమ,అంకితభావం అన్నీ మనకు అవగత మవుతాయి.. శేఖర్ ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే....

తెలుగు కార్టూన్ అంటే ఇదే.. అని చట్రాన్ని చూపించిన వారికి ఆ చట్రాన్ని ఛేదించి...అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చి... అమెరికా ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందుకున్న మొట్టమొదటి తెలుగు కార్టూనిస్టు శేఖర్!







పొలిటికల్ కార్టూనిస్టుగా ఈ ఏడాదితో నేను 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్నాను. అంతకు ముందు వారపత్రికలకు కార్టూన్లు వేయడం ఒక నాలుగైదేళ్లుగా ఉంది. ఎమ్మే తెలుగు సాహిత్యం నా చదువు. హైస్కూల్ స్థాయినుంచే క్రియేటివిటీకి సంబందించిన పనులు, కార్యక్రమాలలో పార్టిసిపేట్ చేయడం, గ్రంధాలయాలకు తప్పనిసరిగా వెళ్ళడం అక్కడ చదువుకున్న బాలసాహిత్యం ఇవన్నీ కూడా నన్ను సాహిత్యాభిమానిగా మార్చాయి.

సామాజికంగా వెనుకబడిన కమ్యూనిటీ నుంచి వచ్చాను. మా తల్లి తండ్రులిద్దరూ వ్యవసాయదారులు. మా నాన్న కొంత చదువుకున్న వాడే. తెలంగాణా సాయుధ పోరాట యోధుడు కూడా. చదువుకొని ఏదైనా ఒక ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడవలసిన అవసరాలు నావి. ఈ సాహిత్యమూ, సభలూ గొప్పవాళ్లు కావాలనే వక్తల ప్రసం గాలూ నన్నూ నా దిశనూ మార్చేసాయి. అలా డిగ్రీ చదువుతున్న సమయంలో మార్క్సిస్టు పార్టీతో అనుబంధం పెరిగింది. నల్గొండ జిల్లా వామపక్ష ఉద్యమాలకు పెట్టింది పేరు. ఆ క్రమంలోనే పార్టీ వాల్‌రైటింగ్స్ చేయడానికి, చిన్న చిన్న బొమ్మలు వేయడానికి కమ్యూ నిస్టు పార్టీ నాయకులు నన్ను ఎంకరేజ్ చేసేవారు. ఉద్యమాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పార్టిసిపేట్ చేయడం వల్ల మార్క్సిజాన్ని చదువుకున్నాను. మా తల్లితండ్రులకు నేను ఏం చేస్తున్నానో కూడా తెలుసుకునే అవగాహన శక్తీ, స్థాయి లేవు. వాళ్ళు

కేవలం డిగ్రీ పూర్తిచేయడం ఓ ప్రభుత్వ ఉద్యోగంలో సెటిల్‌కావడం,పెళ్ళి చేయడం అంతవరకే ఆలోచించేవారు.

కాని అప్పటికే సాంస్కృతిక కళారంగాలలో పూర్తిగా మమేకమైపోయిన నాకు ఏదైనా ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపుకావాలనే కాంక్ష గాఢం గా ప్రబలింది.

నేను చదువుకుంటున్న నల్గొండలో ఆర్టిస్టుల,రచయితల కోలాహలం బాగా ఉంటుం దేది. ఆ క్రమంలోనే కార్టూనిస్టుని కావాలనే కోరిక కలిగింది. దానికి కారణం ఈనాడు కార్టూనిస్టు శ్రీధర్.

ఆనాడు ఏనోట విన్నా శ్రీధర్ అద్భుతంగా కార్టూన్లు వేస్తాడని, ఈనాడు పత్రికలో ఆయ నకు ఎనలేని గౌరవం ఉండేదనే ప్రచారం కథలు కథలుగా సాగుతుండేది. ఆ మాటలు ప్రభావం నేను కార్టూనిస్టుని కావడానికి పూర్తిగా కారణమయ్యాయి. నల్గొండ జిల్లాలోని మిగతా కార్టూనిస్టులదీ దాదాపు ఇదే పరిస్థితి.

బీఎస్సీ పూర్తిచేసాక ఎమ్మే కాకతీయ యూనివర్శిటీలో జాయిన్ కావడం జరిగింది. అప్పటికి పూర్తిగా కాకపోయినా అంతో ఇంతో విప్లవభావాలు వచ్చిచేరాయి. అయితే ఈ చదువులూ, కార్టూన్లపై ఆసక్తి వ్యవహారం ఇలా నడుస్తున్నప్పటికి డిగ్రీలో ఉండగానే నాకు వివాహం చేసేసారు.

అమ్మాయి పూర్తిగా నిరక్షరాస్యురాలు.. సో... తప్పనిసరిగా నేను ఏదో ఒక ఉద్యోగం చూసుకోవలసిన పరిస్థితికి నెట్టబడ్డాను.అయినా ఈ మొత్తం స్ట్రగుల్‌లో కెరీర్‌గా కార్టూన్‌ని ఎంచుకోవడానికే మొగ్గుచూపాను.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినప్పటికీ కూడా వాటిని కాదనుకునేంతటి వ్యామోహం కార్టూన్లపై ఏర్పడింది. పత్రికలో కార్టూన్‌ని చూసుకోవడం, కార్టూన్‌లో నాపేరు చూసుకోవడం ఇవన్నీ ఒక దివ్యమైన విషయాలుగా కనిపించేవి.

ఈ దశలో విజయవాడ నుంచి మార్క్సిస్టుల దినపత్రిక ప్రజాశక్తి నుంచి ఆహ్వానం అందింది. అప్పటి ఎడిటర్ మోటూరు హనుమంతరావు గారు మా సంపాదకవర్గంలో చేరమని హాస్టల్‌కి ఉత్తరం రాసారు.

ఆ విధంగా ప్రజాశక్తికి మొట్టమొదటి కార్టూనిస్ట్‌ని అయ్యాను.

1989 జూన్ 16న నా మొదటి కార్టూన్ ప్రజాశక్తిలో ప్రచురణ జరిగింది.

సెల్ఫ్‌గ్రూమింగ్..

ఇక ప్రజాశక్తిలో రోజూ నేను పనిచేసేదంతా హేమాహేమీలతోనే. బొమ్మారెడ్డి గారు తెలకపల్లి రవిగారు నన్ను బాగా ఇష్టపడేవారు. నేను కోరినట్టుగా ఒకవైపు కార్టూన్లు,ఒక వైపు సబ్ ఎడిటింగ్, అడపాదడపా సినిమా రివ్యూలు, సాంస్కృతిక కార్యక్రమాల రిపోర్టింగ్ చేసేవాడిని. మార్క్సిజం ప్రాథమిక విషయాలతో



పాటు చాప్లిన్ సినిమాలు, గురజాడ, కొడవటిగంటి వంటి వారి రచనాశైలిని ఆకళింపు చేసుకున్నాను.

బొమ్మల విషయానికి వస్తే ఆర్.కె.లక్ష్మణ్ బొమ్మలను ఫాలో అయ్యేవాడిని, ఆయన ఆలోచనాధోరణిని సైతం ఆకళింపు చేసుకుని కార్టూన్లు వేసేవాడిని.

అదే సమయంలో గ్లోబలైజేషన్, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం వల్ల సోషలిజం మీద ఉన్న భ్రమలు తగ్గడం మొదలుపెట్టాయి.

అయినా పి.వి.నరసింహారావు సరళీకరణ విధానాలమీద, మతోన్మాదం మీదా, ఐ.ఎమ్.ఎఫ్, డంకెల్ విధానాల మీద విస్తృతంగా, పుంఖాను పుంఖాలుగా కార్టూన్లు వేసాను.

ప్రజాశక్తి ఆదివారం సంచికలలో తెలుగు సాహిత్యాన్ని ఉపయోగించుకొని అనేక కార్టూన్లు వేసాను.

ఆ సమయం తెలుగు పొలిటికల్ కార్టూన్ రంగానికి సువర్ణ అధ్యాయం. ఒకవైపు శ్రీధర్, సురేంద్ర, మోహన్, శ్యాంమోహన్ వివిధ పత్రికలలో కలర్‌ఫుల్ కార్టూన్లతో అలరిస్తుండేవారు.

అయితే గ్రేట్ మాస్టర్స్ బొమ్మల్ని నేను స్టడీ చేయలేకపోవడం ఒక లోపంగా ఉండేది.

ఛలో హైదరాబాద్...

ప్రజాశక్తిలో ఎంత ప్రోత్సాహకరంగా ఉన్నా

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినప్పటికీ కూడా వాటిని కాదనుకునేంతటి వ్యామోహం కార్టూన్లపై ఏర్పడింది. పత్రికలో కార్టూన్‌ని చూసుకోవడం, కార్టూన్‌లో నాపేరు చూసుకోవడం ఇవన్నీ ఒక దివ్యమైన విషయాలుగా కనిపించేవి.



ఆర్థికంగా ఇబ్బందులు పడేవాడ్ని. భార్య ఇద్దరు పిల్లలతో కష్టంగా ఉండి ప్రజాశక్తి...తరువాత స్వశక్తిని నమ్ముకుని హైదరాబాద్ ఆంధ్రప్రభలో కార్టూనిస్ట్ సురేంద్ర సహకారంతో చేరాను.

కానీ ఆంధ్రప్రభలో కులాల జాఢ్యం ఎక్కువగా ఉండేది. అప్పటి ఎడిటర్‌లతో నానా యాతనా పడాల్సి వచ్చింది. నేను చేరింది ఫ్రీలాన్సర్‌గా అయినా సరే ఈ జాఢ్యాలన్నీ ఎదుర్కోవలసి వచ్చేది.

ఒక పదేళ్లపాటు అక్కడ కార్టూనిస్టుగా పని చేసినా కేవలం 'జీవిక' కోసమే భరించవలసి వచ్చింది.

ఫ్రీలాన్సర్‌ని కాబట్టి ప్రజాశక్తితో కూడా అనుబంధం కొనసాగుతూ ఉండేది. ఇవికాక వివిధ సంస్థలకు పుస్తకాల కవర్‌పేజీలు, కార్టూన్లు, చిన్న చిన్న ప్రింటింగ్ పనులు చేసే వాడిని. అదే సమయంలో 'చేతన పబ్లికేషన్స్' పేర పుస్తక ప్రచురణ కూడా ప్రారంభించాను.

ఓవైపు తలమునకలుగా ఇన్ని పనులు చేస్తున్నా... సాహిత్యం చదవడం... ఇంగ్లీషు చదువుకోవడం, రెగ్యులర్‌గా ఇంగ్లీషు కార్టూన్లు స్టడీ చేయడం, రాజకీయ కార్టూన్లు స్టడీ చేయడం మాత్రం మానలేదు. ఓ వైపు నా మూలాలు, నా కల్చర్‌ని ప్రత్యామ్నాయంగా వెతకసాగాను.

ఇక్కడ అప్పటికే మోహన్ లైన్ పరంగా ఎంతో ముందుకు వెళ్లి ఎందరినో ప్రభావితం చేసాడు. నేను మోహన్‌తో కలిసి ఉంటున్నా ఆయన లైన్‌ని అందుకోలేకపోయాను కాని ఆయన భావజాలాన్ని పూర్తిగా అందుకున్నాను.

ఓ పక్క ఇంటివద్ద డి.టి.పి వర్క్సు చేస్తూ ఉండేవాళ్లం. నా భార్య చంద్రకళను చదివించి ఆమెకు కంప్యూటర్ నేర్పించాను.

నేను అత్యంతగా ఆనందించిన విషయంలో నా భార్యకు చదువు, కంప్యూటర్ నేర్పడం ఒకటి. ఇలా ఇంటిదగ్గర కంప్యూటర్ జాబ్ వర్క్సు చేయడం, ఆర్థిక అవసరాల రీత్యా ఎక్కువ బొమ్మలు వేయడం వల్ల శిల్పం మీద ఎక్కువగా దృష్టిపెట్టలేదు. కాని ఐడియాలలో శేఖర్ దిట్ట అనిపించుకున్నాను. ఆర్థికంగా చూసినా ఎలా చూసినా తెలుగు పొలిటికల్ కార్టూనిస్టు జీవితం అభద్రతగా అనిపించి ఇంగ్లీషు జర్నలిజంలోకి వెళ్లడానికి పలు ప్రయత్నాలు చేసాను. ది వీక్, అవుట్‌లుక్ వంటి పత్రికలకు ఇంటర్వ్యూలకు వెళ్లాను. ముంబయి 'బిజినెస్ స్టాండర్డ్' లో అవకాశం వచ్చినా వదులుకున్నాను.

ఉద్యమాలతో ఉయ్యాల...

హైదరాబాద్‌లో రగులుతున్న ఉద్యమాలన్నింటికీ పార్టీలు, గ్రూపులతో నిమిత్తం లేకుండా మోహన్ కార్టూన్లు, పోస్టర్లు వేస్తుండేవాడు. ఆ తరువా అవకాశాలు ఎక్కువగా నాకు వచ్చాయి. దళిత, బహుజన, తెలంగాణ, సిపిఐ, మార్కిస్ట్, ఎం ఎల్ గ్రూపుల వాళ్లందరికీ కావలసిన పోస్టర్లు, క్యాసెట్ కవర్లు, కరపత్రాలు, పోస్టర్ డిజైన్‌లు విస్తృతంగా చేసేవాడిని. రెగ్యులర్ కార్టూనింగ్ చేస్తూ ఈ వర్క్ చేసేవాడిని.

2001లో నేనూ శ్యామ్‌మోహన్ చొరవ తీసుకుని బెంగుళూరు వెళ్లి కర్నాటక కార్టూనిస్టుల సంఘం సమావేశానికి వెళ్లి ఆ తరహాలో ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్టుల సంఘం ఏర్పాటుచేసాం.

తరువాత దానికి ప్రెస్‌అకాడమీ, ఐయ్యేయస్

2001లో నేనూ శ్యామ్‌మోహన్ చొరవ తీసుకుని బెంగుళూరు వెళ్లి కర్నాటక కార్టూనిస్టుల సంఘం సమావేశానికి వెళ్లి ఆ తరహాలో ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్టుల సంఘం ఏర్పాటుచేసాం. తరువాత దానికి ప్రెస్‌అకాడమీ, ఐయ్యేయస్ రమణాచారి లాంటి వాళ్లు పూర్తి సహకారం అందించి ఎన్నో ప్రదర్శనలు వర్క్‌షాప్ జరిగే లాగ తోడ్పడ్డారు. 'శేఖర్ టూన్' అనే సిండికేట్ ద్వారా ఇంగ్లీషులో కార్టూన్లు వేస్తూ నార్త్ ఇండియన్ పత్రికలకు రెగ్యులర్‌గా పొలిటికల్ కార్టూన్లు పంపుతుండేవాడ్ని. అలా దాదాపు పదిభాషలలో నా కార్టూన్లు వచ్చేవి.

రమణాచారి లాంటి వాళ్లు పూర్తి సహకారం అందించి ఎన్నో ప్రదర్శనలు వర్క్‌షాప్ జరిగే లాగ తోడ్పడ్డారు.

ఆ క్రమంలోనే పలువురు తెలుగు చిత్ర కారులు ప్రస్తుతమున్న ప్రముఖ దినపత్రికలలో స్థానం దక్కించుకున్నారు.

ఈ క్రమంలో దళిత ఉద్యమాన్ని కొంత మిస్సయినా, తెలంగాణ మలిదశ ఉద్యమానికి వచ్చేసరికి నా మూలాలు, సంస్కృతి ఏమిటో బాగా తెలిసి వచ్చింది. ఆ తరువాత పరోక్షంగా ఉద్యమానికి చాలా కార్టూన్లు, పోస్టర్లు అందించాను.

ఆ క్రమంలోనే 2011లో 'గిది తెలంగాణ' పుస్తకం వచ్చింది. అది ఉద్యమానికి ఊత కర్రగా ఉందని ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వాళ్లు ఆకాశానికెత్తారు.

ప్రస్తుతం దళిత బహుజనవాదాన్ని అధ్యయనం చేస్తున్నాను. ఎనభైశాతంగా ఉన్న దళిత బహుజనులని అతి తక్కువ శాతంగా వున్న ఉన్నత వర్గాలు ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాయనేది స్పష్టంగా అర్ధమవుతోంది.

సహజంగా, మార్క్సిస్టుగా నేను కులాన్ని నమ్మను. కాని ఈ సమాజంలో అది పోషిస్తున్న పాత్రను మాత్రం చాలా దగ్గరగా చూసాను. ఎక్కడా కులతత్వవాదిగా ప్రవర్తించలేదు పైగా ఎనభై శాతంగా వున్న అన్ని రకాల కులాల వాళ్లపై సానుభూతి ఉంది. ఈ క్రమంలోనే భారతదేశంలో కులం అనేది ఎంతటి దుష్ఫరిణామాలకు దారితీస్తుందో తెలియజేయడానికి నా తాజా పుస్తకం 'కేస్ట్ కేన్సర్' పుస్తకంలో ప్రయత్నిస్తున్నాను.

ఇది కులాలను వ్యతిరేకించేదిగా కాకుండా సమాజాన్ని కులాలుగా విభజించిన వారి మీద ఎక్కుపెట్టిన అస్త్రంగా ఉంటుంది.

ఇంగ్లీషుకార్టూన్లపై మోజు...

జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి ఎలాగైనా ఇంగ్లీషు కార్టూనిస్టుగా ప్రాచుర్యం పొందడానికి 36 ఏళ్ల వయసులో ఇంగ్లీషును మరింత మెరుగుపరుచుకోవడం మొదలు పెట్టాను. కొంత కాన్ఫిడెన్స్ వచ్చాక హైదరాబాద్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరాను.

మొదటి పేజీలో కేరికేచర్లు,ఇలస్ట్రేషన్లు, సండే మేగజైన్‌లో కామిక్ బొమ్మలు వేసేవాడ్ని కాని పొలిటికల్ కార్టూనిస్టుగా నేననుకున్న బ్రేక్ రాలేదు.

అలా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో మూడేళ్ళ పాటు పనిచేసాను. రకరకాల ఫీచర్స్‌కు, వార్తలకు బొమ్మలు వేసేవాడిని. ఆ తరువాత రెట్టింపు జీతం ఆఫర్ చేయడంతో ఆంధ్రజ్యోతిలో చేరాను.

'శేఖర్ టూన్' అనే సిండికేట్ ద్వారా ఇంగ్లీషులో కార్టూన్లు వేస్తూ నార్త్ ఇండియన్ పత్రికలకు రెగ్యులర్‌గా పొలిటికల్ కార్టూన్లు పంపుతుండేవాడ్ని. అలా దాదాపు పదిభాషలలో ఇంగ్లీషు,పంజాబీ,హిందీ, మరాఠీ, బెంగాలీ, ఉర్దూ, గుజరాతీ, మణిపురి భాషలలో నా కార్టూన్లు వచ్చేవి.

అపూర్వమైన అమెరికా అవకాశం...


2011లో అమెరికన్ కాన్సులేట్ వాళ్లు ప్రపంచవ్యాప్తంగా ఇరవైమంది కార్టూనిస్టులని నెలరోజులపాటు అమెరికాలో స్టడీటూర్‌కి తీసుకువెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కార్టూనిస్టుల కార్టూన్లను ఇంటర్నెట్‌లో పరిశీలించి నన్ను ఎంపిక చేసారు.ఆంగ్లభాషలో రాయడం, మాట్లాడగలగడం నాకు అదనపు అర్హత అయింది. అలా అమెరికాలో ఐదు ప్రసిద్ధ రాష్ట్రాలు వాషింగ్టన్ డి సి, న్యూయార్క్, లాస్ ఏంజిల్స్, ఫ్లోరిడా, ఒహాయ్ ఈ ఐదు రాష్ట్రాల్లో అనేక పత్రికల ఎడిటోరియల్ కార్టూనిస్టులని సంపాదకులని కలిసాము.

ప్రొఫెషనల్‌గా అది చాలా గొప్ప టూర్. ఒక అరుదైన అవకాశం. రమీరాజ్, ఆంటెల్ నెస్, డెరిల్ కేగిల్ వంటి ఉద్దండ కార్టూనిస్టులని కలవడం వారినుంచి ఇన్‌స్పిరేషన్ తీసుకోవడం వారి నుంచి కార్టూన్‌సిండికేషన్‌కు సైతం ఇన్‌స్పిరేషన్ పొందడం జరిగింది.

నా కార్టూన్ శీర్షికలు...

రోజువారీ కార్టూన్లతో పాటు పత్రికల సండే మేగజీన్‌లలో పలు కార్టూన్ శీర్షికలు నిర్వహించే వాణ్ణి. వేలాది కార్టూన్లు అంటే ఇప్పటికి నలభై ఆరువేల కార్టూన్లు వేసానని గర్వంగా చెప్పగలను. శేకరవాలం, శేఖర్ టూన్స్, అల్లాడీన్, లైఫ్‌లైన్ నా కార్టూన్ శీర్షికల లో ప్రజాదరణ పొందినవి.

ఇవికాక ఓ ఐదు కార్టూన్ పుస్తకాలు ప్రచురించాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 2006లో ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు



దినపత్రికల మొదటిపేజీలో ఉండవలసిన కార్టూన్ లోపల ఎక్కడికో విసిరివేయబడింది. దినపత్రికకు మసాలా దినుసులలో కార్టూన్ ఒకటిగా ఉండబట్టే ఆ మాత్రం సర్వైవ్ అవుతున్నాయి. ఇంటర్నెట్, ఫొటోలు ఇతర అంశాలు విస్తృతంగా దొరికి కార్టూన్‌ప్లేస్‌ని తగ్గించి వేసాయి.

'క్యాస్ట్ క్యాన్సర్' శేఖర్ ఆరో కార్టూన్ల పుస్తకం

పారాహుషార్ తొలిపుస్తకంగా అచ్చేసిన శేఖర్, చంద్రబాబు 9 ఏళ్ల పరిపాలనలో తను వేసిన మంచి కార్టూన్లతో 'బ్యాంకు బాబు' అనే సంకలనం తీసుకువచ్చారు.

తర్వాత తెలుగులోనే తొలిపాకెట్ కార్టూన్ల పుస్తకం 'శేఖర్టూన్స్' విడుదలైనది. తను పుట్టిన గడ్డ, తన నేపథ్యం కళాకారుడిగా తన స్పందనలతో 'గదీ తెలంగాణ' అనే మరో సంకలనం వేశారు. ఈ పుస్తకం ఉద్యమానికి ఎంతో ఊతంగా నిలబడిందని పలు మీడియాసంస్థలు కొనియాడాయి.

ఇక ఐదో పుస్తకం ఇంగ్లీషులో 'కలర్స్ ఆఫ్ ఇండియా' ఇతరులు పబ్లిష్ చేశారు.

అమెరికన్ ప్రభుత్వం అతిథిగా 2011లో శేఖర్ మరో కార్టూనిస్టుతో కలిసి అమెరికా పర్యటన జరిపారు. ఈ పర్యటనలో న్యూయార్క్, వాషింగ్టన్, ఒహాయ్, లాస్ ఏంజిల్స్, ఫ్లోరిడా తదితర ప్రదేశాల్లో చాలా మంది అమెరికన్ ఎడిటోరియల్ కార్టూనిస్టులను కలిసివచ్చారు. ఆ సందర్భంగా అమెరికాలో లాంచ్ అయిన పుస్తకమే కలర్స్ ఆఫ్ ఇండియా.

ఇవన్నీ ఒక ఎత్తైతే ఇప్పుడు తాజాగా రాబోతున్న కార్టూన్లపుస్తకం **'క్యాస్ట్ క్యాన్సర్'** మరో ఎత్తు. కళాకారుడిగా మార్క్సిజాన్ని చదివి, పాటించిన శేఖర్ సమాజం పట్ల తనదైన దృక్పథం ఏర్పరచుకున్నాడు. జీవిక కోసం దినపత్రికలో వేసే కార్టూన్లు మినహాయిస్తే సామాజిక అంశాలపై చాలా కార్టూన్లు వేశాడు.

ముఖ్యంగా ప్రపంచీకరణ, మతోన్మాదం, సామాజిక వివక్ష, క్లాస్ నేచర్పై మార్క్సిస్ట్గా ఎన్నో కార్టూన్లు వేశారు. తదనంతరం ఒక సామాజిక విద్యార్థిగా దళిత సాహిత్యాన్ని, పోరుగడ్డ తెలంగాణ ఉద్యమంపై లెక్కకు మిక్కిలి కార్టూన్లు, పోస్టర్లు వేశారు. రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలతో ఉన్న అనుబంధంతో ఇది సాధ్యమైంది. ఇటీవల కాలంలో శేఖర్ ఆలోచన తీరులో కూడా పెద్ద మార్పు వచ్చింది. సమాజంలో నూటికి ఎనభై శాతంగా ఉన్న దళిత బహుజనులపై ఆయన కుంచె ఎక్కుపెట్టారు. ముఖ్యంగా బహుజనులను, దళితులను ఆ స్థితికి నెట్టివేసిన కులవ్యవస్థని ఆయన నిరసించారు.

ఫలితంగా వెలువడిందే 'క్యాస్ట్ క్యాన్సర్' పుస్తకం. త్వరలో మార్కెట్లోకి రాబోతున్న ఈ పుస్తకంలో పలు అంశాలు ఘాటు ఘాటుగా అనిపిస్తాయి. కులం సబ్జెక్ట్పై ఒకటి రెండు కార్టూన్లకే భయపడే కార్టూనిస్టులు దాదాపు ఒక సంకలనమంతా కులం గురించి చర్చించడం విశేషం. జీవిక కోసం, ఆత్మ తృప్తి కోసం ఎప్పుడూ రెండు రకాల కార్టూన్లు వేసే శేఖర్ ఈ కొత్త పుస్తకం విజయవంతం కావాలని ఆశిద్దాం. **– ధరణి**

అందుకున్నాను. ఇతరత్రా కూడా నాకు అనేక అవార్డులు వచ్చినా ఆర్థికంగా వాళ్లిచ్చే 'పర్స్' నన్ను ఎక్కువగా ఉత్సాహపరుస్తుండేది.

అలాగే వ్యాసాలు రాయగలగడం అనేది నాకు అదనపు అర్హతగా ఉండింది. కార్టూన్ల మీదే కాక ఇతర అంశాలపై కూడా చాలా వ్యాసాలు రాసాను. నేను రాసిన ప్రతి వ్యాసమూ విమర్శకుల ప్రశంసపొందిందే. అనేక టీవీ ఛానళ్ల చర్చా కార్యక్రమాలలో, రేడియో కార్యక్రమాల్లో కార్టూన్లకు విస్తృతంగా ప్రచారం కల్పించడానికి కృషిచేసాను.

అన్నింటికీ మించి హిందూ పత్రిక తన 'కాలమ్స్'లో నన్నువన్ ఆఫ్ ద బెస్ట్ కార్టూనిస్ట్ ఆఫ్ ఇండియా అని పేర్కొన్న సంగతి నాకు బాగా ఆనందం కలిగించే విషయం

ఏది మంచి కార్టూన్?...

ఈ ప్రశ్నకు కొంతమంది బాగా నవ్వించేది వ్యంగ్యంతో గిల్లగలిగేది, సున్నితంగా విషయాన్ని చెప్పగలిగేది అని సమాధానలిస్తుంటారు. కాని నా దృష్టిలో 'థాట్ ప్రొవోకింగ్' చేసేదే సరైన కార్టూన్ అంటాను.

ఇప్పుడున్న రాజకీయాలు చూస్తున్నాం కద సున్నితంగా, చమత్కారంగా చెపితే అర్థం చేసుకుని సరిదిద్దుకునే నాయకుడు ఎవరైనా ఉన్నారంటారా? అందుకే కార్టూన్ నవ్వించకపోయినా పరవాలేదు, ఖచ్చితంగా ఆలోచింపజేసేదై ఉండాలంటాను.

నిజానికి కార్టూన్ అనేది అద్భుతమైన కళ. వాటిని కేవలం నవ్వించడానికే పరిమితం చేయడం అంటే దాని విలువ మనం గుర్తించకపోవడమే. మన కార్టూనిస్టులలో చాలామంది 'లీజర్ వర్గం' నుంచి రావడం వల్ల కార్టూన్ని కేవలం హాస్యప్రక్రియ క్రిందే చూస్తున్నారు. అదే సామాజికంగా వెనుకబాటునుంచి వచ్చిన కార్టూనిస్టులు దానినొక 'పంచింగ్' ఆయుధంగా చూస్తున్నారు.

మనం ఎక్కడున్నాం?...

మన కార్టూనిస్టులలో చాలా మందికి సామాజిక స్పృహ తక్కువ. మనది చాలా చిన్న కమ్యూనిటీ. ఒకప్పుడు స్టార్ ఇమేజ్ ఉండేది. క్రమంగా అది కనుమరుగైపోయింది. ఉన్న వాళ్లలో చాలామందికి సామాజిక స్పృహ లోపం ఉంది. చుట్టూ ఉన్న సమాజం నుంచి అంశాలను తీసుకొని హాస్యస్ఫోరకంగా వేయడం తక్కువ. ఒక'టెంప్లేట్' లాంటి కార్టూన్ సిస్టమ్లో ప్రతి ఏడాది అవే కార్టూన్లు వేస్తున్నాం. కాబట్టి పాఠకులను అలరించలేకపోతున్నాం.

దీనికి తోడు పత్రికలు తగ్గిపోవడం, కార్టూన్లకు స్పేస్ తగ్గడం జరిగింది. ప్రస్తుతం కొంతలో కొంత కార్టూన్ని సోషల్మీడియా బతికిస్తుంది. అదికూడా చాలా మినిమైజ్డ్గా, వాటితో వచ్చే డబ్బులతో ఏ కార్టూనిస్టుకీ అవసరాలు తీరవు. కవులూ,రచయితలూ కవిత్వం రాసి ఒకరికొకరు చూపించుకున్నట్లుగా ఒకరికి ఒకరు'లైక్'లు కొట్టుకుని సంతృప్తి పడాల్సిన పరిస్థితి.

కార్టూనిస్టుకి ఏ మాత్రం ఆర్థిక దన్ను లేదు. ఒక చిన్న ప్రపంచంలో గత వైభవం తలచుకుంటూ మురిసిపోవడం మినహా ప్రస్తుతానికి కార్టూనిస్టు చేయగలిగింది ఏమీలేదు. ఇందుకు దినపత్రికల కార్టూనిస్టులు ఏమీ మినహాయింపు కాదు.

వేళ్లమీద లెక్కపెట్టగలిగినంతమంది మాత్రమే ఈ రంగంలో అదికూడా అభద్రతతో కొట్టుమిట్టాడుతున్నారు. జీవిక కోసం ప్రతి రోజూ

కార్టూన్‌లు వేయాల్సి రావడం వల్ల కొంతలో కొంత ఈ కార్టూన్లలోనే క్వాలిటీ కనిపిస్తుంది.

చాలామంది దినపత్రికల కార్టూనిస్టులు చేస్తున్న ఉద్యోగంతో పూర్తిస్థాయిలో బ్రతకలేక చిన్నా చితకా పనులు చేసుకుంటూ కార్టూన్ రంగంలో కొనసాగుతున్నారు. దినపత్రికల మొదటి పేజీలో ఉండవలసిన కార్టూన్ లోపల ఎక్కడికో విసిరివేయబడింది. దినపత్రికకు మసాలా దినుసులలో కార్టూన్ ఒకటిగా ఉండబట్టే ఆ మాత్రం సర్వైవ్ అవుతున్నాయి. ఇంటర్నెట్, ఫొటోలు ఇతర అంశాలు విస్తృతంగా దొరికి కార్టూన్‌ప్లేస్‌ని తగ్గించి వేసాయి.

సమాజంలో వస్తున్న అనేక ఆధునిక మార్పులలో దీనిని ఒకటిగా చూడటం తప్ప మనం వగచి లాభంలేదు. అయితే సమాజాన్ని అర్థం చేసుకుని అది హాస్యమైనా, వ్యంగ్యమైనా, చమత్కారమైనా కార్టూన్లలో ప్రతిఫలింపజేస్తే వాటికి ప్రాధాన్యత ఉండటం ఇప్పటికీ గమనించవచ్చు. వారపత్రిక కార్టూన్లలో ఒక మూస ధోరణి ఉంటుంది. దిన పత్రికల కార్టూన్లలో కూడా అదే మూసధోరణి.

గీసిందే గీసి చెప్పిందే చెప్పాల్సి వస్తుంది. దీనికి నాతో సహా ఎవరూ మినహాయింపు కాదు. అప్పుడప్పుడు ఏ ఇంగ్లీషు, ఇతర భాషలలోనో చమక్కుమన్న కార్టూన్‌ని తీసుకుని మనకి వర్తింపచేసుకుంటే అదో పెద్ద నేరం కింద భావిస్తున్నారు. మన తెలుగుభాష ప్రపంచంలో ఉన్న వేలాది భాషల్లో ఒక భాష. మన పత్రికలు, టీవీఛానళ్లు ఇతర మీడియా అనేక అంశాలని తెలుగులోకి దిగుమతి చేసుకుని అందిస్తున్న మాట వాస్తవమే కదా? అలాగే కార్టూన్లు కూడా.

దీనికి కొందరు రంధ్రాన్వేషణ చేస్తుంటారు. మనది ఒక ప్రాంతీయ భాష అని గుర్తుంచుకుంటే సరి.

కార్టూన్‌కి సాహితీ గౌరవం ఏదీ?

నిజానికి చాలామంది కార్టూనిస్టులు జీవిక కోసం కార్టూన్లు వేయడం, కొద్దిమంది తమ అభిరుచి మేరకు ఆయా రంగాలలో నిష్ణాతులవడం వల్ల ఈ మాత్రం గుర్తింపు తెలుగు కార్టూన్‌కి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తోంది. అయితే డబ్బు లేదనుకోండి. కార్టూన్ రంగంతో నిరాశతో ఇలా అనడంలేదు. కార్టూన్ గొప్పదని అర్థం కావడానికి పాతికేళ్ళు పట్టింది.

మరో విషయం కార్టూనిస్టులు ఎవరి స్థాయిలో వారు వ్యక్తిగతంగా కృషిచేస్తూ వారి ముద్రను క్రియేట్‌చేసారు. కానీ ఇది గమనించక ఎవరికి వారు ఇతరులతో పోల్చుకుని ఆత్మన్యూనతలో పడి ఫలానా వారి తరువాత నేనే ప్రకటించుకుంటున్నారు.



చేసిన కృషికి తగిని సరైన ఎలివేషన్ లేకపోవడం కూడా ఈ దౌర్భాగ్యానికి కారణం. వెకిలి కార్టూన్‌లు వేయడం, కించపరిచే కార్టూన్లు వేయడం ఇలాంటి అన్ని కారణాల వలన కార్టూన్‌కి సాహితీ గౌరవం లేకుండా పోయింది.

కవిత్వాలకు,కథలకు వేసిన మంచి బొమ్మలతో కార్టూనిస్టు, ఆర్టిస్టు సంతృప్తి పడాల్సి వస్తోంది. నిజానికి కార్టూన్ చాలా శక్తివంతమైనది. థాట్ ప్రోవోకింగ్ కార్టూన్ ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తుంది. మనం సమాజాన్ని రాత్రికి రాత్రి మార్చలేకపోవచ్చు,రాత్రికి రాత్రి అద్భుతాలు సృష్టించలేకపోవచ్చు. కాని ఒక ఆలోచన సృష్టించే కార్టూన్ దాని పని అది చేసుకుపోతుంది. ఒకరినుంచి ఒకరికి భావప్రసారమై ఒక మాస్ ఒపీనియన్ కిందకు తప్పకుండా మారుతుంది.

కార్టూనింగ్ అంత ఈజీ కాదు

పత్రికల్లో కార్టూనిస్ట్ తన పేరు చూసుకోవడం కోసం, దానికోసం పడే తపన,బాధ అంతా ఇంతా కాదు.

కాని ఓ మంచి కార్టూన్ వేసి మెప్పించాలంటే దాని వెనుక ఎంతో అవగాహన... చదువు... చమత్కారం... డ్రాయింగ్ స్కిల్స్ ఇవన్నీ ఉండి తీరాలి.

నిజానికి దీంట్లో చాలా పెయిన్ ఉంది.

కార్టూనిస్టులు సెన్సిటివ్, అల్పసంతోషులు కాబట్టి తమ పేరు చూసుకొని ఇవన్నీ మరచిపోతారు. ఒక దినపత్రికలో ఒక కార్టూన్ వచ్చిందంటే ముందు అది ఎందరినో మెప్పించాలి. వడపోతలో నిలవాలి. ఆ తరువాత కార్టూనిస్టు శ్రమని బట్టి పాఠకుడి దయను బట్టి దాని సక్సెస్, ఫెయిల్యూర్ నిర్ణయించబడతాయి. చాలా మంది కార్టూన్ చూపించగానే ముందు మొహమాటం కొద్దీ నవ్వుతారు. అదే నిజమైన జడ్జిమెంట్‌గా భావించి మరొక పెయిన్ తీసుకోవడానికి పూనుకుంటాడు.

నా కార్టూన్లలో చాలాసార్లు మొనాటనీ వచ్చి దానిని తొలగించుకోవడం కోసం నా బొమ్మ నేనే వేసుకునేవాడిని. రిపోర్టర్ కేరెక్టర్‌లలో చాలాసార్లు నేను కనిపించేవాడ్ని.

రెగ్యులర్‌గా కార్టూనింగ్ చేసేవారికి థాట్ ప్రాసెస్ కూడా ఒక దశలో అలవాటయిపోతుంది. కొంతకాలం తరువాత ఏ సబ్జక్టయినా ఎలాగయినా వేయగలిగే స్థితికి వస్తాడు.

సమాజంలో భిన్న వర్గాలు ఉంటాయి. ఒక 'కామన్‌మేన్'ని అంటూ క్రియేట్ చేసి అతన్ని సంతృప్తి పరచడం ఒకప్పుడు సాధ్యపడేది. ఈ రోజు పెరిగిన టెక్నాలజీ, ఛానళ్ళప్రకారం పాఠకులు రకరకాలుగా పెరిగారు.

కుల,మతాలు,ప్రాంతీయబేధాలు,పత్రికల పాలసీలు, పాఠకుడి అభిరుచి ఇవన్నీ బేలన్స్ చేసుకుంటూ కార్టూన్ వేయడం కత్తిమీద సామే! అయినా ఒక ఆర్ట్ ఫామ్‌గా కార్టూన్ గొప్పది చాలా గొప్పది.

ఇంటర్వ్యూ: **హరి (విశాఖపట్నం)**

మల్లిక్ కామెడీ కథలు

బిరుదులూ - పోజులూ

అన్నారావు మొట్టమొదటిసారిగా ఓ పత్రికలో సీరియల్ రాశాడు. ఆ సీరియల్ పూర్తి కాగానే పబ్లిషర్ పరబ్రహ్మం తను దానిని నవలగా వేస్తానని అన్నారావుతో అన్నాడు.

అన్నారావు సంబరంగా "సర్రే!..." అంటూ కళ్లుమూస్కుని ఓ గెంతు గెంతాడు.

అంతే...

గట్టిగా ఎవరో "కేర్... బేర్..." అని కేకేశారు.

ఉలిక్కిపడిన అన్నారావు కళ్లు తెరిచాడు.

అలా కళ్లు తెరిచినవాడు ఆ తర్వాత ఆశ్చర్యంతో నోరుతెరిచాడు.

"ఏంటీ! నేనింత ఎత్తులో ఎలా ఉన్నాను?" పైకే అన్నాడు స్వగతాన్ని.

"నువ్వు నా భుజాల మీద తగలబడ్డావ్... అందుకే అంత ఎత్తులో ఉన్నావ్!"

అది పబ్లిషర్ పరబ్రహ్మం గొంతు.

అన్నారావు కంగారుగా తల వొంచి కిందికి చూశాడు.

తన కాళ్ళ మధ్య పరబ్రహ్మం బట్టతలబుర్ర తళతళా మెరిసిపోతూ కనిపించింది.

అన్నారావు నాలుక కర్చుకుని అతని భుజాల మీదినుండి క్రిందికి దూకి చెంపలు వేస్కున్నాడు.

"ఏమయ్యా... నవల పుస్తకరూపంలో వస్తున్నందుకు ఎంత సంబరమైతే మటుకు అంత ఎత్తుకు ఎగరాలా? పోనీ ఎగిర్తే ఎగిరావ్...నా భుజాలమీద పడేట్టు ఎగరాలా?... ఆయ్..." అన్నాడు పరబ్రహ్మం.

"సారీ అండీ... హిహి..." ఇబ్బంది పడ్తూ నవ్వాడు అన్నారావు.

"నీ సీరియల్ నవల ఎడిటర్‌గారు వేస్తానని అన్నప్పుడు కూడా ఇలానే ఆయన భుజాల మీదికి ఎగిరావా?"

"అప్పుడు ఎగిర్తే భుజాల మీద పడ్లేదండి... సరిగ్గా నెత్తిమీద పడ్డాను. హాప్పుడేమో ఆయన మెడ విరిగి పాపం ట్రీట్‌మెంట్ కూడా తీస్కున్నాడండీ."



"అర్రే పాపం! నువ్వు చెప్తున్నది నిజమేనా?"

"అక్షరాలా నిజం అండీ... కావలిస్తే ఎడిటర్‌గార్ని చూడండీ... ఆయనిప్పటికీ మెడ వంకరగా పెట్టి నడుస్తున్నాడు... హి... హి..." అన్నాడు అన్నారావు.

"చాల్లేవయ్యా వెధవ నవ్వూ నువ్వూను... నువ్వు నవలలు రాసి ఎడిటర్ మెడలు విరక్కొట్టి, పబ్లిషర్ల భుజాలు బద్దలుకొట్టేవాడిలా ఉన్నావే!... నీతో చాలా ప్రమాదమే సుమా..." కళ్ళు పెద్దవిచేసి అన్నారావు వంక భయంగా చూస్తూ అన్నాడు పబ్లిషర్ పరబ్రహ్మం.

అతను చేసిన కామెంట్‌కి అన్నారావు సిగ్గుతో చితికిపోయాడు.

"అది కాద్సార్... ఇప్పుడు ఇలా నవలలు రాయడం నాకు కొత్తగనుక ఆ ఆనందంలో జంపింగ్ చేసి మీకు ఇబ్బంది కలిగిస్తున్నా గానీ... కొన్నాళ్లకి రాసీరాసీ అలవాటైన తర్వాత ఈ సంబరం ఉండదుకదండీ." మెల్లగా నసుగుతూ అన్నాడు.

"అప్పుడేమో వర్సబెట్టి నవలలు రాస్తూ రాస్తూ పాఠకుల మెదళ్లు తినేసి వాళ్లకి ఇబ్బంది కలగజేస్తానంటావ్? ఆఁ!... ఏం అంతేనా?" పరబ్రహ్మం అతనివంక చిలిపిగా చూస్తూ ప్రశ్నించాడు.

"ఏదో సార్! మీ ఆశీర్వాదం ఉండాలి గానీ... అంత ఎత్తుకు ఎదగకపోతానా?..." సిగ్గుపడ్తూ అన్నాడు అన్నారావు.

"సర్లేగానీ... నీ నవలకి రెమ్యునరేషన్ ఎంతిమ్మంటావ్?..." అడిగాడు పరబ్రహ్మం.

"ఏదో లెండి... పదో పదిహేనో ఇస్తే సంతోషిస్తా... హి!"

"పదో పదిహేనో ఏం ఖర్మ... వందరూపాయలిస్తా! ఏం?..." హుషారుగా అన్నారావు భుజం తడ్తూ అన్నాడు పరబ్రహ్మం.

అన్నారావు తెల్లబోయాడు.

"నేనంటుంది పదో పదిహేనో రూపాయలు కావండీ... వేలు!" తేరుకుని మెల్లగా అన్నాడు.

పరబ్రహ్మం అన్నారావు వంక క్షణంపాటు ఆశ్చర్యంగా చూసి ఘొల్లుమని నవ్వాడు.

"భలే వాడివే!... పది పదిహేను వేలు ఇవ్వడానికి నువ్వేమైనా సూపర్ రైటర్‌వా? లేకపోతే సుప్రీం రైటర్‌వా?... ఇది నీకింకా మొదటి

నవల! రైటర్‌గా పాపులర్ కాకముందు నవల రెమ్యునరేషన్ ఇంకా తక్కువ ఇస్తారు వేరే పబ్లిషరయితే. నేను కాబట్టి నీకు వందరూపాయలు ఇస్తున్నా... అయినా నువ్వు ఆలోచించి చెప్పు. ఇదే నవలని నువ్వు చిత్తుకాగితాల వాడికేస్తే అంతకన్నా ఎక్కువొస్తుందా?... న్యాయం చెప్పు..."

"రాదు సార్..." అన్నాడు అన్నారావు.

"కాబట్టి నువ్విక మాట్లాడకు... ఇంద పది రూపాయలు ఎడ్వాన్సు తీస్కో. మిగతా తొంభై రూపాయలూ పుస్తకం రిలీజైనాక ఇస్తాను..."

పది రూపాయలు అన్నారావుకి ఇచ్చాడు.

ఇహ అసలు విషయం పబ్లిషర్ పరబ్రహ్మం దగ్గర కదపాలనుకున్నాడు అన్నారావు.

"హి... హిహి..." పరబ్రహ్మం మొహంలో మొహం పెట్టి నవ్వాడు.

"నువ్వెంత నవ్వినా నీకు అడ్వాన్సుగా పది రూపాయలు మించి ఇవ్వలేనబ్బాయ్!" కచ్చితంగా చెప్పాడు పరబ్రహ్మం.

కిసుక్కున నవ్వాడు అన్నారావు.

"అది కాద్సార్... మీరనవసరంగా కంగారు పడ్తున్నారు... నేను వేరే విషయం గురించి మిమ్మల్ని అడగాలని అనుకుంటున్నాను..."

"ఏమిటది?..."

"నా నవలకి వారపత్రికల్లో పబ్లిసిటీ ఇస్తారు కదూ త్వరలో రాబోతూందని?..."

"భలేవాడివే... ఎందుకివ్వనూ?... పబ్లిసిటీ ఇవ్వకపోతే సేల్సు ఎలా జరుగుతాయనుకున్నావ్?..." కళ్లు ఎగరేశాడు పరబ్రహ్మం.

అన్నారావు మెలికలు తిరుగుతూ–

"హి... హిహి" అన్నాడు.

"ఆ నవ్వడం ఆపి నీ మనసులో ఉన్నదేంటో సందేహించకుండా చెప్పు..."

"మరేమో! వేరే రచయితల పుస్తకాలు ప్రచురించేప్పుడు మీరు ఈతరం సూపర్ రచయిత, ఈ యుగం పాప్లర్ రచయిత, ఈ శతాబ్దపు బద్దలుకొట్టే రచయిత అంటూ పబ్లిసిటీ ఇస్తారు కదా... నాక్కూడా పేరు ముందు అలాంటిదేదో తగిలించి పబ్లిసిటీ ఇవ్వండి సార్..."

పరబ్రహ్మం ఆలోచనలో పడ్డాడు.

"నిజమేనయ్యో... నువ్వు చెప్పినట్టు పబ్లిసిటీ ఇవ్వాల్సిందే!... ఏమని ఇవ్వాలబ్బా!!!?"

"ఈతరం మాగ్నిఫిషెంట్ రచయిత అని అంటేనో?..." అన్నాడు అన్నారావు.

"అబ్బే!... మాగ్నిఫిషెంట్ రచయిత అని ఆల్రెడీ అప్పల్రాజుని అంటున్నారు!"

"ఈ యుగం వీరరచయిత అంటే?..."

"అబ్బే... వీర రచయిత కూడా ఉన్నాడు. పోనీ ఈ దశాబ్దపు ఘోర రచయిత అని అంటేనో?"

"అలా అంటే నన్ను తిడ్తున్నట్టు ఉంటుందేమో కద్సార్?" బుర్రగోక్కుంటూ అయోమయంగా అడిగాడు అన్నారావు.

"అలా అంటావా?..." ఆలోచిస్తూ అన్నాడు పబ్లిషర్ పరబ్రహ్మం.

అన్నారావు మరికాస్సేపు ఆలోచించి...

"ఈ శతాబ్దపు శరవేగ రచయిత అంటే?"

"అబ్బే! లాభం లేదోయ్... ఇప్పటికే ఈ శతాబ్దపు వాయువేగ రచయిత, బుల్లెట్‌వేగ రచయిత, అతివేగ రచయిత, పరమవేగ రచయిత అని నలుగురు రచయితలున్నారు.... ఇప్పుడు శరవేగ రచయిత అంటే అదే కోవలోకి వస్తుంది... అయినా ఇలాంటివి లాభం లేదయ్యా! మనకేమీ దొరికేలా లేవు. అందరూ అన్ని రకాలు పంచేస్కున్నారు! పెదవి విరుస్తూ అన్నాడు పబ్లిషర్ పరబ్రహ్మం.



“పోనీ కొంతమంది రచయితల్లో ఆంధ్రా షిడ్నీషెడ్నన్, ఆంధ్రా హాడ్లీఛేజ్... అంటూ ఎవడిపేరైనా నా పేరుకు ముందు తగిలించుకుంటేనో సార్?...” ఉత్సాహంగా అన్నాడు.

“బాగానే ఉంటుందనుకుంటా...”


“అయితే ఆంధ్రా ఆర్థర్ హైలీ అన్నారావు అంటూ పబ్లిసిటీ ఇవ్వండి సార్...”

పరబ్రహ్మం తలని అడ్డంగా ఊపాడు.

“అబ్బే!... ఆంధ్రా ఆర్థర్ హైలీ కూడా ఆల్రెడీ ఉన్నాడయ్యాబాబూ”

“పోనీ తెలంగాణా ఆర్థర్ హైలీ అని పెట్టుకుంటేనో సార్?..”

“అలా వద్దయ్యా... ప్రాంతీయతత్వాన్ని బలపరుస్తున్నావను కుంటారు!” ఇద్దరూ చాలాసేపు ఆలోచించారు.





ఇద్దరికీ ఒక్క పాపులర్ ఇంగ్లీషు రచయిత పేరుకూడా తట్టలేదు.

“ఇప్పుడెలా సార్?...” దిగులుగా మొహం పెట్టాడు అన్నారావు.

పరబ్రహ్మం కాస్సేపు ఆలోచించి ఇలా అన్నాడు.

“ఓ పనిచేస్తే బాగుంటుందోయ్.. ఇతరుల్లా వాళ్ళతో వీళ్ళతో పోల్చుకోకుండా అచ్చంగా తనకు తనే అయిన అన్నారావు రచించిన... అంటూ పబ్లిసిటీ ఇస్తే ఎలా ఉంటుంది?”

“చాలా బాగుంటుంది సార్!” పొంగిపోతూ అన్నాడు అన్నారావు.

“మరి అందరూ పబ్లిసిటీలో ఫోటోలు వేయించుకుంటారు కద్సార్! ఈ ప్రక్కకి చూస్తూ ఆ ప్రక్కకి చూస్తూ, గడ్డం క్రింద చెయ్యిపెట్టు కునీ... అట్టావేయించుకుంటే సార్?...”

“బాగానే ఉంటుంది గానీ నువ్వే ఫోజులో వేయించుకుంటావ్?...”

“సార్! ఇట్టా కళ్లు పైకిపెట్టి, పైకి చూస్తున్నట్టు ఫోటో వేయించుకుంటే సార్...”

“వద్దు...! నా నవల చదివిన వారు పైకి పోతారని చెప్తున్నట్టు ఉంటుంది ఆ ఫోజు!”

“పోనీ క్రిందికి చూస్తూ ఫోజు పెడ్తేనో సార్?”

“అదీ వద్దు... ఇలాంటి నవల రాసినందుకు నేను సిగ్గుపడ్తున్నా అని పాఠకుల్తో అంటున్నట్టు ఉంటుంది...”

“మరెలా సార్...! నేనేం ఫోజు పెట్టను సార్?...” దిగులుగా అడిగాడు అన్నారావు.

“ఓ పని చేస్తే బాగుంటుంది... ఎవ్వరూ తీయించుకోని విధంగా వెనుకనుండి ఫోటో తీయించుకో...”


అన్నారావు ఎగిరి గంతేశాడు. అతనికి ఆ ఆలోచన బాగా నచ్చింది.

ఆ విధంగా అన్నారావు మొదటి నవల పుస్తకరూపంలో వచ్చింది.

తర్వాత్తర్వాత అతను గొప్ప రచయితైపోయి ఆంధ్రా విలియం కౌన్‌కిన్స్కో పేరుతో కథలు చాలారాశాడు.



సకల కళావల్లి... కంభాలపల్లి



- జయదేవ్

శేఖర్ కి నా మీద కోపం వచ్చిందని ఒకరిద్దరు నా చెవిని కొరికారు.

ఏ సందర్భంలో అనడిగితే... సుమారు పదేళ్ళ క్రితం! హైదరాబాద్‌లో ఒక కార్టూన్ పోటీకి నేనూ, కర్ణాటక ప్రముఖ కార్టూనిస్ట్ గుజ్జారప్పగారూ జడ్జీలుగా వ్యవహరించాము (శ్రీ మోహన్ గారి ఆదేశం మేరకు). పోటీ ఎంట్రీలు అద్భుతమైన కార్టూనులు ఒకటిని మించి ఒకటున్నాయి. ప్రతి ఎంట్రీని నిశితంగా పరిశీలించారు గుజ్జారప్పగారు.

కాప్షనుకి, కాప్షన్‌లెస్‌కీ, గీతలకీ, భావానికీ, సందేశానికీ, వ్యంగ్యానికీ, సాంఘిక విమర్శకీ తదితర అంశాలకీ మార్కులు కేటాయించారు.

నేను స్థానికుడిని గనుక, నిర్ణయం నిష్పక్షపాతంగా వుండాలని, నేను వెనక్కి తగ్గి, గుజ్జారప్పగారి అభిప్రాయానికే ప్రాధాన్యత ఇవ్వాలని నా మనసులో తట్టింది. చివరికి, నాలుగైదు సార్లు, కార్టూన్లు తిరగేసి, తిరగేసి, ప్రైజులకి ఎంపిక చేశాము.

బహుమతుల ప్రకటన వెంటనే జరిగిపోయింది. చాలామంది కార్టూనిస్టులు పోటీ ప్రదేశంలో వున్నారు. అందరికీ మా నిర్ణయం నచ్చిందని మాకు పరిపూర్ణమైన నమ్మకం కుదిరింది. గుజ్జారప్పగారూ చాలా సంతోషించారు.

పైగా మన తెలుగు కార్టూనిస్టులందరిని అభినందించారు... కొనియాడారు.

ఇది జరిగిన రెండు మూడ్రోజుల తర్వాత శేఖర్‌కి పోటీ నిర్ణయాలు నచ్చలేదని... తన ఎంట్రీకి బహుమతి ఎదురు చూశారని... రానందున నొచ్చుకున్నారన్న వార్త నా చెవిన పడింది.


నేను దీని గురించి కించిత్తయినా పట్టించుకోలేదు. ఎందుకంటే నాకు శేఖర్ మీద పరిపూర్ణమైన నమ్మకం వుంది. నేనంటే అపరిమితమైన ప్రేమ, అభిమానం, గౌరవం శేఖర్‌గారికుందని నాకు తెలుసు.

ఆయనంటే గిట్టని వాళ్ళు మా ఇద్దరి మధ్య చిచ్చు పెట్టాలని అనుకున్నారేమో.

శేఖర్‌కి నేనంటే ప్రాణం. నాకూ అంతే.

ఇందుకు నిండైన దాఖలాలు మా ఇద్దరి మధ్య మెండుగా వున్నాయి.

శేఖర్ పెద్ద చదువులు చదువుకున్నారు. సంస్కారవంతుడు, నిగర్వి, కష్టపడి కీర్తినార్జించి, మన తెలుగు కార్టూన్ ప్రతిభని సముద్రాలు దాటించి, తెలుగు కార్టూనిస్టులకి గర్వకారకుడైనాడు.



శేఖర్ నిజానికి చక్కటి రచయిత. అందువల్లే శేఖర్ కార్టూనుల్లో వ్యాఖ్య చదవ సొంపుగా వుంటుంది. చక్కటి పదజాలంతో భావస్ఫూరితమై వుంటుంది.

చదువు పూర్తయ్యాక శేఖర్ తలుచుకుని ఉంటే ఏ కాలేజీలోనో లెక్చరర్ ఉద్యోగం అతి సులభంగా సంపాదించి వుండేవాడు. ఐతే అనితర కష్టసాధ్యమైన కార్టూన్ ప్రొఫెషన్ ఎంచుకున్నాడు.

ఆ రోజుల్లో శేఖర్ ధైర్యం చేసి, సాహసం చేశాడనే చెప్పాలి. కార్టూనింగ్ మీద మోజు పెంచుకుని కష్టపడి, సాధన చేసి.. చేసి... చేసి... బొమ్మల్ని అదుపులోకి తెచ్చుకుని... గీతకి తనదైన బాణీ ఆపాదించి పత్రిక ప్రపంచంలో తనకంటూ ఒకస్థానం కల్పించుకుని అంచెలంచెలుగా ఎదిగి బావుట ఎగురవేశాడు.

శేఖర్ సాధించిన తీరు, వైనం మనల్నందరినీ ఆశ్చర్య పరుస్తుంది. ఎవరి దగ్గరా శిష్యరికం చెయ్యకుండా స్వయంకృషితో, తను గీసిన గీతల్నే, బొమ్మల్నే గురువులుగా తలుచుకుని, పత్రికలిచ్చే పారితోషికంతో స్వల్ప జీతంతో, జీవితం మలుచుకుని, తను సాధించిన కళకు రంగులు అద్ది, ఆ రంగులను విదేశీ గడ్డపై వెదజల్లి ఖ్యాతి నార్జించాడు.

కార్టూన్ కళ అందరికీ అబ్బదు.

అబ్బిన వాళ్లు అలుపెరుగరు. ఆకలి, నిద్ర ఎరుగరు. అస్పష్టకు గురికారు. ఉత్సాహ పూరితంగా ముందుకురుకుతుంటారు. అలాంటి వాళ్ళు మన శేఖర్‌లాంటి వాళ్ళు... పాఠకుల మనసులను రంజింపజేస్తారు. ఆనందడోలికల్లో ముంచుతారు.

శేఖర్ ఆయురారోగ్యఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, మనసారా దీవిస్తున్నాను.

శేఖర్ గురించిన ఈ ప్రత్యేక 'హాస్యానందం' సంచికను వెలువరించి శ్రీరాము గారిని అభినందిస్తున్నాను.

జంధ్యాల 'పెన్'ఛు... పెద్ద చేసిన...

మల్లె పందిరి

డా॥ దివాకర్ చేసిన
వెండితెర నవ్వులీకరణ



"ఇదిగో! పేకాటని తిట్టావో, డైమనాసెట్టి పొడి చెయ్యగలను జాగ్రత్త!" అన్నాడు పేరి శాస్త్రి అదేదో ప(బ్రాపు పిడిబాకన్నాట్టు వేలు పెట్టి చూపిస్తూ.

ఇంకోవాటాలో సంగీత(మ) మేస్టారు అద్దె కుంటున్నాడు. కళ్ళకోజోడు. ముందు మంగలి పొదిలాంటి హార్మోనియం పెట్టె. చుట్టూ నలుగురాడపిల్లలు. వెనక నుంచి మెళ్ళో చేతు లేసి వూగుతున్న వాళ్ళమ్మాయి.

పిల్ల వయసులో ఆరేళ్ళకు మించదుగానీ, చందమామ కథలు చదివి గుర్తు పెట్టుకోగల గడుగ్గాయి.

"ఇవ్వాళ నాదాతనుమనిశం చెప్తానన్నారు మాష్టారు!" అని గుర్తుచేసిందోపిల్ల.

"తను మనిశాన్ని అలావుంచు. మాష్టారు, తనూ ఓ మనిషేనన్న జ్ఞానం నీకేమన్నా వుందా?"

"ఏమిటి మేస్టారు?" అంది అర్థంగాక ఆ పిల్ల.

"ఏమిటేమిటి? ఇందాకట్నించీ చూస్తు న్నాను.... నీ చెయ్యేమో పనసకూరవాసన కొడ్తోంది. ఆ కూరంటే నాకు ప్రాణమని నీకు తెలుసు. అలా వొట్టిచేతులూపుకుంటూ రాక పోతే, ఓ గిన్నెడు కూర తీసుకురావచ్చుగా?"

అని లొట్ట లేసుకుంటూ గట్టిగానే గదమా యించాడు.

"మా నాన్నకెప్పుడూ తిండిగోలే... ఇప్పుడే కదా తిన్నావు, ఎన్నిసార్లు తింటావు?" అంది ముద్దుముద్దుగా వాళ్ళమ్మాయి -'ముద్ద'ంటే వాళ్ళ నాన్నకున్న ముచ్చట గురించి బట్ట బయలుచేస్తూ.



"ఏయ్- నోర్మూసుకుఫో లోపలికి!" అన్నాడు మేష్టారు.

"సర్లే- బుద్ధిగా పాఠాలు చెప్పుకో!" అనేసి పారిపోయింది లోపలికి.

ఈలోగా వంటింట్లోంచి ఆయిన భార్య తాలూకు భారీ కంఠం వినపడింది-

"ఆ! ఆ ! ఏమిటా నస!"

"నసకాదే పనస!" మంద్రంగా చెప్పు

కున్నాడు 'రైమ్లీగా'.

"బాగుంది వరస!" అందా కంఠం ట్రైమ్లీగా.

"ముందు పాఠం నేర్పండి!" అంది మళ్ళీ మాటల్తోటే మొట్టికాయ పెట్టగల దిట్ట ఆవిడ. కనపడకుండా 'కంట్రోల్' చేసే నేర్పరి.

భర్త శృతి మించితే కంఠం ఝుళిపిస్తుంది లోపల్నుంచే.

తప్పనిసరై మేస్టారు, పాఠం ప్రారంభించాడు.

"నాదంతను మనిశం–శంకరం–నాదం తను మనిశం" అంటున్నాడు ఓ చేత్తో మెట్లు మరో చేత్తో తిత్తులూ నొక్కుతూ.

పాడుతూ తల ప్రక్కకి తిప్పేసరికి, ఓ పనస పండు లాంటి పడుచు పిల్ల, మేడమెట్లెక్కుతూ కనిపించింది.

ఆ అమ్మాయెవరో కాదు. సుగుణ.

మేడమీది వాటాలో వొంటరిగా వుంటున్న, ఆ చావిడికి చెందిన 'ఆవే' నవ్వుతూ పలకరించే సుగుణం వుంది.

మేస్టారు కళ్ళూ, అద్దాలూ, వెండి ఫ్రేమూ, అన్నీ మెరిశాయి.

పాట స్పీడ్ పెరిగి, ఆయిన అధీనం కూడా తప్పి, తెల్లోడి రాగంలోకి తెలీకుండానే వెళ్ళి పోయింది.

బయట గాత్రంగాడి తప్పటం వెంటనే లోపట్నించి 'రాడార్' పసి గట్టేసింది. అలా ఎప్పుడు జరుగుతుందో ఆవిడకి క్షుణ్ణంగా తెలుసు.

అందుకే ఇంత గొంతేసుకొని– "ఆ! ఆ! ఆయ్!... ఆ టక్కులాడి సుగుణకాని కనిపించిందా?" అనరిచింది.

"ఏం? మిమ్మల్నే!" అంది రెట్టిస్తూ.

మేస్టారుకుదేలై, కుందేలంత కుంచించుకు పోయి, నీరసంగా మళ్ళీ మామూలు రాగంలోకే తిరిగొచ్చేశాడు.

సుగుణ మెట్టెక్కి పైకి వెళ్ళడం, రూమ్‌లో కొచ్చి హేండ్ బేగ్ బల్లమీద పెట్టడం, కిటికీ వరకూ అడుగు లేసుకుంటూ వెళ్ళడం– ఇవన్నీ జరుగు తున్నప్పుడు, ఆవిడ ఒంటికి కళ్ళంటించేసి వూరుకున్న ఒంకో శాల్తీ కూడా వుంది – క్రిందనే ఆ పక్కవాటాలో.

అతనో కవిశ్రీ. 'రవికాంచనిచోట్లు కొన్ని మాత్రం తను గాంచాలని' గాలిస్తుంటాడు. అవాకులు, చెవాకులూ, అవీ యివాక్కులు, నాలిక్కలం నుంచి రాల్చి, వాటినే వచన గేయాలనుకోమంటూ, అందరివెంటా తిరుగుతుంటాడు. తెలుగు సాహితీ రబీపంటలో ఇతనో కలుపు మొక్క. ఓ కలుగు యెలుక. పేరు నీలకంఠం

కిటికీలోంచి చూస్తూ సుగుణ నవ్వగానే, ఆ క్రిందనే గోడ చాటున తారట్లాడుతున్న అతగాడి కళ్ళు గిరికీలు తిరిగాయ్. దాంతో ఇక్కడ సర్రుమని జారిపడ్డాడు నీలకంఠం.

నీలకంఠం భార్య సరస్వతమ్మ "అయ్యో! అయ్యో" అంటూ వచ్చింది వెనకలే.

"లేవండీ! మీ తొందరగూలా! చూసుకొని నడవరటండీ?"

సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ "చూస్తూనే నడచానే–అందుకే పడ్డాన"న్నాడు కవిశ్రీ తెలివితేటలుపయోగించి.

"ఏడ్చినట్టుంది దిక్కుమాలిన సంత. మాటామంతీ తెలీవుసరే. నడ వడం కూడా చేతకాదు. వెర్రిమాలోకమాని!" అని గొణుక్కుంటూ పక్కకెళ్ళింది సరస్వతమ్మ.

ఈ లోగా డుంబూ అటేపే వచ్చాడు.

"ఒరేయ్! డుంబూ!... ఈ కవిశ్రీ నీలకంఠం ఒకటి చెప్తాడు. మనసు లోనే దాచుకోరా. వంద బల్లల మీదనైనా హాయిగా పడుకోవచ్చుగానీ, ఒక్క పెళ్ళాంతో పడలేం రా. వృద్ధిలోకి రావలసినవాడివి. నువ్వు మాత్రం పెళ్ళి చేసుకోకురా!" అన్నాడు నీలకంఠం తన స్వానుభవా న్నంతా రంగరించి.

"ఆలోచిస్తాను మామయ్యా!" అన్నాడు డుంబూ, అప్పటికప్పుడే 'కమిటై' పోవడం యిష్టం లేక.

✦✦✦



భీముడు తలస్నానం పూర్తిచేస్తుకొని, స్టూల్ మీద కూర్చున్నాడు. పీచుపీకేసిన కొబ్బరి కాయలాంటి అ తలకు, బామ్మ సాంబ్రాణి పొగ పడ్తోంది– "సరిగ్గా పట్రా– కదలక" అంటూ.

"ఏటిబామ్మ! నాకేదో పెద్ద గిరజాల జుట్టున్నట్టు, రోజూ ఇలా సాంబ్రాణి పొగేసి ఛంపేస్తున్నావు. నువ్వొక్కసారి గట్టిగా తల్చుకొని, 'ఉఫ్' మని ఊదావంటే, ఈ అరంగుళం జుట్టూ ఆరకపోతుందా చెప్పు?" అన్నాడు భీముడు కళ్ళు మండుతుంటే– తలార్పుకు సుగమమైన చిట్కా చెప్తూ.

"ఊరుకో సన్నాసీ సాంబ్రాణి పొగేస్తే తెలివితేటలు పెరుగుతాయ్, తెల్సా?" అంది బామ్మ– అవికూడా నీకు లోపించాయాని భీముడికి గుర్తుచేస్తూ.

"మరే! ఇలాగే రోజూ మానాన్నకి పొగబెట్టుంటావు. అందుకే పిచ్చెక్కి రైలు కింద తల పెట్టుంటాడు" అన్నాడు కళ్ళెగాక వొళ్ళు కూడా మంటెక్కిన భీముడు.

ఈలోగా సరస్వతమ్మ సరాసరి ఇటే రావడంచూసి "ఆలిండియా రేడియో వచ్చేస్తోంది!" అని ఎనౌన్స్ చేసాడు.


భీముడ్నిచూసి సరస్వతమ్మ "బాబు కాస్త వొళ్ళు చేసినట్టున్నాడే!" అంది బామ్మతో.

ఏ మాటంటే ఎవరు 'అయిస' వుతారో సరస్వతమ్మకు బాగా తెలుసు.



గ్రేట్ థింకర్!

తెలుగు పొలిటికల్ కార్టూనిస్ట్‌ల్లో డిఫరెంట్ స్టైల్ శ్రీ శేఖర్‌గారిది. నేను ఐదు సంవత్సరాల క్రితం హాస్యానందంలో ఇంటర్వ్యూ కోసం ఆయనను కలిసాను. ఆయన ఆలోచనలు ఎంత డిఫరెంట్‌గా ఉంటాయో నాకప్పుడు అర్థమయింది. నేను రాసికెళ్ళిన అన్ని ప్రశ్నలకు ఆయన జవాబులు బొమ్మలతో గీసి ఇచ్చారు. గ్రేట్ థింకర్!



తరువాత నాలుగైదుసార్లు కలిసాను. ప్రతిసారి ఎంతో ఆప్యాయంగా పలుకరించే ఆయనంటే నాకెంతిష్టమో... ఆయన కార్టూన్లన్నా అంతే ఇష్టం.

పొలిటికల్ కార్టూనిస్ట్‌గా పాతికేళ్ళు పూర్తి చేసుకున్న శ్రీశేఖర్‌గారికి అభినందనలు తెలుపుకుంటున్నాను.

–ఎ.దయాకర్, హైదరాబాద్



"ఒరేయ్–ఇది లోపలకు పట్టుకెళ్ళరా! జాగ్రత్త– చెయ్యి కాల్చుకుంటావు! అంటూ సాంబ్రాణి ప్లేటు భీముడి కందించింది బామ్మ.

ప్రక్కనేవున్న కాయితపు పొట్లాన్ని తడుముతూ బామ్మ కెదురుగా కూర్చుంది సరస్వతమ్మ.

"ఏమిటమ్మా! అని బామ్మ అడుగుతూ, పొట్లం విప్పి డబ్బాలోకి పంచదార వొంపుకుంటుంది.

"ఆ! ఏమీలేదు. ఆ మేడ మీద జపాన్ బొమ్మ లేదూ?" అంది సరస్వతమ్మ. చల్లకొచ్చి ముంతదాచి, ప్రస్తుతానికి తనను తను ఆ నాలుగిళ్ళ చావిడి వార్తలకు ముందుగా 'ట్యూన్' చేసుకుంది సరస్వతమ్మ.

"ఎవరూ? సుగుణమ్మా" అంది బామ్మ.

"ఆ! సుగుణమ్మో... చుంచులమ్మో... నిన్న సాయంత్రం అలా గుడికి వెళ్తును గదా– అక్కడ నడిరోడ్డుమీద, ఎవరో మోటర్ సైకిల్ కుర్రాడితో మాట్లాడుతోంది! ఆ యికయికలూ ఆ పకపకలూ, రామరామా! మనలాంటి సంసార స్త్రీలు చూసి భరించలేమనుకోండి! ఎప్పుడెప్పుడు మీతో చెపుదామా అని ఆ విషయాన్ని గొంతులో దాచుకుని పరిగెట్టుకొచ్చాను!" అంది సరస్వతమ్మ– మీరే గదా ఈ చావిడికంతటికీ ముందు వినవలసిన పెద్దదిక్కు' అన్న ధోరణిలో.

కందల గోదారమ్మ తప్పక అయిసయిపోయి, తన వూక బుట్టలో పడిందనే ధైర్యం వచ్చేసింది సరస్వతమ్మకు.

వెంటనే ముంత బైటికి తీసింది. అంటే ముంత లాంటి ఓ కుంచం.

సరస్వతమ్మకు సర్వకాల సర్వావస్థల్లోనూ ఆ పాత్ర చేతికంటుకుపోయి వుంటుంది. ఆ చావిట్లో ఎప్పుడు ఎవరింట్లోకి దూరుతుందో తనకే తెలియదాయె! అందుకే "కాసింత, ఈ ఉగ్గుగిన్నెడు పంచదార అప్పిస్తారూ?" అంది ఆలస్యం చెయ్యకుండా.

గోదారమ్మ మాత్రం తక్కువతిందా? "అయ్యో తల్లీ! నిన్న రాకపోయినావమ్మా! పంచదార నిండుకుంది. పొద్దున్న పిల్లాడికి పాలల్లో బెల్లం కలిపిచ్చాను!" అంది కుంచం నిండుగా జాలికురిపిస్తూ.

(సశేషం)



మాన్యులకేగాని.... సామాన్యులకు సాధ్యం కాదు!

-శ్రీధర్,
కార్టూన్ ఎడిటర్, ఈనాడు

చాలాకాలంగా శేఖర్ కార్టూన్లు చూసి ఆస్వాదిస్తున్నానే కాని శేఖర్ పుట్టుపూర్వోత్తరాలు నాకంతగా తెలియవు. తెలుసుకోటానికి ప్రయత్నించక పోవటం నా పొరపాటే. ఫోన్‌లో ఎక్కువసార్లే మాట్లాడుకుని ఉంటాం కాని ఆయన్ని నాలుగంటే నాలుగేసార్లు కలిశా.

అయినా ఒక కళాకారుడు ఎక్కడ పుట్టాడు, ఎప్పుడు పుట్టాడు, ఎవరి సంతతి తదితర విషయాలన్నీ అనవసరం. కళాకారుడు ఎక్కడి వాడైనా మొత్తం ప్రపంచానికి చెందుతాడు. అతను సృష్టించే బౌద్ధిక సంపద యావత్తూ సర్వమానవాళికి చెందుతుంది.

ఒక కార్టూనిస్టు పైన ప్రథమ పురుషంలో రాయకూడదని తెలిసీ, వ్యాసరూపంగా (తృతీయ పురుషంలో) నే రాయాలనీ తెలిసీ ఇలా రాయటానికి ప్రధాన కారణం ఎక్కువ వివరాలు ఆయన గురించి నాకు తెలియక పోవటమే.

శేఖర్ ప్రచురించిన తన కార్టూన్ పుస్తకాలకి సమీక్ష రాసే సదవకాశం నాకు కలిగినందుకు మహదానందంగా ఉంది. తెలుగులో కార్టూన్ పుస్తకాలు రావటం చాలా అరుదు. బాపూగారి తర్వాత ఎక్కువ పుస్తకాలు ప్రచురించింది శేఖరే అనుకుంటా.

ఈ మధ్య ఆయన ఇంటికెళ్ళినప్పుడు చూశా, బోల్డు అవార్డులూ రివార్డులూ ఆయన్ని వరించాయి. నిరుడు అమెరికా ప్రభుత్వం కూడా ఆయన్ని అక్కడికి ఆహ్వానించి గౌరవించింది. ఇక పని విషయానికొస్తే ఒకటి రెండు కార్టూన్లు వేసి ఊరుకోరాయన. సతతం ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడనీ కామిక్స్ వగైరా బొమ్మలు వేస్తుంటాడనీ అర్థమయింది.

దైనందిన ప్రాపంచిక, వైయక్తిక ప్రకార్యాలతోపాటు కార్టూన్స్ వేయటం, కామిక్స్ గీయటం, పుస్తకాలు ప్రచురించటం, ఇతరేతర అనేకానేక బొమ్మలు వేయటం చూసి అబ్బురపడ్డాను. ఆశ్చర్యం వేసింది. ఒక మనిషి ఇవన్నీ ఎలా చేస్తున్నాడబ్బా అనిపించింది.

రోజుకో కార్టూన్ వేయటమంటే మహాయజ్ఞ సాదృశ్యం.

కార్టూనిస్ట్ అనేవాడు ఎంతో చదివి సేముషీ సింధువై ఉండాలి. కార్టూనింగ్ అనేది ఆల్కెమీ. రసవాదం జెపోసన పట్టినవాడే అది సాధించగలడు. ప్రాకర్షిక సారస్వతంకంటే ప్రాపంచిక కళా సాహిత్యాలే ఎప్పటికైనా మెరుగైనవి. గుణాఢ్యుడు రాసిన బృహత్కథ పైశాచీ (ప్రజల భాష)లో ఉంది కనుక విస్తారంగా ప్రాశస్త్యం పొందింది.

అన్ని పురాణాలూ సంస్కృతం నుంచి ఇతరేతర భాషల్లోకి వెళ్తే బృహత్కథ సంస్కృతంలోకి తర్జుమా అయింది (ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్నదిదే). అలాగే జనబాహుళ్యానికి అర్థమయ్యే భాషలో వారి వారి దైనందిన సామాజికార్థిక స్థితిగతుల ధ్వనణ సాదృశ్యమయ్యే కళలే జనహృదయాల్లో నిలిచి ఉంటాయి.

నూటికి నూరుశాతం కార్టూన్లు ఈ పనిని సమర్థంగా నిర్వర్తిస్తాయి. కనుకే కార్టూనిస్టుకి తెలుగునాట ప్రజాదరణ మెండు. కార్టూన్‌లో





పాఠకుడు మమేకమవుతాడు. తదాత్మ్యం పొందుతాడు.

కార్టూన్ రంగాన్ని ఎంచుకుని దాన్లో పాతికేళ్లు ఏకధాటిగా నిత్యనూతనంగా కార్టూన్లు చిత్రించటం మాన్యులకే గాని సామాన్యులకు సాధ్యం కాదు. ఈ విషయంలో ఇరవై ఐదు వసంతాలు పూర్తి చేసిన శేఖర్‌ని తప్పక అభినందించాలి. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ రాజకీయాల్ని క్షుణ్ణంగా అవగతం చేసుకోవటం కార్టూనిస్టు ప్రథమ లక్షణం.. చక్కని వ్యంగ్యచిత్రం గీయగలగటం అతని రెండో లక్షణం... విమర్శనాత్మకత అతని మూడో లక్షణం... నాలుగోది వ్యంగం, హాస్యం గుప్పించగల చతురత.

ఎంతో విస్తారమైన, విపుల విషయ పరిజ్ఞానం లేనిదే కార్టూనిస్ట్ మనజాలడు. చూసిన ప్రతి విషయాన్నీ కార్టూన్‌కి ఉపయుక్తంగా మలవటం, ఆకళింపు చేసుకోవటం, ఊహ పెంచుకోవటం మామూలు విషయం కాదు. ఇవన్నీ పుష్కలంగా గల మన కార్టూనిస్ట్ శేఖర్ వెయ్యేళ్ళు వర్ధిల్లాలని త్రికరణ శుద్ధిగా కోరుకుంటున్నాను.

మొన్న వాళ్ళింటికెళ్ళినప్పుడు నాకక్కడ దొరికిన నిర్హేతుక జాయమాన ప్రేమాదరణలు నేనేనాడూ విస్మరించనలవికానివి. అందుకు శేఖర్‌కి కృతజ్ఞతలు.



కండ్లకుంట శరత్‌చంద్ర

హాస్యచంద్ర 001



ఇద్దరూ సికిందరాబాద్ మోండా మార్కెట్‌కు వెళ్ళి... నిమ్మకాయలు, గుమ్మడి కాయ, మేకులు, పసుపు, కుంకుమ, ముగ్గు, రంపం కొనుక్కొచ్చారు.

ఓ ఆయుర్వేద వైద్యుని దగ్గరకు వెళ్ళి... చెట్ల వేర్లు కొనుక్కొచ్చారు.

అక్కడి నుండి జూపార్క్‌కు వెళ్ళి... పులిబోన్లు శుభ్రం చేసే వాడికి వెయ్యి రూపాయలిచ్చి పులిమూత్రం కొనుక్కొచ్చారు.

ఇక మిగిలింది ... సమత వెంట్రుకలు.

అవి ఎలా సంపాదించాలో తెలీక జుట్లు పీక్కుని మరీ ఆలోచించారు.

"అవిడియా ..." అరిచాడు సర్వారావు.

"వదులు ... " అన్నాడు డబ్బారెడ్డి.

"నాకు తెలిసిన ఓ దొంగనా దొంగ వెధవ ఉన్నాడు. వాడికి చెబితే అనుమానం రాకుండా జుట్టు కత్తిరించి తెస్తాడు".

"అది సరే! నీకు దొంగలతో పరిచయం ఉందా!!"

"హ్మ్! వాడు నా క్లాస్‌మేట్ కానిస్టేబుల్ ఆంజనేయులు గాడి తమ్ముడు"

ఓ... హో! పద మరి".

"వాడు ఊరికే చెయ్యడు ఓ వెయ్యి కొట్టు".

డబ్బారెడ్డి వెయ్యి రూపాయలు ఇచ్చాడు.

సర్వారావు ఆ వెయ్యితో దొంగను కలిసాడు.

"ఆ అమ్మాయి వెంట్రుకలెందుకు? కొంప దీసి చేతబడో, వీథిబడో చెయ్యిస్తారా?"

సర్కారు బడి చెయ్యిస్తాం. నీకెందుకు? తెచ్చి పెట్టు" అన్నాడు సర్వారావు.

"సరే! వెయ్యి రూపాయలకు ఒకే ఒక్క వెంట్రుక తెచ్చిస్తాను" అన్నాడు దొంగ

"సరే... చావు".

"నన్ను తిడితే... తేను".

"సరే... బతుకు పో! ... "

దొంగ, సమత ఆఫీసుకు వెళ్ళే ముందు కాపేశాడు. చాకచక్యంగా ఓ తల వెంట్రుకను కట్ చేసి తెచ్చి సర్వారావుకు ఇచ్చాడు.

✦✦✦

డబ్బారెడ్డి, సర్వారావు శంషాబాద్ దగ్గరున్న పల్లెటూరుకు చేరుకున్నారు.

జరిగిన కథ: హాస్యచంద్ర ఓ ప్రైవేట్ డిటెక్టివ్. ఒక పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లో భార్య తప్పిపోతే కంగారు పడుతున్న ఒకతనికి మాస్టర్‌ప్లాన్ వేసి అతని భార్య అక్కడికి చేరుకునేట్లు చేస్తాడు హాస్యచంద్ర. ఈ సంఘటన చూసిన చాలామంది హాస్యచంద్ర ఫోన్ నెంబరు తీసుకుంటారు. ప్రహేళికారావు– తన కూతురు వెంట ప్రేమిస్తున్నామంటూ ఎవరైనా పడుతున్నారా కనిపెట్టమని హాస్యచంద్రకు ఫోన్ చేస్తాడు. ఆ కుర్రాల లిస్ట్ తీసుకొచ్చి ప్రహేళికారావుకిస్తాడు హాస్యచంద్ర. ఆ కుర్రాలను పిలిపించి వారందరిచేత తన ఇంట్లో నానా రకాల చాకిరి చేయిస్తాడు. వారందరికీ ఓ పరీక్ష కూడా పెడతాడు.

కారును ఓ చెట్టుకింద ఆపి తమతో తెచ్చుకున్న వస్తువులను, మేకపిల్లను తీసుకుని శ్మశానంలోకి నడిచారు. పల్లెటూరి శ్మశానం అవడంతో, దానికి గేటు లేదు... ఎటు చూసినా మట్టిదిబ్బలే కనిపిస్తున్నాయి.

"ఒరే సర్వాగా... పని ప్రారంభించనా?" అడిగాడు డబ్బారెడ్డి.

"ఊ! ఉస్కో!" అన్నాడు సర్వారావు.

డబ్బారెడ్డి బట్టలు విప్పేసి గోచీని కట్టుకని నీళ్ళతో నోరు పుక్కిలించాడు.

ఆ తర్వాత "హ్రైం, క్రీం ఇవివి సత్యనారా సార్లు జపించాడు.

ఆ తర్వాత పద్మాసనంలో కూర్చుని నిమ్మకాయలు కోసి వాటికి పసుపు, కుంకమ అద్ది ముగ్గులో వేస్తూ ... 'ఏందిబే ఎట్టాగ ఉంది ఒళ్ళు ...' అనే పాటను పచాపచా ఖూనీ చేస్తూ పాడాడు. ఆ తర్వాత... మంత్రం జపిస్తూ ... నాలుగు మేకులను నాలుగు వైపులా పాతాడు. అంతే !!!!

ఎవరో మర్రి చెట్టు మీది నుండి దూకారు.

ఆ ఆకారాన్ని చూడగానే ఇద్దరి స్వేదగ్రంధులలో నుండి చెమట తన్నుకొచ్చింది.

"హ్హిహ్హిహ్హి..." ఆ ఆకారం శ్మశానం దద్దరిల్లేలా నవ్వింది.

సోడా కొట్టిన శబ్దం, గాడిద నవ్విన శబ్దం కలిపితే వచ్చే రాగంలా ఉందీ ఆ నవ్వు.

ఇద్దరూ... పి.టి ఉష సోదరులైపోయి... పలాయనం చిత్తగించారు.

"మండూక మంత్రాన్ని జపించే తంతు పూర్తి చేయకుండానే... మేకులు పాతే తంతు నిర్వహించారు పిచ్చికుంకలు..." ఆ ఆకారం ఎవరి

తోనో అంటోంది.
ఇద్దరు కారులోనికి గెంతి... ప్రచండ వేగం తో ఇంటికి వచ్చి పడ్డారు.
డబ్బారెడ్డికి నూట నాలుగు, సర్వారావుకి నూట మూడుంబావు జ్వరం వచ్చింది.
రెండు రోజులలో ఇద్దరు సాధారణ స్థితికి వచ్చారు.
"ఏరా!... మళ్ళీ ప్రయత్నిద్దామా?" అడిగాడు డబ్బారెడ్డి.
"వద్దు... వద్దే వద్దు! దెయ్యాలతో గేమ్స్ వద్దురా!" అన్నాడు సర్వారావు.
"ఒరేయ్...నీకు రెండువందలా నలభై సినిమాలు చూపించాను. నూట తొంభై పిజ్జాలు, రెండొందల బర్గర్‌లు, యాభై లీటర్ల దాకా పెప్సీ తాగించాను. నా పిజ్జాలు మింగి నా పెప్సీ తాగి ఇప్పుడు... నా మాట వినవా?" డబ్బారెడ్డి చరిత్ర తవ్వాడు.
సర్వారావు ఇక ఎదురు చెప్పలేదు.
ఇద్దరూ ఇంట్లో... ప్రయోగం కోసం తెచ్చిన వస్తువులలో ఏమేం మిగిలాయో చూసారు.
సమత వెంట్రుక, పులిమూత్రం శ్మశానం లోనే వదిలేసి రావడంతో... అవి తప్ప అన్నీ ఉన్నాయి. సర్వారావు, దొంగను కన్‌సల్ట్ చేసి వెయ్యి సమర్పించి సమత శిరోజం ఒకటి సంపాదించాడు.
డబ్బారెడ్డి, జూపార్క్‌కు వెళ్ళి... వెయ్యి రూపాయలిచ్చి మళ్ళీ పులిమూత్రం కొనుక్కొచ్చాడు.
ఈసారి ప్రయోగాన్ని చిలుకూరు దాటి వెళ్ళి ఓ శ్మశానాన్ని ఎన్నుకున్నారు.
డబ్బారెడ్డి మళ్ళీ ప్రయోగం ప్రారంభించాడు.
ఈసారి ఎంతో నిష్టతో, ఏకాగ్రతతో... ఏ అంకం మిస్సవకుండా చేయసాగాడు.
సర్వారావు ప్రక్కనే నిల్చుని డబ్బారెడ్డి ప్రతి అంకాన్ని సరిగ్గా చేస్తున్నాడో లేదో... కాగితం లో చెక్ చేసుకోసాగాడు.
డబ్బారెడ్డి పులి మూత్రాన్ని నిమ్మకాయలపై పోసి... మహా మాండూక మంత్రాన్ని జపించాడు.
అంతే!!!
వారికి పది అడుగుల దూరంలో, భూమిలో నుండి ఓ చెయ్యి బయిటకొచ్చింది.
"బ్యావ్ ..." సర్వారావు అరిచాడు.
డబ్బారెడ్డి వణుకుతూ పైకి లేచాడు. ఈసారి మరో చెయ్యి కాళ్ళూ బయిటకొచ్చాయి.
"కెవ్వ్! లగెత్తురోయ్..." అరిచాడు సర్వారావు.
ఇద్దరూ పరిగెత్తసాగారు.
"పులిమూత్రానికి బదులు... ఎవడో వీరికి తోడేలు మూత్రం ఇచ్చాడు. ప్రయోగం వికటించింది" లీలగా వాక్యాలు ఇద్దరి చెవులను తాకాయి.
ఇద్దరూ ఇంటికొచ్చి పడ్డారు.
ఇద్దరికీ ఉష్ణోగ్రత 96 డిగ్రీలకు పడిపోయింది !!
మరో రెండురోజులలో కోలుకున్నారు.
"రేయ్! ఆ జూపార్క్‌గాడు మోసం చేశాడురా. లేకపోతే ప్రయోగం సక్సెసయ్యి సమత నా వశమయ్యేది" అన్నాడు డబ్బారెడ్డి.
"వదిలెయ్యరా... డబ్బిగా! అసలే లవ్వర్ లేనోడిని. నన్ను శాకినీ పిశాచాలకు ఆహారంగా వేయిస్తావా?! ఇలా ప్రయోగం వద్దే వద్దు".
"రేయ్... నేను తినిపించిన పిజ్జాలు... బర్గర్‌లు..."



"అపరా! ఆపు!! పద... వెళ్ళి చద్దాం!!!"

ఇద్దరూ జూపార్క్‌లో పులిబోన్లు కడిగేవాడి ఇంటికి వెళ్ళారు.

వాడు, వీళ్ళిద్దరిని చూసి ఏం భయపడలేదు. తాపీగా బీడీ తాగుతూ, "ఏంటి?" అన్నాడు.

"రేయ్! పులిమూత్రం ఇవ్వమంటే... తోడే లు మూత్రం ఇస్తావా?"దబ్బారెడ్డి అరిచాడు.

"పులి మూత్రానికి... తోడేలు మూత్రానికీ తేడా తెలియని అజ్ఞానుల్లాగా కనిపిస్తున్నామా?" సర్వారావు మొరిగాడు.

"బాబూ!...మీకు ఆయుర్వేద మందుల కోసమే కదా! పులిమూత్రంలో ఉన్న మంచి ఇటమిన్లే... తోడేలు మూత్రంలోనూ ఉంటా యట. అందుకే అదిచ్చినాను".

"పులి మూత్రంలో ఇటమిన్లు ఉంటాయో మినరల్స్ ఉంటాయో మాకు అనవసరం. మేము నిన్ను పులిమూత్రం అడిగాం. మర్యాదగా అది కక్కు!" అన్నాడు సర్వారావు.

"ఏంటి బాబూ కక్కేది... పులి ఏమన్న మనిషనుకున్నారా?? లీటర్ల లీటర్లు పొయ్యడానికి. అది చాలా తక్కువ పోస్తుంది. అది కూడా నేల మీద పడకుండా కలెక్షన్ చేసి ఇయ్యాలంటే ఎంత కష్టం?"

"మరి వెయ్యి తీసుకున్నావుగా? మర్యాదగా పులికి నీళ్ళు తాగించి... దానితో చెంచాడు మూత్రం పోయించి... రేపు ఉదయానికల్లా ఇచ్చావా సరే సరి... లేకపోతే నీచేత డ్రమ్ముడు పెప్సీ తాగించి నేను పోయిస్తా!..." చెప్పాడు దబ్బారెడ్డి.

వాడు, భయంగా తలూపాడు.

మరుసటి రోజు పులిమూత్రం ఇచ్చాడు.

ఈసారి సగం మూత్రాన్ని ఫ్రిజ్‌లో దాచుంచారు. దొంగ ద్వారా, సమత తాలూకు మరో శిరోజం సంపాదించారు.

ఈసారి ప్రయోగం చేసే స్థలాన్ని, పటాన్ చెరువు దారిలో ఉన్న ఓ శ్మశానం దగ్గర ఎన్నుకున్నారు.

ఈసారి ఒక్కొక్క అంకాన్ని నిష్టతో చేశాడు.

ప్రతీ అంకాన్ని సర్వారావు పర్యవేక్షించి... తలూపాడు.

చివరగా... రంపం తీసుకుని "ఓ.బి. గోపాలాయ నమః... ఓం రామ్ గోపాలేవర్మాయనమః..." అని పాతికసార్లు జపించి మేక పిల్ల దగ్గరికి వచ్చాడు.


"కొయ్యరా! త్వరగా ..."

"రేయ్! ధైర్యంగా సరిపోవడం లేదురా..."

"కొయ్యివే సాలే... త్వరగా ..." సర్వారావు, చుట్టూ వాతావరణంలో వస్తున్న మార్పును చూసి అరిచాడు.

దబ్బారెడ్డి వణికిపోతూ రంపాన్ని వదిలేశాడు.

అంతే!!!!!



శుభాకాంక్షలు!

తెలుగు పాఠకులకు మరియు పొలిటికల్ కార్టూన్లు తరచూ చూసే వారికి పెద్దగా పరిచయం చేయవలసిన అవసరం లేని సంతకం... శేఖర్ గారిది.


శేఖర్‌గారితో మొదటిసారి ఆంధ్రప్రభలో నాకు పరిచయం అయింది. నేను ఇంటర్‌వ్యూ కోసం వెళ్ళాను. అయితే విచిత్రంగా నాకు, బాలి గారికి మరియు శేఖర్ గారికి మాత్రమే ఆ ఇంటర్‌వ్యూ అని తెలిసి నేను షాక్ అయ్యాను. శేఖర్ గారు అప్పటికే ఆ పత్రికలోనే ఫ్రీలాన్సర్‌గా పని చేస్తున్నారు. కాకపోతే తనకు కనఫర్‌మేషన్ కొరకు మాత్రమే ఈ టెస్టు అని చెప్పి, నా గురించి అడిగి తెలుసుకున్నారు. ఇది మొదటిసారి పరిచయం.

ఇక రెండవసారి మోహన్ గారి దగ్గర కలిశాము. అప్పుడు నాతో చాలా పరిచయం ఉన్నట్టే మాట్లాడడం జరిగింది. తనకు ఒక్కసారి పరిచయమైతే చాలు, ఎప్పటి నుండో పరిచయమున్నట్లుగా చాలా ఆప్యాయంగా మాట్లాడడం ఆయనకున్న మంచి మనస్సుకు నిదర్శనం.

శేఖర్ గారి కార్టూన్లు గురించి మాట్లాడాలంటే సమకాలీన రాజకీయాలలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటి లోటుపాట్లపై వెంటనే స్పందించి వాటిపై వెంటనే కార్టూన్లు వేయడంలో ముందుంటారని చెప్పవచ్చు. దానికి ఉదాహరణగా ఒకటి చెప్పవచ్చు. మన ఇండియన్ కరెన్సీకి ఇటీవల కొత్తగా ఒక సింబల్‌ని విడుదల చేశారు. దానిపై మరుసటి రోజునే శేఖర్ గారు ఆ సింబల్‌పై తనదైన శైలిలో స్పందిస్తూ మన భారత జనాభాలో ఉన్న వ్యత్యాసాన్ని చూపుతూ ధనిక, మధ్య తరగతి, పేదవాళ్ళుగా విభజించి ఆ సింబల్‌లో పెట్టి చూపటం శేఖర్ గారి ప్రతిభకు అద్దం పడుతుంది.

శేఖర్ గారు కార్టూన్ రంగంలో తన ప్రయాణం యిరవైఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో శేఖర్‌గారి గురించి వ్రాయడం నా అదృష్టంగా భావిస్తూ... నా వంతు ప్రయత్నం చేశాను.

–బాలు, ఆర్టిస్ట్



శ్మశానంలోని... సమాధులన్నీ తెరుచుకున్నాయి.

శవాలన్నీ పైకి లేచాయి.

"స్టాక్ ఎక్సేంజ్ కుప్పకూలిందటగా?" ఓ శవం అడుగుతోంది.

"అబ్బా! అన్నయ్య గారూ... ఎప్పుడూ బిజినె స్సేనా! కళాంజలిలో 50% డిస్కౌంట్‌కే చీరలు ఇస్తున్నారట. ఈ రాత్రికి వెళ్ళి చూసి రావాలి".

"సినిమాలు ఏమాడుతున్నాయ్?"

"అబ్బా! ఆంటీ... ఇక్కడ ఇద్దరూ మను షులు వచ్చారు. వీళ్ళను తినకుండా ఏంటి మీ గోల!" ఓ పిల్ల శవం అంది.

"తిందాం లేవే! అయినా, మనల్ని తప్పించుకుని ఎక్కడికి వెళతారు!" శవాలన్నీ వారివైపు కదిలారు.

"బ్యావ్ ..."

"లాయ్... లో... య్..." ఇద్దరూ అరుస్తూ శ్మశానం బయిటకు పరిగెత్తారు.

శవాలు వారి వెంట పడ్డాయి.

ఇద్దరూ కారులోనికి దూకారు.

"మేకపిల్లను కోసే ధైర్యంలేక ... ప్రయోగం చేస్తారంట ప్రయోగం ... మటన్ తినడం వేరు, మేకను కొయ్యడం వేరు. మూర్ఖపు వెధవలు!" ఓ వృద్ధ శవం అంది.

ఈసారి ఇద్దరూ ఇల్లంతా లైట్లు వేస్కొని... హాల్‌లో ఆంజనేయస్వామి విగ్రహాన్ని, ఫొటోను కౌగలించుకొని... గజగజ వణుకుతూ పడుకున్నారు.

మూడు రోజుల తర్వాత గాని ఇద్దరూ బయిటకు రాలేదు.

"రేయ్... చిట్టచివరిగా ప్రయత్నం చేద్దాం... ప్లీజ్!" అన్నాడు డబ్బారెడ్డి.

"వద్దురా... వద్దేవద్దు... నీ పిజ్జాలు, నీ పెప్సీలు... బ్యాంకులోన్ తీసుకునైనా తీరుస్తాను. నన్ను దెయ్యాలకు నైవేద్యంగా వేయిస్తానంటే ... ఇంకా నీతో ఎందుకుంటాను. ఉండను" అన్నాడు సర్వారావు పారిపోతూ.

"రేయ్... ఆగరా! సమత నా వశమైతే ... నీకు పదివేలు ఇస్తాను" అరిచాడు డబ్బారెడ్డి. సర్వారావు ఠక్కున ఆగిపోయి–

""హ్హిహ్హిహ్హి స్నేహాన్ని డబ్బుతో కొలుస్తావట్రా... సరేలే అలాక్కాని..." అన్నాడు.

ఇద్దరూ మళ్ళీ... రెడీ అయ్యారు.

సర్వారావు, దొంగను కలసి వెయ్యి రూపాయలిచ్చాడు.

"అబ్బా! ఏంట్సార్! ఎన్నిసార్లు ఆ అమ్మాయి వెంట్రుక తేవాలి" చిరాగ్గా అడిగాడు దొంగ.

"మా నాయనే! ఈ ఒక్కసారి తెచ్చి పెట్టవూ" అన్నాడు సర్వారావు.

"సరే లేండి" అన్నాడు దొంగ విసుక్కుంటూ. **(సశేషం)**





స్ఫూర్తిదాయక జంట చంద్రకళా శేఖర్



కార్టూనిస్ట్ శేఖర్ గురించి ప్రస్తావించినపుడు ఆయన జీవిత సహచరి చంద్రకళ గురించి చెప్ప కుండా ఉండలేం. భార్యా భర్తలకు స్వచ్ఛమైన నిదర్శనం ఆ జంట.

అది కార్టూనిస్టుల మీటింగ్ కావచ్చు. కవి సమ్మేళనం కావొచ్చు. మరో రాజకీయ పార్టీ బహిరంగసభ కావొచ్చు ఎక్కడైనా ఇద్దరూ ప్రత్యక్షం. శ్రీమతి చంద్రకళ శేఖర్ తీర్చిదిద్దుకున్న బొమ్మం. ఒకరిని చూస్తే మరొకరు గుర్తుకువస్తారు, సాహిత్య కళారంగాల్లో చాలామందికి.

ఎప్పుడో పెళ్లంటే ఏంటో కూడా తెలియని వయసులో నిరక్షరాస్యురాలైన చంద్రకళను శేఖర్ వివాహం చేసుకున్నాడు. దాదాపు 30 ఏళ్లు వారి జీవన ప్రయాణంలో నేర్చుకుంటు న్నదే ఎక్కువ. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వాళ్ల పెళ్లినాటికి ఆమె నిరక్షరాస్యు రాలు. అప్పటికి ఆయనకు కార్టూన్లు తెలి యదు. ఒకరి సమక్షంలో ఒకరు కార్టూన్లు, చదువు నేర్చుకున్నారు. భార్యకు చదువులేదని బాధకు గురైన మరుక్షణమే శేఖర్ ఆమెకు అక్షరాభ్యాసం చేశాడు.

అలా ఓ దశాబ్దంన్నర కాలంలో ఆమెను బి.ఏ వరకు చదివించారు. అన్నిటికీ ఆయనే గురువు. కంప్యూటర్ రంగంలో డిటిపి డిజై నింగ్ నేర్పించి 'చేతనాగ్రాఫిక్స్' పేరుతో సొంత సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఆమె కూడా శేఖర్ స్ఫూర్తితో పెయింటింగ్‌లు వేయడం నేర్చుకున్నారు. ఒకవైపు పిల్లల పెంపకం మరో వైపు ఇద్దరి చదువు. క్షణం తీరిక లేకుండా గడిచింది.

శ్రీమతి చంద్రకళ తనకు చదువు వచ్చిందని నమ్మకం కుదిరాక అలతి అలతి పదాలలో "కలుపు తీసిన..కంప్యూటర్ చేసినా" అనే చిన్న పుస్తకాన్ని రాసారు. పెళ్లికి ముందు పొలాల్లో పనిచేసి, పశువులు కాసిన చంద్రకళ రాసిన ఆ పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వారు వయోజన విద్యాశాఖలో ఓ పాఠ్యగ్రంథంగా ఉంచారంటే చదువు విషయంలో చంద్రకళ చేసిన కృషి తెలిసిపోతుంది.

శేఖర్ ఏం చదివినా, చూసినా ఆమెకు చెప్పకుండా ఉండరు.

ఆఖరుకి తనతో పాటే తన భార్యకూ కార్‌డ్రైవింగ్ నేర్పించడం విశేషం. ఆమె చదు వులో ఆయన కార్టూన్ రంగంలో ఒకరి వెన్నం టి ఒకరు విజయాలు సాధించారు.


చంద్రకళ పుస్తకం చూసి చాలామంది ఆమెను రష్యన్ రచయిత్రి రోజన్‌బర్గలతోను, సావిత్రిబాయి పూలేతో పోల్చేవారు. నిజానికి శేఖర్ చంద్రకళల కృషికూడా సావిత్రిబాయి, పూలేల ఆశయసాధన దిశగా సాగుతోంది ఇప్పుడు.

ఆదర్శవనిత, విశిష్టమహిళ పురస్కారం ఇతర అనేక సన్మానాలు అందుకున్నా అన్నిటికి నా గురువు శేఖర్ గారే కారణం అని విన యంగా చెబుతారామె.

ఎన్నో అవాంతరాల మధ్య వారి 'కళాత్మక' జీవితం నడుస్తోందని అనిపిస్తోంది వారికి... చూసిన వారికి.

స్ఫూర్తిదాయకమైన ఈ జంటకు 'సందు' అనే అబ్బాయి, 'చేతన' అనే అమ్మాయి ఉన్నారు.

– అనన్య సాహితి






ఓం..సాఫ్ట్‌వేరాయ నమః ఓం నో ప్రాజెక్టాయ నమః ఓం..ప్లంబాయ నమః ఓం..లాబీసాయ నమః
ఓం..పింక్ స్లిప్పాయ నమః







మా తరంలో ఇన్ని కార్టూన్లు వేసినవాళ్లు మరొకరు లేరు.



శేఖర్ అనగానే గుర్తొచ్చేది ఎలాంటి భేషజం లేని ఆయన నవ్వు. శేఖర్‌కు కార్టూనిస్టు లక్షణాలు బొత్తిగా లేవు. చిరాగ్గా, పరాకుగా ఎప్పుడూ ఉండడు. అయిడియాల కోసం ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండటం నేను చూళ్లేదు. ఆదుర్దాగా అసలు చూడలేదు. కార్టూన్లలో తప్పు ఎవరినీ విమర్శించడం... దూషించడం చేయడు... ఎవరిగురించి వెటకారంగా మాట్లాడడు.

అత్యంత ప్రతిభావంతులు పెద్దగా కష్టపడనక్కరలేదు. ఆసక్తి మాత్రం అమితంగా ఉండి, శక్తిలో మితంగా ఉన్నవాళ్లు కష్టపడి పనిచేస్తూ ఉంటేనే ఉన్న స్థాయిని నిలబెట్టుకోడం, వీలైతే పెంచుకోవడం సాధ్యపడుతుంది.

మోహన్, శ్రీధర్ లాంటివాళ్లు అట్టే కష్టపడే అవసరంలేదు (బొత్తిగా కష్టపడరని కాదు, వాళ్ల కష్టాలు వాళ్లకుంటాయ్) బొమ్మలు సరేసరి. శేఖర్ శ్రామికుడు,సెన్సాఫ్‌హ్యూమర్ కన్నా విమర్శని ఎక్కువ ఇష్టపడేవాడు. ఒక విషయాన్ని పరిశీలించడం, లోతుపాతులు, లోటుపాట్లు తెలుసుకోవడం వాటిని అభివ్యక్తీకరించడానికి తను కార్టూన్లు మాధ్యమంగా ఎంచుకున్నానని శేఖర్ చెప్పుకున్నాడు, ఇది చాలా శ్రమతో కూడుకున్న విషయం.

అందుకే ఆయన్ను కళాకారుడు కాక 'శ్రామికుడు' అన్నాను. (ఇదే ఎక్కువ గౌరవప్రద మైందని శేఖర్ కూడా అంగీకరిస్తాడు) ఎంత కష్టమైనా అలుపూ,విసుగూ లేకుండా ఉద్యోగ జీవితాల్లో నిస్పృహ చెందకుండా నిరంతరం పని కొనసాగించాడు.

మా తరంలో ఇన్ని కార్టూన్లు వేసినవాళ్లు మరొకరు లేరు. అందరూ చూసే తెలుగు పత్రికల్లోనే కాకుండా ఎవ్వరికీ కనిపించని ఇంగ్లీషు,హిందీ పత్రికలకు కూడా ఫ్రీలాన్స్ వర్క్ చేశాడు. పేరు ప్రఖ్యాతులను ఆశించకుండా కేవలం పనిమీద ఇష్టం ఉన్నవాళ్లే ఇలా చేయగలరు. తనకు ఉన్న వర్క్‌హాలిక్‌తనాన్ని శేఖర్ తన పిల్లలకు, భార్యకూ కూడా నేర్పాడు. సహచరికి ఏమేం నేర్పాడో 'కలుపు తీసిన కంప్యూటర్ చేసిన' పుస్తకం చూస్తే తెలుస్తుంది.

చాలా కాలం క్రితం కవిమిత్రుడొకరు చాలా మంచి మాట చెప్పారు.

"మనమేం నేర్చుకున్నామో... ఏం తెలుసుకున్నామో భార్యకు కూడా ట్రాన్స్‌ఫర్ చెయ్యాలి. వాళ్లకు కూడా మప్పించాలి. లేకపోతే జీవన ప్రయాణంలో వాళ్లొక దిక్కు, మనమొక దిక్కు ప్రయాణించి చివరికి అపరిచితులమైపోతాం". –ఈ మాట చెప్పిన కవీ, ఇంతకాలం గుర్తుంచు కున్న నేనూ అది ఏమాత్రం పాటించామో చెప్పలేం కానీ శేఖర్ మాత్రం ఎవరూ చెప్పకుండానే అది చేసి చూపించాడు.

ఉద్యోగ జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ దరిద్రపు రాజకీయాలను, నికృష్ట వ్యక్తి త్వాలని చూస్తూ వాటిని కార్టూన్లకోసం మలుచుకుంటూ, అయిడియాల్లో, బొమ్మల్లో నిర్వి రామంగా నవ్వు చెదరకుండా, అలసటని అనుమతించకుండా ఇరవైఐదు ఏళ్లుగా పోరాడు తున్నాడు శేఖర్. ఇప్పటికీ అదే విశ్వాసంతో, నమ్మకంతో పనిచేస్తున్నాడు.

అందువల్లే నేను శేఖర్‌ని ఇష్టపడటానికి గౌరవించడానికీ ఆయన 'కార్టూనిస్ట్ శేఖర్' కానక్కర్లేదు, 'శేఖర్' అయితే చాలు.

–సురేన్ద్ర (ది హిందూ దినపత్రిక)
శేఖర్ మిత్రుడు

కథ

కోనె నాగ వెంకట ఆంజనేయులు
9290 60220



పెను భూతం

"యిప్పుడు కాదు ఆయన యింట్లోనే ఉన్నారు మధ్యాహ్నం రెండు గంటలకిరా! ఇప్పుడు వెళ్ళిపో త్వరగా..."

కంగారు కంగారుగా... గాబరా గాబరాగా.... రహస్యం రహస్యంగా... తన భార్య వసంత అంటున్న మాటలు అప్పుడే స్నానం చేసి బాత్‌రూంలోంచి బయటకు వస్తున్న పద్మనాభం చెవిలో పడనేపడ్డాయి.

ఆ మాటల్లోని భావం అతనికి అర్థమవ డానికి అరసెకండులో సగం టైము కూడా పట్టలేదు. అర్థమయిన మరుక్షణం –

కోపంతో అతని దవడకండరం బిగుసు కుంది. భృకుటి ముడిపడింది... అసలు యిలాంటి సందర్భంలో అలా అది ముడి పడొచ్చా? ఏమో?...

పళ్ళు పటపటాకొరికాడు. తిరగలి విసురు తున్నప్పుడు (బయటకు విసిరేయడం కాదండి బాబు) అందులోంచి పిండి రాలినట్లు అతని నోట్లోంచి పళ్ళపొడి (టూత్ పౌడర్ కాదు) పద్మనాభం నోట్లోని పళ్ళ తాలుకు పొడి నేల మీద పడి తెల్లటి ముగ్గుకుప్పలా తయారవు తోంది.

కసితీరా కాటు వేయబోయే ముందు బుసలు కొట్టే నాగుపాములా బుసలు కొడు తున్నాడు. ఎంతకాలం నుంచి సాగుతోందీ వ్యవహారం.

'మధ్యాహ్నం రా' అన్న ఆ ఏకవచన సంభో దనను బట్టి చూస్తుంటే చాలాకాలం నుంచీ చాలా రసవత్తరంగానే జరుగుతున్నట్లుగా ఉంది భాగోతం.



యింతకీ ఎవడు వాడు? ఎచ్చటి వాడు ?

ఎదురింటి సుబ్బలక్ష్మి (రుబ్బురోలు సుబ్బ లక్ష్మి అంటారు గిట్టని వాళ్ళు) ములక్కాడ మొగుడు మాధవరావా?... ములక్కాడలా ఉన్నావాడు రసికశిఖామణినని గుసగుసలాడు కుంటారు వీధిలోని వాళ్ళు... అందమైన అమ్మాయి కనబడితే చొంగ కార్చుకుంటూ కళ్ళార్పకుండా ఆబగా చూడటంలో సిద్ధ హస్తుడటవాడు...వాడేనా?

లేకపోతే పక్కింటి పంకజాక్షి పతిదేవుడు ఫల్గుణరావా?

"అమాయకుడిలా కనిపిస్తాడు గానీ గ్రంథ సాంగుడేనండోయ్" అని ఫల్గుణరావు గురించి –తన దగ్గర అప్పుకోసం వచ్చే మూడో యింటి ముకుందరావు అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తుకొచ్చాయి పద్మనాభానికి.

గ్రంథసాంగుడంటే గ్రంథాలు బాగా చది విన వాడా?... లేకపోతే ఆ గ్రంథాల్లోని సాంగులు శ్రావ్యంగా పాడేవాడా అని తను అనుమానం వ్యక్తపరిస్తే అవేవి కావట, గ్రంథ సాంగుడంటే ఆడవాళ్ళతో ఆవేవో వ్యవహా రాలు నడిపేవాడట ఈ వివరణ యిచ్చిందీ ముకుందరావే!... వాడైఉంటాడా?

అవునూ! అసలు ఆ రాస్కెల్ – ముకుంద రావే ఎందుకు కాకూడదు? తనున్నప్పుడే కాదు, తను యింట్లో లేనప్పుడూ తనయింట్లోకి చొరబడిపోయి –వసంతని పొగడ్తల్లో ముంచెత్తి కాఫీలు, టిఫిన్లు లాగిస్తూంటాడు.

వాడెందుక కాకూడదు?

పైపెచ్చు వాడు వసంతని 'చెల్లెమ్మా' అని కాక – తనకు స్వయానా పెద్దన్నగారైనట్లు 'మరదలా' అని పిలుస్తుంటాడు. వాడు కూడా కావొచ్చు సందేహం లేదు ఈ ముగ్గురిలో ఎవడో ఒకడై ఉంటాడు వాడు – నోడౌట్ !

గబగబా బైటికి వెళ్ళి వాడెవడో చూడడానికి కూడా వీలులేని పరిస్థితి.

కేవలం మొలమీద చిన్న టవలు మాత్రమే చుట్టుకుని ఉన్నాడు తను ఆ సమయంలో.

ఆ వస్త్రధరణలో పరుగెడితే తనకు వస్త్రాప హరణం కావడం... చూసే వాళ్ళకు నేత్రా నందం కలగడం ఖాయం... అందుకే ఆ ప్రయత్నం చేయలేదు పద్మనాభం.



అయినా... వాడు ఎప్పుడో ఉడాయించి ఉంటాడు. కాదుకాదు ఈవిడే వాణ్ణి లాలించో - బుజ్జగించో ఉడాయింపజేసి ఉంటుంది.

యిప్పుడు వెళ్ళిపోయి మధ్యాహ్నాం రమ్మని వాణ్ణి ఆహ్వానించిందంటే - ఆ టైములో తను ఆఫీస్‌లో బిజీగా ఉంటాడనేగా! సాయంత్రం ఆరైతేనే గాని తను యింటికి తిరిగి రాడని కచ్చితంగా తెలుసు వసంతకి. అందుకే మధ్యాహ్నామైతే వ్యవహారం అడ్డూ ఆపూ లేకుండా నిర్భయంగా ఏకబిగిన నడిపించ వచ్చునన్న ధైర్యం అన్నమాట.

పట్టరాని ఆగ్రహంతో అతని దవడ కండరం మళ్ళీ యింకా గట్టిగా బిగుసుకుంది ఓ పట్టాన ఊడిరావడానికి వీల్లేకుండా నేలమీద మరో చిన్న సైజు ముగ్గుకుప్ప ఏర్పడిపోయింది.

ఆలోచనలు తెగడంలేదు.

ఓ పక్కన ఆఫీస్‌కి టైమయిపోతుండటంతో - ఆదరాబాదరాగా పేంట్ వేసుకుని, డ్రయర్ తొడిగేసుకున్నాడు పద్మనాభం.

అద్దంలో చూసుకుంటే సూపర్‌మేన్‌లా కన బడుతూండటంతో రక్తం కారేలా నాలుక్క రుచుకుని - డ్రాయర్ విప్పి, పేంట్ కూడా విప్పేసి మళ్ళీ డ్రాయర్ వేసుకుని పేంట్ తొడిగే సుకున్నాడు పద్మనాభం.

పౌడర్ రాసుకుని అద్దంలో ముఖం చూసు కుంటే - తనకి తనే ముద్దొస్తున్నాడు ఉదయ్ కిరణ్‌లా. అలాంటి తనను కాదని వాడెవడ్నో ఎందుకు మరిగింది వసంత?

పెళ్ళి నాటి ప్రమాణాలన్నీ ఏమయ్యాయి? చెర్లో కలిపేసిందా ?

కోపంతో పళ్ళు పటపటలాడించబోయి - యిప్పటికే ఆ కార్యక్రమం రెండుసార్లు అయ్యిం దని గ్రహింపుకు రావడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

చేతిలో పొగలు కక్కుతున్న ఉప్మా ప్లేటుతో ప్రత్యక్షమయింది వసంత-


"టిఫిన్ రెడీ సార్!..." అంటూ పళ్ళారా నవ్వుతూ.

'అమ్మమ్మ! ఎంత నంగనాచివే! ఏమి ఎరగ నట్లు ఎంత నాటక మాడుతున్నావే ! కన్నాంబ కూడా బలాదూరే నీ నటన ముందు. అంజలీ దేవి నేర్చుకోవాలే నటించటం నీ దగ్గర... ఎవరికి తెలియదనుకుంటున్న నీ రహస్యం నాకు తెలిసిపోయిందిలే. మధ్యాహ్నాం రెండు గంటలకు రమన్నావు కదా వాడిని!

అదే టైముకి వచ్చి రెడ్ హేండెడ్‌గా పట్టు కుంటానే మీయిద్దర్ని ! నీ బండారం బయట పట్టి నీకు విడాకులిచ్చి- మా ఆఫీస్‌లో స్టెనో రోజాని నీ కళ్ళ ముందే పెళ్ళి చేసుకుని తట్టెడు పిల్లల్ని కూడా కనకపోతే నా పేరు రాజబాబే... ఛీ!... ఛీ!!... టెన్షన్‌లో నాపేరేదో కూడా మర్చి పోయాను కదే! నా పేరు పద్మనాభరావే కాదే' -మనసులోనే (వి) భీషణ ప్రతిజ్ఞ చేసుకున్నాడు రాజు... సారీ... పద్మనాభం.

ఉప్మా యాంత్రికంగా నోట్లోకి వెళ్ళి వస్తోంది గానీ - నేతి పోపులో జీడిపప్పు, అల్లం, కరి వేపాకు దట్టించి చేసిన ఘుమ ఘుమ లాడు తున్నా ఉప్మా రుచి నోటికి తగలడంలేదు పద్మనాభానికి. రోజు అమృతంలా అనిపించే బ్రూ కాఫీ కటిక చేదుగా తగులుతోంది నాలిక్కి.

యివేవి తెలియని వసంత- "యింతలోనె



ఈ ముగ్గుకుప్పలెక్కడినుంచి వచ్చాయబ్బా ఉదయాన్నే యిల్లంతా శుభ్రంగా ఊడ్చానే"- అని గొణుక్కుంటూ చీపురుకట్టతో ఆ పళ్ళపొడి కుప్పల్ని ఊడ్చుకుంటూ వయ్యారంగా వంట గదిలోకి వెళ్ళిపోయింది.

అన్య మనస్కంగానే స్కూటర్ స్టార్ట్ చేసుకుని ఆఫీస్‌కి బయలుదేరాడు పద్మనాభం.

మెయిన్ రోడ్డులోకి వచ్చేసరికి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపాడు పద్మనాభాన్ని.

"హెల్మెట్ ఎక్కడసార్" అడిగాడు.

కళ్ళుగాని పోయాయా వీడికి! హెల్మెట్ ఎక్కడుంటుంది? నెత్తి మీదేగా అనుకుంటూ బుర్ర తడుముకుంటే - బిరుసెక్కిన బొచ్చు తగిలిందే గాని హెల్మెట్ తగల్లేదు పద్మనాభం చేతికి.

ఈ హడావిడిలో హెల్మెట్ పెట్టుకోవడం మరచిపోయాను కాబోలుననీ... తనని తానే తిట్టుకుని 'ఫైన్' కట్టి రసీదు తీసుకుని స్కూటర్ ముందుకి దూకించాడు.

ఆఫీసులో నిమిష నిమిషానికి గడియారం చూసుకుంటూ ఒంటిగంట వరకు గడిపాడు.

ఆఫీస్‌కి మధ్యాహ్నం హాఫ్‌డే లీవ్ పెట్టేసి స్కూటరెక్కాడు. ఈ సమయంలో తనెప్పుడూ యింటికి వెళ్ళడు. అందుకే ఈ టైములో రమ్మంది వసంత తన రహస్య ప్రియుణ్ణి.

పళ్ళు 'పటపటా...పటపటా' కొరుకుతూ స్కూటర్ నడుపుతుంటే పద్మనాభం నోట్లోంచి పళ్ళపొడి మళ్ళీ రాల్తోంది రోడ్‌మీద తెల్లటి గీతగీస్తూ.

రోడ్‌మీద ఆల్‌రెడీ ఉన్న తెల్లగీత ప్రక్కన మరోగీత అప్పటికప్పుడు ఎలా ఏర్పడుతోందో అర్థమవక తెల్లమొహం వేస్తూ సిగ్నల్స్ కూడా ఇవ్వకుండా బిత్తరపోయి చూస్తున్నాడు కానిస్టేబుల్.

ఎవడు! ఎవడు! ఎవడు! పద్మనాభం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.



రుబ్బురోలు సుబ్బలక్ష్మి మొగుడు మాధవరావు అయి ఉండొచ్చు. వాడోసారి వసంతని స్కూటర్ మీద ఇంటి దగ్గర దిగబెట్టాడు కూడా.

కూరగాయలు కోసం మార్కెట్‌కి వెళ్ళిన వసంత బస్సులు దొరక్క దిక్కులు చూస్తుంటే అటే వస్తున్న మాధవరావు స్కుటరెక్కించుకుని తీసుకువచ్చాడట. ఆ రోజు వాళ్ళావిడ ఊళ్ళో లేని కారణంగా ఈవిడ వాణ్ణి ఇంట్లోకి పిలిచి కాఫీ, టిఫినూ ఇచ్చి ఆదరించిందట.

ఆ రాత్రి "ఆయన చాలా మంచోడండి" అని పొగిడింది కూడా వసంత. వాడికి, దీనికి ఏ సంబంధంలేకపోతే రాత్రి 'ఆ టైములో వాడి ప్రస్తావన ఎందుకు తెస్తుంది! వాడేనా! అయి ఉండొచ్చు.

పద్మనాభం ఆలోచనలు జీళ్ళపాకంలా సాగుతున్నాయి.

ఫల్గుణరావు కావడానికి కూడా ఆస్కారం ఉంది. 'పాపం పెరట్లో ఎప్పుడు కనిపించినా నన్ను చూసి మనసారా నవ్వుతారండీ ఆయన అని వసంత పద్మనాభంతో అప్పుడప్పుడూ చెబుతూ ఉంటుంది. దీని మీద కన్నేయక పోతే వాడు పెరట్లోంచి దీన్ని చూసి ఎందుకు నవ్వుతాడు? అసలు వాడు పెరట్లో తచ్చాడేది ఈవిడ గారి కోసమేనేమో?... కారం రాసుకున్నట్లు

ఆయన కార్టూన్లు ఓ వ్యసనంగా మారిపోయింది.

2002లో ఆంధ్రజ్యోతి పునఃప్రారంభమైనప్పుడు నేను వార్త దినపత్రిక నుండి శ్రీశేఖర్ ఆంధ్రప్రభ నుంచి జ్యోతి డైలీకి వచ్చాం. దాదాపు ఆరుసంవత్సరాలు ఇద్దరం కలిసి పని చేశాం. కార్టూన్లు గీయడం నా ప్రవృత్తి అయిన కారణంగా శేఖర్ గీసిన కార్టూన్లను, ప్రత్యేకించి ఆయన అంకిత భావాన్ని ఆరాధిస్తూ ఉండేవాడిని. ముఖ్యంగా ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో శేఖర్ గీసిన 'లైఫ్‌లైన్' కార్టూన్లు నన్నెంతో ఆకట్టుకున్నాయి. ఒకే కార్టూన్లో ఓ వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని శేఖర్ చాలా చక్కగా, ఆకర్షణీయంగా అందించేవారు.

శేఖర్ గొప్పతనం గురించి నేను ప్రత్యేకంగా చెప్పేదేముంది? పుష్కరకాలంగా ప్రతిరోజూ ఆంధ్రజ్యోతిలో శేఖర్ కార్టూన్ చూడడం ఓ వ్యసనంగా మారిపోయింది. శేఖర్ నిర్విరామంగా నిరాటంకంగా మరిన్ని సంవత్సరాలు తన కార్టూన్లతో పాఠకులను అలరించాలని కోరుకుంటున్నాను. **-ఓంప్రకాశ్ నారాయణ వడ్డి(ఓనావ)**

సీనియర్ కరస్పాండెంట్, ఎ..బి.ఎన్. ఆంధ్రజ్యోతి



ఎన్నో ఐడియాలు ఇచ్చారు.

శేఖర్- ఈ పేరు నాకు ఊహ తెలిసినప్పట్నుంచి పరిచయం అయిన పేరు... మా గ్రామం లైబ్రరీకి 'ప్రజాశక్తి' పేపరొచ్చేది. చిన్నప్పట్నుంచి నాకు కార్టూన్లను పరిశీలించడం అలవాటు. అలా శేఖర్‌సార్ కార్టూన్లు పదే పదే చూసేవాడిని. శేఖర్‌సార్ రాజకీయ పరిస్థితులను నవ్విస్తూ... గిలిగింతలు పెడుతూ చెప్పడం...కుంచెపోటుతో నాయకులను శేఖర్‌సార్ వేసే చురకలు నాకు మహా ఆనందం కలిగించేవి.

అలా ఆయన అభిమానిగా మారాను.

నేను హైదరాబాద్ వెళ్ళిన కొత్తలో1996లో శేఖర్‌సార్ ఆంధ్రప్రభలో కార్టూన్లు వేస్తున్నారు. ఆయనను కలవాలంటే అంతపెద్ద కార్టూనిస్ట్ నాకు టైం ఇస్తారో లేదోనని డౌట్‌తో వెళ్ళాను. నేను ఊహించినదానికి భిన్నంగా ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారు. ఎన్నో అవకాశాలు ఇప్పించారు. శేఖర్‌సార్ ఇంకా ఎన్నో మంచి కార్టూన్లు అందివ్వాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను.

-రవినాగ్, కార్టూనిస్ట్, ఆంధ్రప్రభ

భగ భగా మండుతోంది పద్మనాభం ఒళ్ళు.

ఆ మూడోఇల్లు ముకుందరావు పెళ్ళాం పద్మావతీ ఎప్పుడూ పుట్టింట్లోనే ఉంటుంది. 'ఆయనకు వంట రాదట అంటూ' కాఫీలూ, టిఫిన్లూ వాడింటికి తీ(మో)సుకుని వెళ్ళి ఈమె యిస్తూ ఉంటుంది.

ఇలా ఆలోచిస్తూ రోడ్డు మధ్యలోకి వచ్చేసిన పద్మనాభం - బస్సువాడి హారన్ విని ఉలిక్కి పడి ఆలోచనల్లోంచి తేరుకుని స్కూటర్ పక్కకి తీసాడు.

ఇల్లు దగ్గరవుతోంది... యింటి ముందు స్కూటర్ ఆపితే ఆ శబ్దం విని లోపలి వాళ్ళు 'జాగ్రత్త' పడటానికి అవకాశం ఉంటుందని ఆలోచించి స్కూటర్‌ని ఇంటికి రెండు సందులు యివతలే ఉన్న పార్క్ దగ్గర పార్క్ చేసి నెమ్మదిగా నడుచుకుంటూ యింటికి చేరుకున్నాడు పద్మనాభం.

ఎటువంటి దృశ్యం చూడవలసి వస్తుందోనని మనసు దిట్టవు పరచుకొని కాలింగ్ బెల్ నొక్కాడు.

విడాకులకి ఏ లాయర్‌ని సంప్రదించాలి?

క్షణాలు నిమిషాల్లా అనిపిస్తున్నాయి...

ఎంతకీ తలుపు తెరుచుకోవడంలేదు. రెండు నిమిషాల తరువాత తలుపులు తెరుచుకుంటునట్టు శబ్దం అవుతోంది... ఆ రెండు నిమిషాలు పదినిమిషాల్లా తోచాయి పద్మనాభనికి తలుపులు తెరుచుకున్నాయి.

అస్తవ్యస్తంగా ఒంటికి చుట్టుకున్న నలిగిన చీర - అక్కడక్కడా చిరిగిన జాకెట్టు - జడలో నలిగిన మల్లెపూలు-చెదిరిన నొసటి కుంకుమ -అలసిన కళ్ళు - మొఖం నిండా చిరు చెమట బిందువులు-ఈ గెటప్‌తో-తలుపులు తెరుస్తుందనుకున్న వసంత-అలా లేదు.

కడిగిన ముత్యంలా మెరుస్తోంది. ఇంతలోనే గెటప్ ఎలా మార్చింది?సడెన్‌గా ఆ సమయంలో భర్తను చూసి గతుక్కుమంది వసంత.

"ఏ మయిందండీ?... అప్పుడే వచ్చేశారేమిటి?' అని అడిగింది కంగారుగా.

నేల మీద ఉన్న తెల్లటి ముగ్గుకుప్ప వైపు భర్తముఖం వైపు మార్చి మార్చి ఆశ్చర్యంగా చూస్తోంది.

ఆమె ప్రశ్నకు సమాధానం చెప్పలేదు పద్మనాభం ఆమె మీదనుంచి హాల్లోకి తొంగి చూసాడు ఆ దొంగ రాస్కెల్ కోసం. వాడెక్కడ ఉంటాడు? ఎప్పుడో పారి పోయి ఉంటాడు పెరట్లోంచి.

పద్మనాభం కళ్ళు హాలంతా పరికించాయి ఒక్కసారి.

వాడు... వాడు... అక్కడే ఉన్నాడు పారిపోలేదు. పద్మనాభం కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి... అతని కళ్ళు తెరుచుకున్నాయి... అతని కళ్ళలోని ఎరుపు తగ్గింది. పళ్ళు పొడిరాలడం ఆగిపోయింది. మనసారా ఊపిరి పీల్చుకుని ఆనందంగా నవ్వాడు.


హాల్లో 'వాణ్ణి' చూసి భర్త ఏం రంకెలు వేస్తాడోనని భయపడ్తోంది వసంత.

హాల్లో ఒక ప్రక్క చిందరవందరగా పాత బట్టలు మరోప్రక్క రకరకాల స్టీలు సామాన్లతో నిండిన గంప ముందు బెదురు చూపులతో స్టీలు సామన్లవాడు!

పాత బట్టలిచ్చి స్టీలు సామాన్లు తీసుకోవడం పద్మనాభానికి ఇష్టం ఉండదు. ఆ బట్టలు ఏ పేదవాళ్ళకో యిస్తే ఆనందంగా తొడుక్కుంటారు కదా! అంటాడతను. కానీ వసంత ఎంచక్కా స్టీలుసామాన్లకు మార్చుకుంటుంటుంది. అందుకే భర్త లేనప్పుడు రమ్మంది ఆ స్టీలు సామాన్ల వాడిని.

"ఊ! ఏం గిన్నెలు తీసుకున్నావు? ఈ చొక్కా పాంటు కూడా విప్పిచ్చేయనా?"

నవ్వుతూ మురిపెంగా అడుగుతున్న భర్తను చూసి ఆశ్చంర్యంతో నోరు తెరుచుకుని ఉండిపోయింది స్టీలు వసంత.



మంచి మిత్రుడు శేఖర్

- బాలి



మిత్రుడు 'శేఖర్' గురించి చెప్పాలంటే నా ఆలోచనలు, విజయవాడ కృష్ణలంక వైపు సారించాలి.

అప్పట్లో అతను కృష్ణలంకలో ఓ ఇంట్లో చివరి పోర్షన్ లో ఉండేవాడు. ఆ వీధి పేరు ఏమిటో ఇప్పుడు నాకు గుర్తులేదు. ఆ ఇంటికి అతనితోనూ, విడిగానూ చాలా సార్లు వెళ్ళాను. మా ఇంటికి తానూ శెలవు రోజుల్లో వచ్చేవాడు. నా బొమ్మల్లోని స్ట్రోక్, వేగమూ పట్టాలని, అతనికి చాలా 'ఇదిగా' ఉండేది. అతను చూస్తూండగా ఎన్నోసార్లు పెన్సిల్‌తో వేయడం మొదలుపెట్టి ఇంకింగ్, కలరింగ్‌లు చేస్తూ బొమ్మను పూర్తి చేసేవాడిని. ఆ తరువాత రోజుల్లో అతని బొమ్మలు నేను గమనించినదేమంటే కొన్ని రేఖలూ, స్టయిల్లో నాకు దగ్గరగా వచ్చాడు. గానీ ఆ ఫ్రీనెస్ కనపడలేదు. ఎక్కడున్నా నన్ను చూడగానే ఆవేశం తన్నుకొచ్చేది కాబోలు. "ఇక ప్రాక్టీస్ చేస్తానండీ నిరంతరం" - అనేవాడు.

అతను పనిచేస్తున్న 'ప్రజాశక్తి' ఆఫీస్ గవర్నర్ పేటలో ఉంటే ఒకమారు వెళ్ళాను. తన టేబుల్ తెరచి తాను చేసిన కొన్ని కవర్ డిజైన్‌లూ, వాల్ పోస్టర్‌లూ చూపించాడు. అవన్నీ ఎర్రరంగుల సజెషన్‌లలో, పిడికిళ్ళతో కొడవళ్ళూ, సుత్తుల బొమ్మలతో నిండి ఉన్నాయి. ఇవే నేను గీయవలసి ఉంటుంది అన్నాడు.

"మంచిది - కళలకు హద్దులు గీస్తే ఇలాగే ఉంటాయి" - అన్నాను.

ఇప్పుడు అతనికి గుర్తుందో లేదో గాని అప్పట్లో నేనో మాట అన్నాను.



"నీకు మనసులో కమ్యూనిజం భావజాలం ఉండొచ్చు... కానీ ఆర్టిస్ట్‌కు విస్తృతమైన ఆలోచనలూ, అభ్యాసమూ ఉంటే గాని ఎదగలేం - నీకేమైనా కమర్షియల్ మ్యాగజైన్‌లలో అవకాశం వస్తే వెళ్ళిపో"! అన్నాను.

కొన్నాళ్ళ తరువాత అదే జరిగింది. ఆంధ్రప్రభ దినపత్రికలో అవకాశం వచ్చింది. హైదరాబాద్ వెళ్ళిపోయాడు. తిరిగి మధ్యలో మరోమారు వచ్చి నన్ను కలిశాడు సరదాగా!

నా మీద చాలా చిత్రమైన అభిమానం ఉంది అతనిలో. ఆ అభిమానం ఎంత వరకు వెళ్ళిందంటే "దినపత్రికల్లో పని చేసే పొలిటికల్ కార్టూనిస్ట్‌కే ఈ సభకు ఆహ్వానితులు" అని ఒకమారు ఏదో మీటింగ్ హైదరాబాద్‌లో పెడితే (అసలు పొలిటికల్ కార్టూనిస్ట్‌లు ఎంతమంది ఉండి ఏడిశారు గనక) ఆ సభా నిర్వాహకులతో పోట్లాడి నాకు రానూ పోనూ ఖర్చులు ఇచ్చేట్టు చేసి ఆ సభకు నన్ను పిలిపించాడు.

మరికొన్నాళ్ళకు నేనూ హైదరాబాద్ చేరుకోవలసి వచ్చింది.

మరలా మా మధ్య రాకపోకలు మొదలయ్యాయి. ఇక వీలయినప్పుడల్లా ఇంటికొచ్చి ఆత్మీయంగా పలకరించి నాతో భోజనం చేసి కబుర్లు చెప్పేవాడు. ఆ కబుర్లన్నీ నా బొమ్మలూ, తన బొమ్మల మధ్య తిరిగేవి.

తాను వ్యాసాలు రాయడం వంటి రచనలు చేస్తాడు కాబట్టి ఆ రోజుల్లో 'నది' అనే మాస పత్రికలో తనకు పరిచయం ఏర్పడి దానిలో నాపై ఆర్టికల్ రాస్తానని ఒకమారు వచ్చాడు. మొదట్నుంచీ నా డెవలప్‌మెంట్స్, నా స్టయిల్ పరిశీలిస్తున్నాడు కాబట్టి తమాషాగా నా శైలిలో ఉన్న విభిన్నమైన కేరక్టర్లను తీసుకుని వాటికి ప్రాణం వచ్చి మాట్లాడుతున్నట్లు, వాటి విషయాలు అవే చెబుతున్నట్టు ఓ ఆర్టికల్ తయారుచేసి బోల్డు బొమ్మలతో కలర్‌లో ప్రకటించాడు.

ఆ రోజుల్లోనే నా కార్టూన్ పుస్తకం ఒకటి పబ్లిష్ కాబోతోంది. శేఖర్‌ని సంప్రదించి ఈ ఆర్టికల్‌ని ఆ పుస్తకంలో ముందుమాటగా వేశాను. మంచి రెస్పాన్స్ వచ్చింది.

నా కార్టూన్‌ల సంకలనం వస్తోందంటే పేజ్ మేకింగ్, కవర్ డిజైన్ కంపోజింగ్ మొత్తం శేఖర్‌కే అప్పగించేవాడ్ని. ఆయనలో చక్కని ఆర్టిస్ట్ ఉన్నాడు. అనుకున్న టైముకి చక్కగా చేసి ప్రింట్‌కు అనుకూలమైన ఓపెన్ సి.డి. చేసి నా చేతిలో పెట్టేవాడు.

కార్టూనిస్ట్‌గా అమెరికా వెళుతున్నప్పుడు టిక్కెట్ గురించి, లగేజి, ఎయిర్‌పోర్ట్‌ల వంటి జనరల్ విషయాలు తెలుసుకోవడానికి వారి అబ్బాయితో మా ఇంటికి హైదరాబాద్‌లో వచ్చాడు. మళ్ళీ సరదాగా కబుర్లు మొదలు.

ఇలా ఎన్నెన్నో అనుభవాలు మిత్రుడు శేఖర్‌తో-

మంచి మిత్రుడు-మంచి ఆలోచనలతో నలుగురికీ సహాయం చేసే వ్యక్తికి సంపూర్ణమైన ఆరోగ్యం ఇమ్మనమని భగవంతుణ్ణి వేడుకొంటున్నాను.

గంగాధర్ వడ్లమన్నాటి

ఫన్ పంచ్!



మొగుడ్స్... పెళ్లామ్స్... మధ్యలో నవ్వుల్స్!

కాలక్షేపం కావలెను

ఆఫీస్ నుండి అప్పుడే వచ్చిన మధు, లలితతో–

"ఇదిగో లల్లీ! మా అమ్మ, నాన్నలకి ఫోన్ చేసి రమ్మన్నాను. వాళ్ళు ఏనుగు అంబారి ఎక్కినంత సంబరపడ్డారు. కోడలికి మేమంటే ఎంత ప్రేమ, అదీ... ఇదీ... బెల్లం బూంది... అని సంతోషంతో ఊగిపోయి, మాపటేల బండెక్కి రేపటికల్లా వస్తానన్నారు. అయినా అత్తమామలంటే మెత్తని సుత్తులు, పదునైన బాకులు అనేదానివి. కాని ఇప్పుడేంటి ఇలా హఠాత్తుగా ఇంత ప్రేమ!" అడిగాడు మధు అయోమయంగా దేభ్యపు మొహంతో.

"అయ్యో!... ఏంటండీ అలా అడిగారు. ఇప్పుడు నేను నిజం చెప్పే తీరాలి. అసలే ఇవాళ గురువారం... నాకు సెంటిమెంటు" చెప్పిందామె చేతులు ఇబ్బందిగా నలుపు కుంటూ.

"అంటే ఏమిటే నీ మాటలకి అర్థం? మిగతా వారాలన్నీ అబద్ధాలు చెప్పి తగలడు తున్నావన్న మాట." అని కోపంగా చూసి

"సర్లే ఆ నిజం ఎంటో చెప్పి తగలడు."

"తగలడతాను. కానీ మీరేం అనకూడదు మరి." అని రెండు అడుగులు వెనక్కి గెంతి...

"మరేమో... మరేమో...మీరేమో పొద్దున్న పోయి సాయంత్రం వస్తారు. పైగా పక్క వాటా వాళ్ళు ఊరెళ్ళి వారం అయింది. అందుకే రోజూ బోరు" చెప్పింది మూతిని పంది పిల్ల మూతిలా పెట్టి మరీ గారంపోతూ.

"ఏడ్చినట్టుంది. పక్క వాటా వాళ్ళు ఉన్నా, నువ్వు వాళ్ళతో పెద్దగా మాట్లాడేదానివి కాదుగా."

"అయితే మాత్రం ఏం?... పొద్దున్నా, సాయంత్రం భార్యాభర్తల గొడవలూ, మధ్యాహ్నం వేళ అత్తకోడళ్ళ దెప్పిపొడుపులు వింటూ పని చేసుకుంటూ ఉంటే అసలు సమయం తెలిసేది కాదు. పోనీ అది వదిలేయండి. టి.వి. చూద్దామంటే నా ఫేవరెట్ సీరియల్స్ తుప్పు రేకులు, అత్తాకోడళ్ళు లాంటివి అన్నీ అయిపోయాయి. పైగా ఛానెళ్ళన్నీ వేసిన సిని మాలే వేస్తున్నాయి. అందుకే అత్తయ్యా, మామయ్యా వస్తే..." అని ఆమె ఇంకేదో చెప్పేంతలో–

"పోనీలే... నీకు కాలక్షేపం కోసమైనా అత్త మామలు గుర్తొచ్చారు. వాళ్ళతో గడపాలనీ నిర్ణయించుకున్నావ్... సంతోషం!" చెప్పాడు మధు.


"మీకలా అర్థం అయిందా? నేను వారిని రమ్మనడానికి కారణం మీరనుకుంటోంది కాదు సుమి."

"మరి!...."

"మరేమో అత్తయ్యా, మామయ్యా ఎప్పుడూ ఏదో విషయమై గండుపిల్లుల్లా పోట్లాడు కుంటూ ఉంటారు. దాంతో పక్కింటి కీచు లాటలు, పగలు రగిల్చే సీరియల్స్ లేని లోటుకి రెండింతల కాలక్షేపం అవుతుంది. అందుకే వారిని పిలిపించమంటోంది."

చెప్పిందామె శూన్యంలోకి చూస్తూ మురిసిపోతూ.

ఆమె కలహాల కాలక్షేపంపై గల ఆసక్తి విన్న మధు మాత్రం తెల్లబోయి కళ్ళప్పగించి మరీ చూస్తుండిపోయాడామె వంక.





విజయలక్ష్మిరాజు

పెళ్ళిఫోటో

సీరియల్

"మాకు అలవాటయిపోయింది మామయ్యా. అయినా అమ్మకు భక్తి ఎక్కువ. అమ్మ చాలా మంచిది మామయ్యా" అందా అమ్మాయి తల్లిమీద నిరసన మాటలు భరించలేక.

"సారీ, సారీ! మీ అమ్మ మంచిది. సరేనా..." బుజ్జగించాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక మీరాబాయి తీరుబడిగా తమ్ముడి దగ్గర కూర్చుని కబుర్లు చెప్పింది. ఆ కబుర్లన్నీ దేవుడికి సంబంధించిన కథలూ, ఆయన మహిమలు తెలియచేసే పుస్తకాల గురించి... చేయాల్సిన పూజల గురించి... చేయబోయే వ్రతాల గురించి. అలా చెబుతూ వుండగానే సుబ్బారావు నిద్రలోకి జారుకున్నాడు.

"పిచ్చిసన్నాసి, అప్పుడే నిద్రపోయాడు" అంటూ శ్రీవల్లివేపు తిరిగి "మీ పెళ్ళి వాయిదా పడిందటగా. నువ్వు ఊరెళ్ళగానే రుక్మిణీ కళ్యాణం చదివి నిష్టగా పూజ చెయ్యి. నిరాటంకంగా పెళ్ళయిపోతుంది" అంది మీరాబాయి.

"అలాగేనండి, నేనూ పడుకుంటాను. నిద్రొస్తోంది" అంది శ్రీవల్లి.

"అలాగే పడుకుందువుగాని అమ్మాయ్. మేము ఈ వారం టూరిస్టు బస్సులో కాశీ యాత్ర వెళుతున్నాం. ఇంకా రెండుసీట్లు ఖాళీ వున్నాయని బస్సతను ఫోను చేసి మరీ చెప్పారు. నువ్వూ, సుబ్బుడూ రాకూడదూ సరదాగానూ వుంటుంది. పుణ్యమూ దక్కుతుంది" అంది మీరాబాయి.

"కాశీనా?... మీ తమ్ముడుగారు ఒప్పుకోరేమో" అంది శ్రీవల్లి.

"ఒప్పుకుంటాడు చచ్చినట్టు. ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడొప్పుకుంటాడు. పెళ్ళయితే ఎలాగూ దేనికీ ఒప్పుకోడు. కాబట్టి నీకు ఏ కోరికలున్నా, అన్నీ ఇప్పుడే తీర్చేసుకో. ఈ మగాళ్ళ సంగతి నీకు తెలీదు."

"ట్రై చేస్తాను... నాకూ మీ వెంట రావాలనే వుంది."

"ట్రై చెయ్యటం కాదు. రావాలి అంతే! ఇక వెళ్ళి పడుకో... ప్రయాణానికి ఇంకా వారం రోజులు టైం వుంది కాబట్టి మీరు రేపు ఊరెళ్ళిపోయి ఇంటిదగ్గర అన్నీ చక్కబరుచుకుని వచ్చెయ్యండి. అమ్మాయ్! పడుకునేముందు ఆంజనేయస్వామి దండకం చదువుకో. భయం వుండదు" అంటున్న మీరాబాయికి గుడ్‌నైట్ చెప్పి నిద్రకుపక్రమించింది శ్రీవల్లి.


✦✦✦

"నేను కాశీ కెళుతున్నానురా హనుమంతూ! నీకు కొన్ని పనులప్పచెబుతాను. అవి నీవు స్వయంగా దగ్గరుండి చూసుకోవాలి" అన్నాడు సుబ్బారావు హనుమంతుతో.

"ఏమిట్రా సుబ్బు! ఈ దారుణం. ఇంత చిన్నవయస్సులో అంత వైరాగ్యమా? ఈ రోజు కాకపోతే రేపు ఆ ఫోటోలో నీ ప్రక్కనున్న జంట ఆచూకీ తెలియకపోతుందా? నీ పెళ్ళి కాకపోతుందా? కొత్త కొత్త ఫ్యాషన్ గుడ్డలేసుకునే నీకు కాషాయం డ్రస్సు వేసుకోవాలని మన సెలా ఒప్పిందిరా?!! అందుకేనా గెడ్డం కూడా మాసింది. ఆ చూపులేంట్రా శూన్యంలోకలా చూస్తున్నావు!!. హయ్యో దేవుడా! వున్న ఒకే ఒక ఏకైక మిత్రస్నేహితుడిని కూడా దూర తీరాలకు పంపిస్తున్నావా? ఇంక నా గోడెవరికి చెప్పుకోను" అన్నాడు గుండెలు బాదుకుంటూ హనుమంతు.

"ఛ! నోర్ముయ్. నేను వెళుతున్నది కాశీకి సన్యాసిగా మారి కాదు. ఎంజాయ్ చెయ్యటానికి" అన్నాడు సుబ్బారావు.

"అలాగా! ఉదయమే మీ నాన్నగారు చెప్పారులే" అన్నాడు నింపాదిగా హనుమంతు.



జరిగిన కథ: చిన్నప్పుడు సుబ్బారావుతో ఒకజంట ఫోటో చూస్తుంది శ్రీవల్లి. వాళ్ళెవరో ఇంట్లో వాళ్ళకెవరికీ తెలియదంటారు. ఎవరికీ తెలియని ఆ ఫోటోలోని వ్యక్తుల గురించి తెలుసుకోవడానికి సుబ్బారావు బంధువులందరినీ కలవాలనుకుంటుంది శ్రీవల్లి. సుబ్బారావు స్నేహితుడు హనుమంతు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుని నానా పాట్లు పడుతుంటాడు. **-ఇక చదవండి**



“ఇడియట్... రాస్కెల్! మరి ఆ పెడబొబ్బలెందుకు పెట్టావ్?”

“ఎంజాయ్ చెయ్యటానికని తీసికెళ్లి శ్రీవల్లి నీ చేత కాషాయం డ్రస్సు వేయిస్తుందేమో? అలా వేయిస్తే ఇక నీవు నాకు దక్కవేమో?... దక్కకుంటే ఎలా బాధపడాలో రిహార్సల్ చేశానంతే” అన్నాడు తేలిగ్గా.

సుబ్బారావు బదులివ్వకుండా మౌనంగా వుండిపోయాడు.

“అవునొరే సుబ్బూ! ఆ అమ్మాయి ఏం చెబితే అది చేసెయ్యటమేనా?”

“హయ్యో! నెత్తీ నోరూ బాదుకున్నాను... వింటేగా? ఎవరైనా పెళ్ళయి పిల్లల్ని కని బాధ్యతలు తీరాక కాశీ కెళతారు. ప్రేమించుకున్న వాళ్ళు ఏ ఊటీకో,కొడైకెనాల్‌కో వెళతారు. కానీ కాశీకి కాదు, వద్దు అన్నాను... వినదు. మా అక్కయ్య ఒక చాదస్తం మనిషి. ఈవిడకు తోడయి రెచ్చగొట్టింది. అందరిలా ఎప్పుడో కాశీకి వెళ్ళటం కాదు. కాశీ కెళ్ళొచ్చాక కాపురం మొదలుపెడితే దివ్యంగా వుంటుందంటూ వాదన. ఏమీ చెయ్యలేకపోతున్నాను. అందుకే వెళుతున్నాను.. నా సంగతి సరే, నీ ప్రేమ సంగతి ఎక్కడిదాకా వచ్చింది” అన్నాడు సుబ్బారావు.

“పది అడుగులు ముందుకెళ్ళి ఇరవై అడుగులు వెనుకబడినట్టు, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు... చావు దప్పి కన్ను లొట్టపోయినట్టు వుంది” అన్నాడు హనుమంతు.

“ఏమిటోరా హనుమంతూ, నిన్ను చూస్తే భయమేస్తోంది... ఒక్క ఉదాహరణ చెబితే చాలదా? ఇన్నేసి ఉదాహరణలూ... చాదస్తం! మంచి సైకియాట్రిస్టుకు చూపించుకోలేకపోయావా?... అస్తమానం ఆ దేవేంద్ర, ఆర్తి అంటూ వాళ్ళ చుట్టూ తిరుగుతున్నావు!! అదేంట్రా నీ వేళ్ళ ఉంగరాలు, మెడలో గొలుసు ఏమయ్యాయి?” అడిగాడు సుబ్బారావు.

“గొలుసు ఉంగరాలు అమ్మేశాను. దేవేంద్ర, ఆర్తిల ఫీజుకొరకు... నేను చాలా అప్పులో కూరుకుపోయానురా. ఆఫీసులో ఇస్తున్న లోన్లన్నీ తీసుకుని ముసలాళ్ళ మొహానికే కొట్టాను. ఫీజులు గుంజటం తప్ప వారిచ్చిన ఒక్క సలహా కూడా వర్కవుట్ కావటంలేదు” దిగులుగాఅన్నాడు హనుమంతు.

“చదువుకున్నావు. ఉద్యోగం చేస్తున్నావు. బుద్ధి జ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నావు... దేవేంద్ర, ఆర్తిగార్లట. ఇక్కడ ప్రేమించటం నేర్పబడును బోర్డుట!.. చచ్చు సలహాలట...! అది నువ్వు పాటించటంట!... ప్రేమించటమేమిటి ఇంకొకరు నేర్పడమేమిటి?... ఛీ! ఛీ!!... ఛీత్కరించుకున్నాడు సుబ్బారావు.

“ఆల్‌రెడీ నువ్వు ప్రేమలో పడ్డావు కాబట్టి నీకన్నీ అన్‌నేచురల్‌గా వుంటాయి లెద్దూ. నా అవస్త లేవో నేను పడతాను కానీ కాశీకెప్పుడు వెళుతున్నావు? ఏం పనులు చెయ్యాలో చెప్పు” అన్నాడు హనుమంతు త్వరగా వదిలెయ్యి అన్న ధోరణిలో.

✦✦✦

“హాయ్ మంత్! వచ్చావా రా, రా! ఇంతకు ముందే నీ గురించి మాట్లాడుకున్నామయ్యా. డార్లింగ్! త్వరగా వచ్చెయ్యి... ఐస్‌క్రీం పార్లర్ కెళదామన్నావుగా... త్వరగా రెడీ అవు...

తీసుకెళతాను" అంటూ హనుమంతును పరామర్శిస్తూనే... లోపలికి చూస్తూ కేకేశాడు దేవేంద్ర.

"మీరెక్కడికో వెళుతున్నారు. వెళ్ళిరండి. సాయంత్రం తిరిగ్గా వస్తాను" అంటూ లేవబోయాడు.

"అయ్యయ్యో! లేవకు కూర్చో... నువ్వెళ్ళిపోతే మేము వెళ్ళలేం... నీ రాకతో మా పోక ముడిపడివుంది. అరె! ప్రాస ఎంత చక్కగా కుదిరిందో చూశావా? నీ రాక మా పోక..." చప్పట్లు కొట్టి గట్టిగా నవ్వేశాడు దేవేంద్ర.

లోపలినించి ఆర్తి ముస్తాబయి వచ్చింది–

"హాయ్ మంత్!" అంటూ పలకరించి కుర్చీలో కూర్చుంది.

"ఏమిటి డార్లింగ్! కవితగానీ అల్లావా? నీ రాక మా పోక అంటున్నావు... మంత్, నీకు తెలిసిన మేగజైన్ వుంటే చెప్పవా? ఈ మధ్య అదీ నువ్వు పరిచమయ్యాక నీ మీద చాలా కవితలు మాలోంచి నీటి ఊటలా పుట్టుకొస్తున్నాయి. సృజనాత్మకశక్తి ఎక్కువయింది. కళనెప్పుడూ తొక్కిపెట్ట కూడదు. నలుగురిలోకి పంపిణీ చెయ్యాలి. అప్పుడే జీవితానికి సార్థకత" అంది ఆర్తి కిలకిలా నవ్వుతూ.

"అబ్బ! నువ్వుండు ఆర్తీ! టైం వేస్ట్ చెయ్యకు. ఐస్‌క్రీం పార్లర్‌కు తీసుకెళ్ళలేదని ఇంతసేపు గొడవ చేసి అలిగి వెళ్ళావు... ఇప్పుడో అవకాశం వస్తే టైం వేస్ట్ చేస్తున్నావు" గోముగా బుంగమూతి పెట్టి అన్నాడు దేవేంద్ర.

"ఓc!... ఐయామ్ రియల్లీ వెరీ సారీ డార్లింగ్! యూ ప్రొసీడ్... ఇప్పుడు చెప్పవయ్యా మంత్ ఏమిటి? నీ ప్రోగ్రెస్ ఎంతదాకా వచ్చింది. మా సలహాలు బాగా పనిచేస్తున్నాయా?"

అంత వరకు కోపాన్ని అణచుకుంటూ వారి లీలా వినోదం చూడటం ఇష్టంలేక అక్కడున్న న్యూస్‌పేపరు మొహానికడ్డం పెట్టుకున్నాడు చదువుతున్న నెపంతో.

దేవేంద్ర పలకరింపుతో "మీ సలహాలు పాటించటం వల్ల నాకేం మేలు జరగలేదు. నా పాట్లేవో నేను పడుతున్నాను. దీర్ఘాలొద్దు. విషయంలోకొస్తాను. నన్నొక అమ్మాయి ప్రేమిస్తోంది" అన్నాడు హనుమంతు. **(సశేషం)**



శేఖర్ గారి 'లోకంతీరు'



ఆంధ్రజ్యోతి డైలీ పేపర్‌లో నేను మొదట హెడ్‌లైన్స్ వైపు దృష్టి సారించ కుండానే రెండోపేజీ తిప్పేసి 'లోకం తీరు' చూస్తా! అందులో శేఖర్‌గారు వేసే రాజకీయ కార్టూన్ 'లోకంతీరు' కు అద్భుతంగా అద్దం పడుతుంది

ఆ కార్టూన్ చూస్తుంటే నాకు హాయిగా నవ్వురాదు. కసిగా నవ్వొస్తుంది. నిజమే నేటి రాజకీయ (కొందరు) నాయకుల్ని తలుచుకుంటేనే కంపరం కలుగుతుంది. ఐదేళ్ళకొకసారి తమ హామీలతో (వెర్రి) ప్రజల్ని మోసగిస్తూ– ఆ ప్రజల చేతిలోనే గెలిచి, ఆ ప్రజల్నే తమ కాళ్ళ కింద తొక్కి పట్టి పదవుల కోసం ప్రాకులాడుతూ కుర్చీ కోసం కొట్టుకుంటూ తిట్టుకుంటూ కాలుష్యం నిండిన కర్కశ హృదయంతో ప్రజల రక్తం పీలుస్తూ–ఖుషీగా కడుపు నిండిన కండఖావరంతో అవినీతి సొమ్ము స్విస్ బ్యాంకుల్లో దాచుకుని పైకి అమాయకుల్లా నటిస్తూ... ఏసీ గదుల్లో గదుల్లో గడిపే కుహన రాజకీయ నాయకుల మీద శేఖర్‌గారు వేసే రాజకీయ కార్టూన్లు–గుండెలు చీల్చే గుణపాలు. ఛెళ్లున తగిలే చెంప దెబ్బలు. ధైర్యంగా దిక్కులు మారు మ్రోగేలా ప్రశ్నించే వాడి బాణాలు.

గుండు సూదుల్లా గుచ్చుకునే ఇలాంటి రాజకీయ కార్టూన్లు చూసిన నాయకులు మారతారనే ఆశ లేకపోయినా...రవ్వంతా సిగ్గు పడినా చాలు... శేఖర్‌గారి శ్రమ ఫలించినట్టే.

శేఖర్‌గారి కలంనుండి ఇలాంటి మరెన్నో కొరడాదెబ్బల రాజకీయ కార్టూన్లు రావాలని కోరుకుంటూ అభినందనలతో... **–కుమారి రాగతిపండరి,కార్టూనిస్ట్ విశాఖపట్టణం**

నిబద్ధత కలిగిన కార్టూనిస్ట్... శేఖర్!



శ్రీ శేఖర్‌గారు...ఎంత మంచి కార్టూనిస్టో... అంత మంచి మనిషి కూడా! ఆయన ఎటువంటి భేషజంలేని స్నేహశీలి... మృదు స్వభావి...సహృదయుడు.

పొలిటికల్ కార్టూన్‌రంగంలో తనదైన ప్రత్యేక శైలీ గీతలతో... తనదైన ప్రత్యేక ముద్ర వేశారు.

తన కార్టూన్లు నవ్వించడం కంటే ఆలోచింప చేస్తే చాలానుకుంటారాయన.

కానీ ఆయన కార్టూన్లన్నీ నవ్విస్తూనే ఎంతో లోతుగా ఆలోచింపజేస్తాయి.

ఆయన వేసిన 'హూ యామ్ ఐ' కార్టూనంటే నాకు భలే ఇష్టం.

ఈ నెల హాస్యానందంను శేఖర్ ప్రత్యేక సంచికగా తీసుకు వస్తున్న శ్రీరాముగారికి అభినందనలు. **–గోపాలకృష్ణ, కార్టూనిస్ట్ హైదరాబాద్**



స్వంత ఐడియాలజీ ఉన్న మేధోకార్టూనిస్టు...శేఖర్



–హరి,
విశాఖపట్నం

నేను శేఖర్ కార్టూన్లను ఎలా ఇష్టపడ్డాను...? ఆలోచించగా సినిమాలలో చూపించినట్లుగా మామూలుగానే గతం రింగులు రింగులుగా తిరిగింది.

1992 నూతన ఆర్థికవిధానాలు ఇంకా ప్రారంభం కాకముందు... ప్రపంచం కొంత ప్రశాంతంగా ఉంటోన్న కాలంలో... మన జీవితాలు ఇంత అల్లకల్లోలంగా లేని సమయంలో... సాహిత్యం... ఉద్యమాలు... బొమ్మలు అనే ఆసక్తి మొలకలేస్తున్న కాలంలో ఇద్దరే ఆర్టిస్టులు నాకు తెలుసు ఒకరు విశాఖపట్నం ఆర్టిస్టు పావెల్! మరొకరు శేఖర్!

మా కుటుంబం వామపక్ష భావాలు ఉన్న కుటుంబం కావటం వల్ల నేను కూడా విద్యార్థి ఉద్యమంలో అడపాదడపా పాల్గొంటుండే వాడిని... మా జిల్లా మార్క్సిస్ట్ పార్టీ కార్యాలయంలో 'పావెల్' అనే ఆర్టిస్టు వేసిన రష్యన్ పెయింటింగ్‌లు... ప్రజాశక్తిలో పుంఖానుపుంఖాలుగా నలుపు తెలుపుల్లో వచ్చే శేఖర్ కార్టూన్లు నన్ను చాలా ఆకర్షించేవి. ఓ సారి శేఖర్ కార్టూన్ల గురించి చిన్న కంప్లయింట్ ఆయనకే రాస్తే... ఆయన వివరంగా చక్కగా రిప్లయ్ ఉత్తరం రాసారు. దాదాపు ఇరవైఏళ్ల క్రితం మాట... అప్పటి నుంచి శేఖర్ నాకు అత్యంత ఆప్తుడయిన కార్టూనిస్టు.

శేఖర్‌తో సావాసం

అప్పటికి ఉదయం పేపర్ అస్తమించింది కాబట్టి అందులో కార్టూన్లు గురించి నాకు తెలియదు. ఈనాడు శ్రీధర్, ప్రజాశక్తి శేఖర్ కార్టూన్లు రోజూ పోటాపోటీగా చూసేవాడిని. ఆ బొమ్మల శైలి, హ్యూమర్ అనుకరించ బుద్ధయింది. అలా నాకు తెలియకుండానే కొంత శేఖర్ లైన్‌ని నేను అలవరచు కున్నానేమో. 2001 తరువాత యానిమేషన్ రంగంలోకి వెళ్లాక కలగాపులగమైన గందరగోళమైన లైన్‌లు అబ్బినా..అప్పుడపుడు నేను వేసే కార్టూన్లలో శేఖర్ కార్టూన్ ఆనవాలు స్పష్టంగా గోచరిస్తుంటాయి. నేను కూడా కమెండో, ఆంధ్రప్రభ ఆదివారం, లీడర్, మీడియా ఇండియా న్యూస్ ఏజన్సీలలో పొలిటికల్ కార్టూనిస్టుగా పనిచేసాను. నా పొలిటికల్ కార్టూన్లపై శేఖర్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. రెగ్యులర్ సోషల్ కార్టూన్లలా నా కార్టూన్లు లేకుండా ఉన్నాయంటే శేఖర్‌తో ఉన్న సావాసం... అధ్యయనం అని చెప్పవచ్చు.

వామపక్షభావజాలం ఉండటం వల్ల శేఖర్ నచ్చారో... ఆయన కార్టూన్లు నచ్చాయా... ఆయన ఆప్యాయత నచ్చిందా అంటే అన్నీను.

అన్నింటికీ మించి ఇతరులు సాధించిన చిన్న చిన్న విజయాలకు సైతం మనస్ఫూర్తిగా అభినందించడం శేఖర్ మంచిమనసుకు నిదర్శనం.

కార్టూన్ డాక్టర్

కార్టూన్లమీద థీసిస్ అంటారే అట్లాంటిది చేసి డాక్టరేట్‌కి అప్లయ్ చేయకుండా వదిలేసారేమో అని శేఖర్ మీద అనుమానం. తెలుగు సోషల్ కార్టూన్‌మీద, పొలిటికల్ కార్టూన్‌ల మీద, ఉత్తరాది కార్టూన్లమీదా స్పష్టమయిన అవగాహన ఉంది ఆయనకు. అందుకే చాలా వినూత్నమైన ఐడియాలు ఆయన సొంతం. తనకంటూ భిన్నమైన ఒక ఐడియాలజీని ఏర్పరచుకుని తను పనిచేసిన పత్రికల పాలసీకి అనుబంధంగా తన భావాలను కూడా చాలా చక్కగా కార్టూన్లలో ప్రెజెంట్‌చేస్తుంటారు. ఇది కత్తిమీద సామే. కాని ప్రతిరోజూ ఇందుకోసం ఎంతో శ్రమపడి జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను ప్రభుత్వాల విధానాలను ఆ విధానాల వెనుకున్న అసలు ఉద్దేశ్యాన్ని తన కార్టూన్లలో అందరికీ అర్థమయేలా సున్నితమైన హాస్యంతో అందించే కార్టూన్ డాక్టర్ శేఖర్.

మేధోశ్రామిక జీవి


ప్రజల కోసం పాఠకుల మెదడుకు విజ్ఞానాన్ని అందించే కార్టూన్లు వేసేవారు అరుదు. తన శ్రమే పెట్టుబడిగా పుస్తకాలు ప్రచురించి... వేలాది కార్టూన్లు వేసి, గుర్తింపు పొందడం అనేది సాదాసీదా విషయం కాదు. ఒక మామూలు పల్లె నుంచి ఇంత గుర్తింపు తెచ్చుకున్నది కార్టూన్ మూలంగానే.

శేఖర్‌పై కంప్లయింట్స్

కార్టూన్లు సీరియస్‌గా వేసినా... తన బొమ్మల గురించి తనే బాధపడిపోవడం నాకు నచ్చని విషయం. నిజానికి ఆయనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి ఉంది. విభిన్నమైన ప్రయోగాలు శైలీ పరంగా చేసినా ఒకే శైలిని ఎక్కువ కాలం కొనసాగించకపోవడం శేఖర్ లోపం. జానపదశైలిలో వేసిన ఆయన కార్టూన్లు మరిన్ని ఎక్కువగా వేస్తే బాగుండేది. ఇదీ నా లైన్. ఇది గొప్పలైన్ అని. మరికొంత కాన్ఫిడెంట్‌గా ఎనౌన్స్‌చేస్తే...బావుండేదేమో! అసలు ఎవరో కొందరు లైన్‌ని నిర్దేశించమేమిటి? పాఠకులు ఫైన్ అన్నదే గుడ్‌లైన్. అలాగే మారుతోన్న సామాజిక అంశాలపై చక్కటి సోషల్ కార్టూన్లు వేయగలిగి ఉంటే సోషల్ కార్టూనిస్టులకు మరికొంత 'టెంప్లేట్' మార్చుకొనే అవకాశం కల్పించినవారయి ఉండేవారు. ఇంకా శేఖర్ అందరివాడు ఆయన తనను తాను ఒక ప్రాంతానికే పరిమితం చేసుకోవడం ఆయన పరిధిని పరిమితం చేసుకోవడమే. తన జీవిక కోసం చేసినా తెలుగు కార్టూనింగ్‌కి శేఖర్ చేసిన సేవ, కృషి వెలకట్టలేనివి. సోషల్ కార్టూన్ ఎలా ఉండకూడదో చెప్పడంతో బాటు ఇలా ఉంటే బావుంటుంది...అని శేఖర్ ఒక సోదాహరణ వ్యాసం రాస్తే చదవాలనుంది.

తెలుగు కార్టూనిస్టులలో శేఖర్ స్థానం చాలా విశిష్టమయినది...మేధోకార్టూనిస్టుగా ఆయనకు చక్కని గుర్తింపు వచ్చింది. ఆయన తన పాతికేళ్ల కెరీర్‌ను సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేసినట్టే...అందుకు శేఖర్‌కు హార్దిక అభినందనలు.. శేఖర్‌పై ప్రత్యేక సంచికవేసి... పొలిటికల్ కార్టూనిస్టులకు సైతం ప్రాచుర్యం కల్పించిన హాస్యానందం రామూగారికి నమోనమః

84668 20560



ప్రతిభ ప్లస్ ప్రగతిశీల భావాలు.. శేఖర్!

శేఖర్, శ్యాంమోహన్ కలిసి 2000 సంవత్సరంలో బెంగుళూరు వెళ్లి అక్కడ కర్ణాటక కార్టూనిస్టుల సంఘం కార్యకలాపాలు గమనించి ఆ తరహాలో హైదరాబాద్‌లో కూడా ఒక కార్టూన్ ఎగ్జిబిషన్ జరపాలని ఐఏఎస్ అధికారి రమణాచారిగారిని సంప్రదించడానికి వచ్చారు. అప్పుడు చూశాను శేఖర్‌ని మొదటిసారిగా. ఆ ఎగ్జిబిషన్ని సమైక్య భారతి, ప్రెస్ అకాడమి సహకారంతో విజయవంతం చేశాం. అప్పుడే కార్టూనిస్టు మోహన్, శంకర్, సుభాని కూడా వచ్చి చేరారు.



2004లో శేఖర్ తన తొలి కార్టూన్ సంపుటి 'పారాహుషార్' వేసినప్పుడు సమైక్య భారతి అన్ని విధాలుగా తోడ్పడి రవీంద్ర భారతిలో దాని ఆవిష్కరణ జరిపింది. ఆ తరువాత కొంతకాలానికి తెలిసింది ఆయనా నేను ఒకే ప్రాంతం వారిమని... ఒకే ఊరి వారిమని. కేవలం వృత్తిపరమైన సంబంధాలే తప్ప ఇతర సంబంధాలు ఆయన చూడరని అప్పుడు అర్థమైంది నాకు.

ఆ తరువాత ఫోరం, సమైక్యభారతి కలిసి ఎన్నో కార్యక్రమాలు జరిపింది. అన్నిట్లోనూ శేఖర్ సహకారం అద్భుతంగా ఉండేది. ఆయన పని విధానాన్ని రమణాచారిగారు ఎన్నోసార్లు మెచ్చుకున్న సందర్భాలున్నాయి.

కార్టూనిస్టుగా శేఖర్ అమెరికా వెళ్తున్నప్పుడు మేం చాలా సంతోషించాం. ఎంతోమంది సీనియర్లు ఉన్నా వారికి రాని అవకాశం శేఖర్‌కు రావడం ఆశ్చర్యం అన్పించింది.

ఎంతో ప్రతిభ ఉంటేకాని ఇలాంటివి సాధ్యం కావని శేఖర్ కార్టూన్ జీవితం నిరూపిస్తుంది.

అలాంటి శేఖర్ రాజకీయ కార్టూన్‌రంగంలో పాతికేళ్ళు పూర్తిచేసుకొని రజతోత్సవం జరుపుకుంటున్నందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

-'సమైక్యభారతి' సత్యనారాయణ, హైదరాబాద్

శేఖ(త)ర్ (నాక్)కార్టూన్లు

“స్కాము డబ్బులంతా కోర్టు ఖర్చులకే సరిపోయింది. ఇంక నన్నొదిలేయండి సార్” జడ్జితో పొలిటికల్ లీడర్.....

“ఆకస్మిక తనిఖీకి విచ్చేస్తున్న ముఖ్యమంత్రిగారికి స్వాగతం” ప్రభుత్వకార్యాలయంలో ఓ స్వాగతతోరణం...



“మనమూ గాంధేయవాదులమే... సోనియా గాంధేయవాదులం” -పొలిటికల్ లీడర్స్... ఇలా చెప్పుకుంటూ పోతే శేఖర్‌కార్టూన్లలో ఎన్నో చమక్కులు, చురకలూ కోకొల్లలు.

ఆలోచింపచేసేకార్టూన్లు... లాగి చాచికొట్టే కార్టూన్లు... సోషల్ ఆవేర్‌నెస్ కార్టూన్లు .. చిలిపి కార్టూన్లు... అన్నిటినీ కలగలిపి కొట్టగల నేర్పరి శేఖర్.

ముఖ్యంగా శేఖర్ పదాల గారడీ నాకెంతో ఇష్టం.

ఉదాహరణకు చూడండి పారాహుషార్ పుస్తకంలో కారికేచర్స్‌కు ఆయన పెట్టిన పేర్లు-

(అప్పటి రాజకీయ పరిస్థితులకనుగుణంగా)

తెలుగు దేశేందర్‌గౌడ్.... కులాయంసింగ్ యాదవ్... గోలథాకరే నందమూరి తారక మామారావు....డెన్‌లాడెన్.... జైలు ప్రసాద్ యాదవ్.... ప్రతిభా హారతి.... ఇలా ఇంకా ఎన్నో...

ఆయనకు జ్వరంగా ఉన్నపుడు కలిశాను.

జ్వరంలో కూడా కార్టూన్లుగీస్తున్నారే అంటే...

“నాకు కార్టూన్లు గీస్తేనే రిలీఫ్ వస్తుందబ్బా.. అందులోనే ఆనందం వుంది.” అన్నాడు.

నిరంతరం కార్టూన్లు గీయడంలో ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్పిస్తుంది.

ఈ మధ్యే ఓ యాభై కార్టూన్లు గీశాను వాటిని పుస్తకంగా తీసుకొస్తానన్నాడు.

శేఖర్‌జీ.. నవ్వుతూనే ఉండండి... నవ్విస్తూనే ఉండండి....

-లేపాక్షి

సముచిత వ్యక్తి శేఖర్

సమున్నత వ్యక్తిత్వాన్ని సముపార్జించుకున్న వ్యక్తి శేఖర్.

ఎందుకంటే, వెండి చెంచా నోటిలో పెట్టుకుని పుట్టిన వ్యక్తి కాదు. అడుగులు భారమైనా ఒడిఒడిగా ఒక పద్ధతిగా వేసుకుంటూ ఎదిగిన వ్యక్తి. అనుకున్న లక్ష్యం కోసం ఆంగ్ల జర్నలిజానికి గుడ్‌బై చెప్పడం నిజంగా సాహసమే. ఆపై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేస్తున్న కలం యోధులకు తన కుంచెను బాసటగా నిలిపాడు. వ్యంగ్యాస్త్రాన్నే పోరాటానికి పదునైన ఆయుధంగా మలుచుకున్నాడు. తనదైన ప్రతిభ కనబరచి అమెరికాలోనూ పర్యటించాడు. ఒకవైపు విషయ పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూనే మరోవైపు తన లక్ష్యం దిశగా పరుగులు ఆరంభించాడు. అలుపెరుగని పోరాట యోధుడిగా మలుచుకున్నాడు. 'ఫస్ట్ లెర్న్, దెన్ అప్లయ్' అన్న సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా ఆచరించిన వ్యక్తి శేఖర్.

వ్యంగ్యం అంతకుమించి బొమ్మలో స్పష్టత కోసం అహరహం కృషి చేస్తున్న వ్యక్తి. వివిధ భావనలతో శేఖర్ తీసుకువస్తున్న పుస్తకాలు కలకాలం నిలిచేవేనని చెప్పక తప్పదు. గుండెనిండా ఆత్మ విశ్వాసంతో శేఖర్ తీస్తున్న పరుగులను మున్ముందు చూస్తూనే ఉందాం. **- పినిశెట్టి**



శ్రీసత్యనారాయణగారి సౌజన్యంతో

క్వైట్ ఫన్!

మార్చి విజేతలు

ఈ శీర్షికలో పాల్గొన్న కార్టూనిస్ట్ అందరికీ అభినందనలు!
మన తెలుగు కార్టూనిస్ట్‌లు 'క్యాప్షన్‌లెస్ కార్టూన్ల'లో
అగ్రగామీలవ్వాలనే సదుద్దేశంతో మొదలయినదీ వేదిక!
మరిన్ని మంచి మంచి కార్టూన్లు వేయడానికి ఈ 'క్వైట్‌ఫన్'
స్ఫూర్తినివ్వాలని మా ఆకాంక్ష! -ఎడిటర్



మొదటి బహుమతి
రూ.500/-లు పొందిన
కార్టూన్

రెండవ బహుమతి రూ.300/-లు పొందిన కార్టూన్



మూడవ బహుమతి రూ.200/-లు పొందిన కార్టూన్



హాస్యానందంలో

క్యాప్షన్‌లెస్ కార్టూన్‌లకు ప్రతినెలా బహుమతులు

ప్రతీ నెలా 15వ తేదీలోగా
మీ కార్టూన్లు మాకు చేరేలా పంపించండి!

మొదటి బహుమతి- **రూ.500/-లు**
రెండవ బహుమతి- **రూ.300/-లు**
మూడవ బహుమతి- **రూ.200/-లు**

మీ కార్టూన్లు ఈ మెయిల్ కి మెయిల్ కూడా చేయవచ్చు-quitefun.hasyanandam@gmail.com

కథ

కోలపల్లి ఈశ్వర్
8008057571



అసలు రహస్యం

ఆనాటి దినపత్రికలో ఫ్రంట్ పేజీలో వెలువడిన ఆ ప్రకటన ఆనందరావుని ఆనంద పరవశుణ్ణి చేసింది.

అబ్బ ఎంత గొప్ప ప్రకటన!

అబ్బ! ఎంత గొప్ప శభవార్త !!

అబ్బ! ఎంత గొప్ప సువర్ణావకాశం !!!

ఆనంద పరవశమనస్కుడై ఆనందంలో గుండెలు బాదేసుకుంటూ అలా అనుకున్నాక, ఆసక్తి గలవారు సంప్రదించవలసిన చిరు నామా అంటూ ఆ ప్రకటనలో ఇవ్వబడిన అడ్రస్‌ను డైరీలో నోట్ చేసుకుని... పక్కింటా యన దగ్గర్నుంచి తెచ్చుకున్న పేపర్ని పక్కింటా యనకిచ్చేసి అటు పిమ్మట నీట్‌గా ముస్తాబై రూంలోంచి బయటపడ్డాడు ఆనందరావు.

✦✦✦

అదే ప్రకటన... అనంతలక్ష్మి కళ్లల్లో అనంత కోటి దీపాల్ని ఒకేసారి వెలిగించింది.

"ఓర్నాయనోయ్! ఎంత గొప్ప అవకాశం!!

ఓరి దేవుడోయ్! ఎంత గోల్డెన్ ఆపర్చ్యునిటీ!!...ఓలమ్మో! ఎంత ఇది!! ఎంత అది!!"

ఆనంద పరవశ మనస్కురాలై అలా అనుకున్నాక – చేతిలో ఉన్నది సొంత పేపరే కావటాన్న డైరీలో అడ్రస్ నోట్ చేసుకోవడం గ్రటా చెయకుండా ఆ పేపర్ని మడిచి వ్యానిటీ బ్యాగ్‌లో పెట్టుకుని ఉన్నపళంగా బయల్దేరి పోయింది ఆమె కూడా ఇంట్లోంచి.

✦✦✦

ఆనందరావూ, అనంతలక్ష్ములే కాదు... మరో యాభై, అరవైమంది దాకా అలాగే ఆనందపడి పోయారా ప్రకటన్ని చూసి.

ఆనందపడిపోవడం మాత్రమే కాదు. వాళ్లంతా కూడా పరుగులు తీశారు అటుకేసి.


అనగా ఆ ప్రకటలో ఇవ్వబడిన చిరునామా కేసి.

✦✦✦

ఇంటి ముందు తండోపతండాలుగా పోగు పడిన జనాన్ని చూసితెగ సంబరపడిపోయింది ఇందుమతి.

'ఓర్నాయనోయ్' ఎంతమంది జనం. రెస్పాన్స్ బాగానే ఉండొచ్చని అనుకుంది తప్పితే మరీ ఇంతమందిని మాత్రం ఎక్స్‌పెక్ట్ చేయలేదు తను.

'థ్యాంక్ గాడ్! ఈ దెబ్బతో దరిద్రం తేలి పోయినట్టే! అలా తెగసంబర పడిపోవడం అయ్యాక వచ్చిన జనాల్నందరినీ క్యూలో నిలబెట్టి వాళ్ళకు టోకెన్లు ఇచ్చింది ఇందుమతి.



ఇందుమతి వాళ్ళ ఇంటి ముందు ఇంత జనం ఏమిటా అని ఆసక్తిగా చూడసాగారు చుట్టుపక్కల వాళ్ళంతా.

ఉదయం పదింటికి ప్రారంభమైన క్యూలోని కదలిక రాత్రి పదకొండింటి వరకు కొనసాగింది.

అర్ధరాత్రి పన్నెండున్నరకి ఇల్లు చేరుకున్న ఇందుమతి భర్త ధర్మరాజు, ఆమె ముందున్న నోట్ల కట్టని చూసి "అమ్మబాబోయ్ ఎంత డబ్బో? ఎక్కడిదే ఇదంతా?" అనడిగాడు ఆశ్చర్యంగా.

"ఎక్కడిదో ఒకక్కడిదిలే గాని... ముందు మీరింత లేటుగా ఎందుకొచ్చారో కారణం చెప్పండి?" అని హూంకరించింది ఇందుమతి.

"కాళ్ళూ, చేతలూ కడుక్కొనొచ్చి తాపీగా చెప్తానుండు... " అనేసి బాత్‌రూమ్ కేసి సాగి పోయాడు ధర్మరాజు.

✦✦✦

అటుపై ఆ ప్రకటన వారానికొకసారి చొప్పున ప్రముఖ దినపత్రికన్నిట్లోనూ పడుతూనే వచ్చింది. తత్ఫలితంగా అనతి కాలంలోనే ఇందుమతి వాళ్ళ దరిద్రం తీరిపోయింది.

✦✦✦

ఇందుమతి కార్లోంచి దిగగానే – "నమస్తే మేడమ్!" అంటూ విష్ చేశారు అప్పటిదాకా ఆమెకోసం నిరీక్షిస్తూ ఉన్న ఓ నలుగురు వ్యక్తులు.

"ఎవరు మీరు? వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?" అడిగింది ఇందుమతి హుందాగా తల పంకిస్తూ.

'నేను 'ఉష్ట్రపక్షి' పత్రికనుండి మీ ఇంట ర్వ్యూ కోసం వచ్చాను.'

'నేను కోతి కొబ్బరికాయ పత్రిక నుండి ...'

'నేను పంగనామం పత్రి ... ' చెప్పారు వాళ్ళు నలుగురూ తమని తాము పరిచయం చేసుకుంటూ.

"అలాగా! చాలా సంతోషం ... రండీ ..." అంటూ మరింత హుందాగా లోనికి దారి తీసింది ఇందుమతి.

వివిధ పత్రికా విలేఖరులైనట్టి ఆ నలుగురూ అమెనను సరించారు.

ఏ.సి. రూమ్‌లో అందరూ ఆసీనులై చల్ల చల్లగా కూల్‌డ్రింక్స్ తాగాక... ఇంటర్వ్యూ ప్రారంభమైంది.

రకరకాల ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టుకున్నాక ఆఖరిగా ఓ విలేఖరి ఓ ప్రశ్న అడిగాడు.

"ప్రస్తుతం మీరు రచయిత్రి కాకపోయినా, రైటర్స్ వర్క్‌షాపు పెట్టి ఆంధ్రదేశంలోని ఎందరో ఔత్సాహికులను ప్రముఖ రచయిత లుగా తీర్చిదిద్దిన మీరు ఇంత సడన్‌గా మీ వర్క్‌షాపును మూసేస్తు న్నట్లుగా ప్రకటించడానికి కారణం?!"

"కొత్తవారికి చెప్పి రాయించడానికి నా దగ్గరిపుడు కొత్త కథలు లేవు గనుక..."

"ఎందుకని అలా? ఏం?... మీ బుర్రలోని కథలన్నీ అయిపోయా యా? కొత్త కథలు పుట్టట్లేదా?"

"కాదు ... చెప్పట్లేదు ..."

"చెప్పట్లేదా?... ఎవరు?!!"


"మావారు... మావారిప్పుడు పేకాట మానే శారు. వేళ పట్టున ఇంటికి వచ్చేస్తున్నారు ..."

–చెప్పి భారంగా నిట్టూర్చింది రైటర్స్ వర్క్ షాప్ అధినేత్రి శ్రీమతి ఇందుమతి ధర్మరాజు.



శేఖర్ ఓ శిఖరం

కార్టూన్ని చూడగానే వచ్చేది నవ్వే, రావా ల్సింది నవ్వే. ఆ నవ్వుతోపాటు కొద్దిగ హేళన, కొద్దిగ విమర్శ, సూక్ష్మంలో అనంత భావం, అంతర్లీన నిజం కార్టూన్ గీతల్లో సమాజ రుగ్మ తలకు రేఖాదర్పణాలుగా ప్రతిబింబిస్తాయి.



సమాజానికి మంచి జరగాలి. సహేతుకమైన ఆలో చనతో మానవత్వం ముందుకు సాగాలి అనే ఆశయం, ఆదర్శం కార్టూన్ ప్రసవం వెనక వుం టుంది. ఆ ఆశయసాధనలో కార్టూన్ ఓ అణువు మాత్రమే, లేకపోతే మన రాజకీయ నాయకులు స్వార్థ చింతనను ఎప్పుడో దూరం చేసేవాళ్ళు. అదెలా వున్నా భావస్పష్టత భాషాక్లుప్తతలతో అరవై అయిదో కళగా మన తెలుగులో కార్టూన్ అభినందనలందుకుంది.

కార్టూన్ కళ కూడు పెడుతుందా గుడ్డ కడుతుందా అనే సూటిపోటు ప్రశ్నల అంపశయ్య మీద పడుకుని మనవాళ్ల మధ్య ఓ కార్టూనిస్టుగా గుర్తింపు తెచ్చుకోడానికి ఎంతో ఆత్మస్థయిర్యం, సహన సంస్కారం, ధైర్యమూ కావాలి.


అవన్నీ వున్నవాడు... ఆ గుర్తింపు తెచ్చుకున్న వాడు శేఖర్!!

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసినా తన జీవితం కార్టూన్ కళకే అంకితం అనుకున్నాడు... అనుకున్నది సాధించాడు. సాధించింది నిలుపుకుంటు న్నాడు. కార్టూన్ కళతో అమెరికా వెళ్లొచ్చాడు. శేఖర్ ఓ శిఖరం అనిపించు కున్నాడు. దగ్గరగా వెళితే శేఖర్ వ్యక్తిత్వం సాధారణులకు అందనంత ఎత్తులో, అందుకోవాలన్న ఎత్తులో కన్పిస్తుంది. మంచి మనసు మంచికి మాటై వినిపిస్తుంది.

శేఖర్ జీవనశైలి ఎందరికో ప్రేరణ. ఆ జీవనశైలికి శేఖర్‌కు ప్రేరణ నిచ్చిన కార్టూన్‌కి కళాభివందనాలు. హాస్యానందానికి వందనాలు!

– రాంపా





కార్టూన్లే శ్వాస, కార్టూన్లే ఊపిరిగా భావించే శేఖర్



– టి.ఏడుకొండలు, ఎడిటర్, లీడర్ డైలీ

దిన పత్రికలు చూసే పాఠకులకు కచ్చితంగా గుర్తుండే రెండు, మూడు హౌస్‌హోల్డ్ పేర్లలో శేఖర్ పేరు ఒకటి.

ఆయన కుంచే గత పాతికేళ్ళుగా నిరంతరాయంగా రాజకీయ అంశాలపై కార్టూన్లు వెలువరిస్తూనే వుంది. ఆయన కార్టూన్లు అన్నీ ముందు వేసుకుంటే గత పాతికేళ్ళ రాజకీయ చరిత్ర అంతా కళ్ళ ముందు కనిపిస్తుంది.

శేఖర్ 46 వేల కార్టూన్లు వేశాడంట. వాటిలో పాతికేళ్ళుగా ఆగకుండా వస్తున్న పాకెట్ కార్టూన్లు ఒక వంతు అయితే వృత్తిగా, ప్రవృత్తిగా కార్టూన్నే ఎంచుకోవడం వలన ఆయన వేసిన కార్టూన్ల సంఖ్య ద్విగుణం, బహుళమైంది. దినపత్రికల్లో వృత్తిపరంగా వేసే కార్టూన్ల కంటే ప్రవృత్తి పరంగా, ఇతర ఆర్థిక అవసరాల కోసం మారు పేర్లతో కనీసం సంతకం చేయడం లేకుండా వేసిన కార్టూన్లు కోకొల్లలు.

ఇక సిండికేట్ ద్వారా ఇతర భాషల్లో వచ్చిన కార్టూన్లు తెలుగు పాఠకులకు తెలియనే తెలియదు. మెయిన్, పాకెట్, సండే శీర్షికల కార్టూన్లు, పోస్టర్లు, చిన్నా చితకా ఉద్యమ పత్రికలకు వేసే కవరేజ్ కార్టూన్లు, రాజకీయ పార్టీల ప్రచారానికి బినామీ పేర్లతో వేసే కార్టూన్లు అన్నీ కలిపి వెరసి అన్ని వేల సంఖ్యకు చేరాయి.

✦✦✦

వారింట్లో బీరువా తెరిస్తే అనేక నోట్ల కట్టలు బయట పడతాయి. పాకెట్లు, మెయిన్‌లు, సండేకార్టూన్లు, ఇతర కార్టున్లను వారి శ్రీమతి చంద్రకళ భద్రంగా పత్రికల నుంచి కట్ చేసి రబ్బరు బాండ్ తగిలించి రూపాయ కట్ట మాదిరిగా బీరువాలో పేరుస్తుండడం నేను చాలా సార్లు చూశాను. వాటిని చూపించి "ఇవే నేను సంపాదిస్తున్న డబ్బులు" అని శేఖర్ సరదాగా అంటాడు.

'కంభా' నుండి శేఖర్

1981లో తన తొలి కార్టూన్ అచ్చయిందని శేఖర్ అంటుంటాడు. తొలిరోజుల్లో ఆయన 'కంభా' అనే పేరుతో వేస్తూ ఉండేవాడు.

1989 ప్రజాశక్తి దినపత్రికలో కార్టూనిస్టుగా నిలద్రొక్కుకున్న తర్వాత ఆయన ఆలోచనా సరళి కార్టూన్ల స్వభావం, వాటిలోని విరుపు పూర్తిగా మారిపోయాయి.


ప్రతి అంశాన్ని పీడితుల కోణంలో సమాజంలోని భిన్న దొంతరల కోణంలో పరిశీలిస్తూ కార్టూన్లు వేయడం ప్రారంభించాడు. కాస్త మార్క్సిజం అవపోసన పట్టాక దానిని కార్టూన్లలోకి ఎలా తర్జుమా చేయాలో అర్థంకాక ఇబ్బంది పడేవాడు. కొలీగ్‌గా ఈ ఇబ్బందులన్నీ నాతో చర్చిస్తూండేవాడు. ఆ తరువాత శ్రీశ్రీ, గురజాడ, కాళోజి, చాప్లిన్ వంటి వారిని చదివాక... కాస్త నేషనల్, ఇంటర్నేషనల్ కార్టూనిస్టుల సంపర్కం పెరిగాక ఆయనకే ఒక అవగాహన వచ్చింది. ఎక్కువగా ఆర్.కె. లక్ష్మణ్‌ని గురుతుల్యుడిగా భావించేవాడు. రాజకీయాలను ఆయన విశ్లేషించే తీరును ఎక్కు వగా స్టడీ చేసేవాడు. ప్రజాశక్తి చెన్నై పత్రిక గనుక కార్టూన్లతో పాటు ఇతర ఇలస్ట్రేషన్లు, పోర్ట్రయేట్లు, క్యారికేచర్లు వేసే అవకాశం లభించింది. ఇక ఆయనకి 24 గంటలూ పనే.

వదులుకున్న ప్రభుత్వ ఉద్యోగం

ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి చేసి కేవలం 1200 రూపాయల జీతానికి ఏరికోరి కార్టూనిస్టుగా ఉద్యోగం చేస్తున్న శేఖర్‌ని చూసి ఆయన మిత్రులం మేము ఆశ్చర్యపోయేవాళ్ళం. అది శేఖర్‌కి కార్టూన్ రంగం మీద గల ప్రేమ, కమిట్‌మెంట్ అని తరువాత అర్థమైంది.

ఆయన ఉత్సాహం, మక్కువ చూసి డెస్క్‌లోని సీనియర్లందరం ఆయనని ఎంకరేజ్ చేసేవారు. కార్టూన్ రంగంకోసం రెండు ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకున్న ఘనత శేఖర్‌దే.





ఓసారి శేఖర్ అన్నయ్య గారు శేఖర్ గ్రూప్-4లో క్లరికల్ క్యాడర్‌లో సెలక్ట్ అయిన లెటర్ తీసుకుని విజయవాడ వచ్చారు.

అప్పటికే కార్టూన్‌ను ఆవహింపజేసుకొని ఉన్న శేఖర్ ఆ ఉద్యోగం పట్ల విముఖత చూపాడు.

నిత్యవిద్యార్థి

శేఖర్ ప్రజాశక్తిలో కార్టూన్లు గీయడంతో పాటు అనేక పనులు చేసేవాడు. సబ్ ఎడిటర్‌గా, రిపోర్టర్‌గా, సినిమా రివ్యూయర్‌గా పలు విభాగాల పనులు చేసేవారు. ముఖ్యంగా ఆదివారం స్పెషల్‌లో ఆయన కార్టూన్ కాలం కొన్నేళ్ళపాటు నిరంతరం కొనసాగింది. అక్కడ ఆయన తను చదువుకున్న తెలుగు సాహిత్యాన్ని తన రాజకీయ కార్టూన్లను మిక్స్ చేసి ఓ కొత్త కార్టూన్ బాణీ సృష్టించాడు. అవి నేటికీ చావులేనివే.

ఒక దశలో "రోజుకి 24 గంటలు సరిపోవడం లేదు ఏడు కొండలు" అని అంటుండేవాడు. అలా పడిన పునాది ఆ తరువాత ఆయన కార్టూన్ల రంగంలో తన సిల్వర్‌జూబ్లీని తేలికగా పూర్తి చేసుకోవడానికి ఉపయోగపడింది.

విభిన్న అంశాల కార్టూన్లు

కేవలం రోజువారి రాజకీయ కార్టూన్లే కాకుండా సోవియట్ పతనం మీద, ప్రపంచీకరణ మీద, మతోన్మాదం, అధిక ధరలు, అమెరికా డాలర్, రూపాయలపై ఇతర కార్టూనిస్ట్‌లు ఎవరూ ముట్టని అంశాలపై లెక్కకు మిక్కిలి కార్టూన్లు గీశాడు. ఆయన తనదైన స్ట్రోక్ కోసం కూడా విడిగా ప్రయత్నం చేయలేదు. అవసరాల కొద్దీ ఇతర సీనియర్ కార్టూనిస్ట్‌ల శైలిని అనుకరిస్తూ కొంత కాలానికి తనదైన 'శైలిని' క్రియేట్ చేసుకున్నాడు. కార్టూన్ ఐడియాల మీద శేఖర్‌కి విపరీతమైన కమాండ్ ఉంది.

చాలా కార్టూన్లకు ఆయన ఇచ్చే సబ్ హెడ్డింగ్స్ నవ్వించి తీరుతాయి. వ్యంగ్యం అంతా అందులోనే ఉంటుంది.

ఏడెనిమిది పుస్తకాలు తీసుకురావచ్చు

వేర్వేరు అంశాల మీద ఇప్పటికీ అనేక పుస్తకాలు ప్రచురించినప్పటికీ అచ్చయిన తన కార్టూన్లతో కనీసం ఏడెనిమిది కార్టూన్ సంపుటాలు తేవచ్చు అంటాడు శేఖర్.

అందరికీ స్ఫూర్తిదాయకం!

'87 ప్రాంతాల్లో నేను ఆంధ్రజ్యోతిలో కార్టూనిస్ట్‌గా పనిచేస్తున్న రోజుల్లో శేఖర్, నేను తరుచుగా కలుస్తుండేవాళ్లం. తను ఉస్మానియాలో పీజీ చేస్తుండేవాడనుకుంటా. అంత దూరన్నుంచి, బంజారాహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి ఆఫీస్ కొచ్చేవాడు, మా మధ్య కేవలం కార్టూన్ గురించి చర్చలే జరిగేవి. తను గీసిన కార్టూన్లు చూపిస్తూ చాలా విషయాలు డిస్కస్ చేసేవాడు, అవి ఇద్దరికీ ఉపయోగకరంగా ఉండేవి. నేను అక్కడినుండి 'సుప్రభాతం' మీదుగా 'ఇండియా టుడే'లో చేరడం, శేఖర్ ప్రజాశక్తి, ఇతర పబ్లికేషన్లు దాటి ఆంధ్రజ్యోతిలో కార్టూనిస్ట్‌గా నిలదొక్కుకోవడం, ఏళ్లు గడిచిన ఇంకా మాకు వర్తమానమే. పొలిటికల్ సైన్స్ చదివిన విద్యార్థిగా, తనకున్న సునిశితమైన రాజకీయ అవగాహనను కార్టూన్‌లోకి తర్జుమచేసి కత్తులు ఝళిపించాడు శేఖర్.

సమాజం ఎటు నడిపిస్తే అటు కొట్టుకుపోవడం కాకుండా, జీవితం పట్ల ఒక దారి తెలిసిన వ్యక్తిగా, తనను తనవాళ్లను తీర్చిదిద్దుకున్నాడు శేఖర్.

చెల్మలో కలువ తీయడమే తెలిసిన తన సహచరి చేతులకు ఎక్కడాపొంతన లేని, అత్యాధునికమైన కంప్యూటర్‌పై అద్భుతాలు చేయ నేర్పిన శేఖర్ కార్టూనిస్టే కాదు... కార్యశూరుడని అనకుండా ఉండగలమా!

